Prajalakshyam Telugu Daily

# ప్రజాలక్ష్యం

తెలుగు దిన పత్రిక

ఎడిటర్ : గోలి సమ్మిరెడ్డి

సంపుటి: 17 | సంచిక: 13 | కరీంనగర్ | ఆదివారం 7 జూన్ 2026 | పేజీలు: 12 | వెల: 2.00

## ఆనంద్‌నగర్ కాలనీలో లిఫ్ట్ ప్రమాదం

**- మహిళ మృతి...బాలుడికి తీవ్ర గాయాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 6 : ఖైరతాబాద్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆనంద్ నగర్ కాలనీలో ఉన్న భావన అపార్ట్ మెంట్స్‌లో లిఫ్ట్ ప్రమాదంలో ఓ మహిళ ప్రాణాలు కోల్పోగా, ఆమెతో ఉన్న మనవడు గాయపడ్డాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ఆనంద్ నగర్

11 లో

## కరీంనగర్‌లో కూలిన లిఫ్ట్

**ఎమ్మెల్యే కవ్వంపల్లికి తప్పిన ప్రాణాపాయం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 6 : మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పెను ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు ఎమ్మెల్యే వెళ్లారు. అయితే, కెమిస్ట్ భవన్ రెండో అంతస్తు నుంచి దిగుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. ప్రమాద సమయంలో

11 లో





### అష్టదరిద్రులు అడ్డంపడ్డా

# అభివృద్ధి ఆగదు



**- ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ నిర్మిస్తాం - వ్యవసాయాన్ని పండగ చేయడమే మా లక్ష్యం**
**- వరి వేస్తే ఉరి అనే రోజులు పోయాయి - కాళేశ్వరం లేకున్నా లక్ష టన్నుల ధాన్యం పండింది**
**- ఇంతకాలం ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం అంటూ ప్రచారం - ధాన్యం కొనకుంటే మోడీ సంగతి తేలుస్తాం - అభివృద్ధి నిరోధకంగా బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు**
**- కోహెడ పండ్ల మార్కెట్‌కు శంకుస్థాపనలో సిఎం రేవంత్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రంగారెడ్డి, జూన్ 6 : రంగారెడ్డి జిల్లాలోని కోహెడలో నిర్మించనున్న సమీకృత పండ్ల మార్కెట్ మనకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్థానికంగా పండ్ల మార్కెట్‌తో పాటు ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ కాంప్లెక్స్‌కు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు. నగరంలోని పండ్ల మార్కెట్‌ను కోహెడకు తరలించినప్పుడు తాత్కాలిక టెంట్లు వేశారు. గాలివాన వచ్చినప్పుడు రైతులకు గాయాలయ్యాయి. ఇంటిగ్రేటెడ్ పండ్ల మార్కెట్ నిర్మిస్తానని నాడు ఎంపీగా ఉన్నప్పుడు హామీ ఇచ్చాను. పండ్లు, కూరగాయలు అన్నీ లభించేలా ఈ మార్కెట్‌ను నిర్మిస్తున్నాం అన్నారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయి. తాగేందుకు నీళ్లు ఉండవు.. కూర్చునేందుకు స్థలం ఉండదు. అందుకే అన్ని వసతులతో కూడిన ఇంటిగ్రేటెడ్ సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులు నిర్మిస్తున్నాం. అంతర్జాతీయ సదుపాయాలు కల్పించుకుంటేనే.. మనది అంతర్జాతీయ నగరం అవుతుంది. ఎవరెంత ఏడ్చినా.. ఆర్ఆర్ఆర్ ఆగదు. అభివృద్ధి కూడా ఆగదు. వ్యవసాయం దండగ కాదు.. పండగ అని నిరూపిస్తున్నాం. కాళేశ్వరం కూలేశ్వరం అయినా.. దేశంలోనే అత్యధిక వరి పండిస్తున్నాం. వరి వేస్తే.. ఉరే అని చెప్పిన రోజులు

11 లో

### కాంగ్రెస్ పాలనలో

# పాలమూరుకు ద్రోహం

**- తెలంగాణ నీటిని ఎపికి దోచిపెట్టే కుట్ర**
**- సగునీటి సలహారుగా ఆంధ్రాప్రాంత వ్యక్తి**
**- మీడియా సమావేశంలో మాజీమంత్రి శ్రీనివాసగౌడ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబ్‌నగర్, జూన్ 6 : కాంగ్రెస్ పాలనలో అన్ని జిల్లాల కంటే ఎక్కువ నష్టం మహబూబ్‌నగర్ కు జరిగిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ నీటిని ఆంధ్రాకు దోచిపెట్టే కుట్రలు జరుగుతున్నాయని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఆంధ్రా వ్యక్తిని సాగునీటి సలహాదారుగా పెట్టి తెలంగాణకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఏపీకి నీళ్లు తీసుకుపోయి పాలమూరును ఎండబెడతారంట అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే టెండర్లు పిలిచి పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. నిన్న మంత్రి, ముఖ్యమంత్రి మాటలకు ప్రజల నుంచి స్పందన లేదని తెలిపారు. ఇప్పటికైనా చిల్లర మాటలను సీఎం రేవంత్ రెడ్డి మానుకోవాలని హితవుపలికారు. పాత చింతకాయ పచ్చడిలా రేవంత్ రెడ్డి ప్రసంగం ఉందని ఎద్దేవా చేశారు. మహబూబ్‌నగర్‌లో శనివారం ఉదయం మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో కలిసి శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. సీఎం పర్యటన గురించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు ఆశతో ఎదురు చూశారని తెలిపారు. కానీ ఉమ్మడి జిల్లా ప్రజలకు సీఎం ఇచ్చింది ఏమీ లేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి వచ్చి కేసీఆర్ కట్టిన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లను పరిశీలించిన వెళ్లారని తెలిపారు. కర్ణాటక జల దోపిడీకి మనం నిధులు ఇవ్వడమేంటని ఆయన ప్రశ్నించారు. బనకచర్ల ప్రాజెక్టును సీఎం ఎందుకు వ్యతిరేకించడం లేదని నిలదీశారు. ఇప్పటికే జూరాలకు చుక్కనీరు వస్తలేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని ప్రాజెక్టులను పడావు పెడుతున్నదని విమర్శించారు. కర్ణాటకలో చర్చలు కొలిక్కి రాకుండానే

11 లో



## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

**- ఇదే తమ మొదటి డిమాండ్..కొనసాగిస్తాం కూడా**
**- ప్రవేశ పరీక్షల అవతవకలకు బాధ్య వహించాల్సిందే**
**- కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే డిమాండ్**
**- జంతర్ మంతర్ వద్ద ధర్నా... ధర్నాలో పాల్గొన్న పర్యావరణవేత్త వాంగ్‌చుక్**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

న్యూఢిల్లీ, జూన్ 6 : నీట్ తదితర ప్రవేశ పరీక్షలు, రిక్రూట్మెంట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న కష్టనష్టాలను పరిష్కరించేందుకు ప్రస్తుత విద్యా వ్యవస్థను సంస్కరించాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేసింది. తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ శనివారంనాడు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించింది. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఈ నిరసనలకు నాయకత్వం వహించగా, ప్రముఖ విద్యావేత్త, యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్, పార్టీ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇది సుదీర్ఘ పోరాటమని,

11 లో

### సత్వరంగా మహిళా సమాఖ్య

## భవన నిర్మాణాలు

**- అధికారులను ఆదేశించిన మంత్రి సీతక్క**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, జూన్ 6 : మహిళా సమాఖ్య భవనాల నిర్మాణా లు వేగవంతం చేయాలని మంత్రి సీతక్క సూచించారు. 8 వేల గ్రామాల్లో మహిళా భవనాల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. ఇవి మహిళల ఆత్మగౌరవ భవనాలని మంత్రి సీతక్క అభివర్ణించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, సర్ అధికారులతో మంత్రి సీతక్క శనివారం సచివాలయంలో

11 లో

## గండిపేట భూకబ్జా కేసు

**- వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లాకు 14 రోజుల రిమాండ్**
**- చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 6 : గండిపేట భూకబ్జా కేసులో అరెస్టైన వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు ఆయనను చంచల్‌గూడా జైలుకు తరలించారు. ఈ కేసు తెలంగాణ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.కాగా, భూకబ్జా కేసు లో నిందితుడిగా ఉన్న బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు

11 లో

### వైట్ కాలర్ జాబ్స్‌కు

## ప్రత్యామ్నాయం... బ్లూకలర్ జాబ్స్

**- పరిస్తితులకు అనుగుణంగా యువత్ స్కిల్ అలవర్చుకోవాలి**
**- జలవనరులను కాపాడేందుకే హైడ్రా ఏర్పాటు**
**- డ్రగ్స్ నివారణకు ఈగిల్ ఫోర్టస్ ఏర్పాటు**
**- సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




హైదరాబాద్, జూన్ 6 : ఉపాధి విషయంలో.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో స్కిల్స్ పెంచుకుంటే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చన్నారు. ఏఐ కారణంగా వైట్ కాలర్ జాబ్‌లు పోతున్నాయని అందరూ ఆందోళన చెందుతున్నారు. వైట్ కాలర్ జాబ్‌లకు ప్రత్యామ్నాయం బ్లూ కాలర్ జాబ్స్. యువతరం వాటిపై దృష్టి సారించాలి. అందుకు అవసరమైన స్కిల్స్ పెంచుకోవాలని

11 లో

## వర్షాకాలం వస్తోంది... ముందస్తు చర్యలకు సిద్ధం కండి

**- ధాన్యం కొనుగోళ్లు, సిఎం పర్యటనలపై జాగ్రత్తలు**
**- కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సిఎస్ ఆదేశాలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 6 : తెలంగాణలో వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉం డాని, ముందస్తు చర్యలకు దిగాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వర్షాల పరిస్థితులు, వరి కొనుగోళ్లు, ముఖ్యమంత్రి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. శనివారం సచివాలయంలో జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశంలో ఈ సమావేశంలో వర్షాల ప్రభావంపై ప్రత్యేకంగా చర్చించిన సీఎస్, అన్ని జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని

11 లో

## అన్నామలైకి భారీ ఫాలోయింగ్

**- 'వుయ్ ద లీడర్స్' ఉద్యమానికి భారీ మద్దతు**
**- ఒక్కరోజులోనే 14 లక్షలమంది ఫాలోవర్లు చేరిక**

చెన్నై, జూన్ 6 : తమిళనాడు రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీకి రాజీనామా చేసిన 24 గంటల్లోనే 14లక్షలకు పైగా ప్రజలు ఆయనతో చేరారు. తాను చేపట్టే 'వుయ్ ద లీడర్స్' ఉద్యమంలో చేరాలని కోరుతూ అన్నామలై ఆన్‌లైన్ లింక్ ను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో పెద్దఎత్తున స్పందన వస్తోంది. శుక్రవారం నుంచి శనివారం సాయంత్రానికి 14లక్షలకు పైగా ప్రజలు అందులో చేరారు. ఇంకా సభ్యత్వాలు కొనసాగుతున్నాయి. ఇదే పేరుతో ఆయన 2020లోనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. శుక్రవారం అన్నామలై మాట్లాడుతూ.. నైతిక రాజకీయాల కోసం ఏపీజే అబ్దుల్ కలాం కేంద్రాన్ని కోయంబత్తూర్‌లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో కొత్త పార్టీ పెట్టనున్నట్లు ప్రకటించారు. ఐపీఎస్ ఉద్యోగానికి రాజీనామా చేసి మంచి ఉద్దేశంతో నాడు భాజపాలో చేరానని, అదే ఉద్దేశంతో నేడు కొత్త పార్టీ వైపు అడుగులు వేస్తున్నట్లు తెలిపారు. ఒక సామాన్యుడు

11 లో

## సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

**- మలేషియా ప్రతినిధి బృందందతో మంత్రి శ్రీధర్ బాబు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్,జూన్ 6 : తెలంగాణలో సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. మలేషియా కంపెనీలు తెలంగాణలో భారీగా పెట్టుబడులు పెట్టేలా ముందుకు రావాలని సూచించారు. ప్రపంచ స్థాయి 'సెమీ కండక్టర్ ఎకోసిస్టం' అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా పని చేస్తోందని వెల్లడించారు. హైదరాబాద్‌ను చిప్ డిజైన్, ఎలక్ట్రానిక్స్, అధునాతన సాంకేతిక రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సెమీ కండక్టర్, ఏఐ, ఇన్నోవేషన్, లైఫ్ సైన్సెస్, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ వంటి రంగాల్లో అపార అవకాశాలు ఉన్నాయని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ డెస్టినేషన్'గా మార్చేందుకు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు

11 లో

## ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

**- భూదందాలో సిఎం కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ ప్రముఖులు**
**- తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపణలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 6 : రూ.లక్ష కోట్ల ప్రభుత్వ భూమిని రేవంత్ రెడ్డి సర్కార్ పెద్దలకు అప్పగిస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వ్యాఖ్యానించారు. శనివారం నాడు మీడియాతో

11 లో



# ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు పరిష్కరించడమే ప్రజా దర్బార్ లక్ష్యం

**- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క**

**- గుర్రంపేట రెవిన్యూ పరిధిలో ప్రజా దర్బార్**

**- ప్రజల సమస్యలను నాలుగు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్–భూపాలపల్లి, జూన్ 6 : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి వద్దకే వెళ్లి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. జిల్లాలోని భూపాలపల్లి మండలం గుర్రంపేట రెవెన్యూ పరిధిలోని గుర్రంపేట, రామ్ నాయక్ తండా, పెద్దాపూర్, బావుసింగ్‌పల్లి, సుబ్బక్కపల్లి గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టొప్పో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ములుగు నియోజకవర్గంలో ఇప్పటివరకు 70 గ్రామాల్లో ప్రజా దర్బార్ కార్యక్రమాలు నిర్వహించామని, ప్రజల నుంచి వచ్చిన సమస్యలను నాలుగు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, ఇప్పటికే లక్షకు పైగా పెన్షన్లు అందించామని, త్వరలో మరిన్ని పెన్షన్లు మంజూరు చేస్తామని చెప్పారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం గత రెండేళ్లలో మహిళా సంఘాలకు రూ.61 వేల కోట్ల రుణాలు అందించామని, ప్రస్తుతం రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులకు బీమా సదుపాయాలు, రేషన్ కార్డుదారులకు బీమా పథకం, కొత్త రేషన్ కార్డుల మంజూరు, సన్నబియ్యం పంపిణీ వంటి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించి 10 రోజుల్లో మంజూరు చేస్తామని, అవసరమైతే అదనపు ఇళ్లు కూడా కేటాయిస్తామని తెలిపారు. ఒంటరి మహిళలు, వృద్ధులకు తొలి విడతలోనే పెన్షన్లు అందజేస్తామని, గ్రామీణ రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గ్రామ, వార్డు సభల ద్వారా ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, రేషన్ కార్డులు, భూ భారతి తదితర అంశాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించి పరిష్కార చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారని, ఓటరు జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోందని, ప్రజలు తమ అభ్యంతరాలు, సూచనలు తెలియజేయవచ్చని కలెక్టర్ వివరించారు.




# రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలి

**- విత్తనాల నాణ్యతపై రాజీ లేదు, రైతుల సంక్షేమమే లక్ష్యం.**

**- రైతుల నష్టాలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు.**

**- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 6 : జిల్లాలోని రైతాంగానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎరువులు సూక్ష్మ పోషకాలను అందించాలని రాష్ట్ర పంచాయతీల శాఖ మంత్రి సీతక్క అధికారులకు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనములు,ఎరువులు, పురుగు మందుల డీలర్ల శిక్షణ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్కముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని విత్తన కంపెనీలు, డీలర్లు,ఆర్గనైజర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. రైతులకు విక్రయించే విత్తనాల నాణ్యతపై ఎలాంటి రాజీ పడకూడదని,ప్రతి లావాదేవీకి సంబంధించి పూర్తి వివరాలతో పారదర్శక ఒప్పందాలు ఉండాలని తెలిపారు.గతంలో కల్తీ విత్తనాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయిన ఘటనలు జిల్లాలో చోటుచేసుకున్నాయని గుర్తు చేస్తూ అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా కంపెనీ యాజమాన్యాలు,డీలర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. రైతుల నష్టాలకు కారణమయ్యే నాసిరకం,నకిలీ విత్తనాల విక్రయాన్ని ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. విత్తనాల చట్టం ప్రకారం అన్ని నిబంధనలను ఖచ్చితంగా అమలు చేయాలని,వ్యవసాయ అధికారులు,గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాల వ్యవసాయ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు,విత్తనాలు ఎలాంటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పట్టాలు లేని రైతుల పరిస్థితిని ప్రత్యేకంగా గుర్తించి,వారికి కూడా ఎరువులు,ఇతర వ్యవసాయ అవసరాలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.పట్టాలు లేని రైతుల సంఖ్యపై మండలాల వారీగా అంచనా వేసి వారిని కూడా వ్యవసాయ సేవల పరిధిలోకి తీసుకురావాలని అన్నారు.గతంలో కొన్ని ప్రాంతాల్లో ఎరువుల కొనుగోళ్ల విషయంలో అపోహలు, అనవసర నిల్వలు ఏర్పడిన నేపథ్యంలో ఈసారి ముందస్తు ప్రణాళికతో అవసరాలను అంచనా వేసి సరఫరా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. వ్యవసాయ రంగంలో పారదర్శకత, సమన్వయం, ముందస్తు ప్రణాళిక ఎంతో ముఖ్యమని రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతుల సంక్షేమం, పంటల విజయవంతమైన సాగు ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జీ., సంపత్ రావు,గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి,ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి,పంచాయతీ రాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి సురేష్ కుమార్,సంబంధిత అధికారులు, డీలర్లు,తదితరులు పాల్గొన్నారు.



# గ్రామసభలతో ప్రజా సమస్యలు పరిష్కారం

**- పచ్చదనం, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి**

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 6 : పచ్చదనం , పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని..గ్రామ సభలతో ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. శనివారం కొత్తపల్లి మండలం బద్దిపల్లి గ్రామంలో ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. కలెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారమవుతాయని గ్రామస్తులకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య నిర్వహణకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. పైపులైన్ల మరమ్మత్తులు, ఓవర్ హెడ్ నీటి ట్యాంకులను శుభ్రం చేయించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి తొలగించాలన్నారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకుంటూ వర్షపు నీటిని సంరక్షించాలన్నారు. పచ్చదనం, పారిశుద్ధ్యం, తాగునీరు, వైద్యం వంటి చిన్న అంశాలపై ప్రత్యేక దృష్టి సారించిన గ్రామాలే జాతీయస్థాయిలో అవార్డులు సాధిస్తున్నాయని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, వసతులను సద్వినియోగం చేసుకొని సుస్థిర అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. నిబంధనల మేరకు చెత్త నిర్వహణ చేపట్టాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్, బడిబాట గురించి వివరించారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి గ్రామస్తుల సమస్యలు పరిష్కరించాలని కార్యదర్శిని ఆదేశించారు. ఇన్చార్జి ఆర్డీవో వెంకటరెడ్డి మాట్లాడుతూ సర్ లో భాగంగా ఓటరు నమోదు జాబితా, మ్యాపింగ్ ప్రక్రియ గురించి వివరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈఓ ఆనందం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్ కంట్రోల్ ప్రత్యేక బృందాల ఏర్పాటు

**- గంజాయి,మత్తు పదార్థాల నిర్మూలనే లక్ష్యం**

**- పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 6 : రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి,ఇతర మత్తు పదార్థాల రవాణా, సరఫరా,నిల్వ, విక్రయం, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ తెలిపారు.కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్లలో సర్కిల్ వారీగా డ్రగ్ కంట్రోల్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే కమిషనరేట్‌లో ఒక ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో రెండు యాంటీ నార్కోటిక్ బృందాలు పనిచేస్తుండగా, వాటికి అదనంగా సర్కిల్ స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మత్తు పదార్థాల అక్రమ రవాణా మూలాలను గుర్తించడంతో పాటు, వాటి సరఫరా, వినియోగంపై మరింత కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ ప్రత్యేక బృందాలు గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచార సేకరణ, అనుమానాస్పద వ్యక్తులు,ప్రాంతాలపై నిఘా నిర్వహించడంతో పాటు,సమాచార దాతల వ్యవస్థ (ఇన్‌ఫార్మర్ నెట్‌వర్క్),ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రత్యేక దాడులు నిర్వహిస్తాయని పేర్కొన్నారు.రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాల సరఫరా, రవాణా,నిల్వ, విక్రయం లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే రామగుండం పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712656597కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.మత్తు పదార్థాలు యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు సమాజ అభివృద్ధికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాల శ్రేయస్సు కోసం గంజాయి,మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.


# బాధితులకు న్యాయం చేస్తూ నేరస్తులకు శిక్ష పడేలా కృషి చేయాలి


**- పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి - పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 6: నేరస్తులకు శిక్ష పడడంలో కోర్టు డ్యూటీ పోలీస్ అధికారుల పాత్ర కీలకమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝూ పేర్కొన్నారు. శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కోర్టు డ్యూటీ,కోర్టు లైజనింగ్ పోలీస్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యంగా మహిళలపై జరిగే నేరాలు,ఆస్తి సంబంధిత నేరాలు, శారీరక దాడులు తదితర కేసుల్లో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడే విధంగా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, బలమైన సాక్ష్యాధారాలను కోర్టులో ప్రవేశపెట్టి, న్యాయస్థానంలో సమర్థవంతంగా కేసులను వాదించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.బాధితులకు సత్వర న్యాయం అందేలా దర్యాప్తు అధికారులు,కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నేరస్తులకు శిక్ష పడడం ద్వారా బాధితుల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం పెరుగుతుందని, సమాజంలో నేరాల నియంత్రణకు కూడా ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.ఎన్‌బీడబ్ల్యూలు , సమన్లను తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.కేసులు విచారణలో ఉన్నప్పుడు కేవలం కోర్టుకు హాజరుకావడం మాత్రమే కాకుండా, నిందితులకు శిక్షలు పడేలా చూడటం కూడా పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు.సరైన సమయంలో సమన్లు జారీ చేయడం, అవసరమైతే నిందితుల ఆస్తులను జప్తు చేయడం వంటి ప్రక్రియలను ఆలస్యం చేయకుండా వెంటనే చేపట్టాలన్నారు.రామగుండం కమిషనరేట్ పనితీరు కోర్టు డ్యూటీ,లైజనింగ్ అధికారుల పనితీరుపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.ప్రజలు, ముఖ్యంగా బాధితులు పోలీసులను ఎంతో నమ్మకంతో ఆశ్రయిస్తారని, నేరస్తులకు శిక్ష పడేలా చేసి వారికి భరోసా కల్పించడం పోలీసుల బాధ్యత అని పేర్కొన్నారు. సాక్షుల వాంగ్మూలాలు, సాంకేతిక ఆధారాలు, వైద్య ఆధారాలను సమగ్రంగా సేకరించి కోర్టుకు సమర్పిస్తేనే నేరస్తులకు శిక్ష విధించడం సాధ్యమవుతుందని తెలిపారు.తద్వారా నేరస్తుల్లో నేరాలకు పాల్పడాలనే ఆలోచనకే భయం కలిగే పరిస్థితి రావాలని అన్నారు.రానున్న రోజుల్లో నేరాల నిరూపణ శాతాన్ని మరింత పెంచి, నిందితులకు శిక్షలు పడేలా చేయడం ద్వారా బాధితుల్లో పోలీస్ వ్యవస్థపై మరింత విశ్వాసం పెంపొందించాలన్నారు. నేరం జరిగిన వెంటనే,ఆ సంఘటన ప్రభావం తగ్గకముందే శిక్ష విధించబడితే అది నేరస్తులపై తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.కాంటెస్టెడ్ కేసుల్లో నిందితులు బాధితులను బెదిరించడం లేదా ఇతర ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉంటుందని,అలాంటి సందర్భాల్లో కోర్టు డ్యూటీ అధికారులు బాధితులతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే సంబంధిత ఎస్‌హెచ్‌వో, ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.ఎప్పటికప్పుడు సీసీలను పరిశీలిస్తూ, సాక్షులు, ముద్దాయిలు కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బందికి వృత్తిపరంగా లేదా వ్యక్తిగతంగా ఏవైనా సమస్యలు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని తెలిపారు.సమర్థవంతంగా పనిచేసే సిబ్బందికి తగిన గుర్తింపు, ప్రోత్సాహకాలు తప్పకుండా ఉంటాయని పేర్కొన్నారు.మీ పనితీరుతోనే బాధితులకు న్యాయం చేస్తూ,పోలీస్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం పెంపొందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బంది,కోర్టు లైజనింగ్ అధికారులను పోలీస్ కమిషనర్ శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, వర్టికల్ ఇన్‌చార్జి ఇన్స్ పెక్టర్ చంద్రశేఖర్ గౌడ్,సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్,బాబురావు, ఎస్ఐ వినీత,కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.






# ప్రకృతి మిత్ర ఆధ్వర్యంలో పర్యావరణ అవగాహన సదస్సు

**- పర్యావరణ రక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి - సింగరేణి శ్రీరాంపూర్ జిఎం మునిగంటి శ్రీనివాస్..**

**- ప్రకృతి మిత్ర వ్యవస్థాపకుడు గుండేటి యోగేశ్వర్ పిలుపు**

(ప్రజాలక్ష్యం బ్యూరో)

మంచిర్యాల జూన్ 6 : రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యాన్ని నియంత్రించడానికి పర్యావరణాన్ని రక్షించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని సింగరేణి కాలరీస్ శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలోని నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ లో ప్రకృతి మిత్ర పర్యావరణ సామాజిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ ప్రకృతి లేకపోతే మానవాళితోపాటు జీవరాశుల మనుగడ లేదని, నేల,నీరు,వాయు కాలుష్యాల నుంచి ప్రకృతిని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సింగరేణిలో పారిశ్రామిక, ప్రత్యేక అవసరాల రీత్యా బొగ్గు వెలికితీస్తున్నప్పటికీ పర్యావరణాన్ని కాపాడడానికి గాను శ్రీరాంపూర్ సింగరేణి ప్రాంతంలో ఇప్పటివరకు 22 లక్షల మొక్కలు నాటేమన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని సాధ్యమైనంత వరకు నియంత్రిస్తూ వాటి స్థానంలో పర్యావరణానికి మేలు చేసే వస్తువులను ఉపయోగించాలన్నారు. సింగరేణి . ఇది అలా చెట్లు ఎక్కువగా పెంచడం వల్లనే ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి అన్నారు. ప్రకృతి మిత్ర కార్యక్రమాలను కమిటీని ప్రత్యేకంగా అభినందించి సంతోషం వ్యక్తం చేశారు. అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు. ప్రకృతిమిత సేవలు వినియోగించుకుంటామని తెలిపారు. ప్రకృతిమిత్ర వ్యవస్థాపక అధ్యక్షులు తెలంగాణ ప్రభుత్వ “వాల్టా” అథారిటీ పర్యావరణవేత్త గుండేటి యోగేశ్వర్ మాట్లాడుతూ సింగరేణి ప్రాంతంలోని ప్రజలు కార్మికులు ప్రకృతి అలవాట్లు పెంపొందించుకొని పర్యావరణ రక్షణలో మన ప్రాంతం రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ ప్రాంతంలో పూర్వం దట్టమైన అడవులు ఉండటంవల్లనే మనం ఇక్కడ బొగ్గు లభ్యతవుతుంది. బొగ్గు బావుల వల్లనే మనం ఎంతో అభివృద్ధి చెందామని. ఈ ప్రాంతంలోని వనరులను కలుషితం కాకుండా సింగరేణి చర్యలు తీసుకున్నప్పటికీ మన వంతుగా కృషి చేయాలి అన్నారు. బజారుకు బట్ట సంచి తోనే వెళ్లాలని ప్రతి పుట్టినరోజు శుభ సందర్భంగా మొక్కలు నాటి రక్షించాలని, వేడుకల్లో గ్రీన్ గిఫ్ట్ లు అందించాలని, ప్లాస్టిక్ డబ్బాలు కవర్లు మానివెయ్యాలన్నారు. ఇంటింటా ఇంకుడు గుంత తప్పనిసరిగా ఏర్పరుచుకోవాలని సూచించారు. చిన్నచిన్న దూరాలకు సైకిల్ వాడాలని ప్రస్తుత వాతావరణ మార్పులతో ఎన్నో ప్రకృతి విపత్తులు సంభవిస్తున్నాయని ఈ తరుణంలో పర్యావరణంలో మార్పు కోసం ప్రతి ఒక్కరు చెట్లు పెంచడం ఉష్ణోగ్రతలు తగ్గుతాయి తగ్గుతాయన్నారు. సంస్థ ప్రధాన కార్యదర్శి గోగు సురేష్ కుమార్,యెస్.ఓ టు జిఎం ఎన్.సత్యనారాయణ మానవాళికి అడవులకు గల సంబంధాన్ని ,వివిధ ప్రయోజనాలను, అడవుల్లో నరికివేస్తే కలిగి నష్టాలు సంబంధాన్ని వివరించారు. ఈ సందర్భంగా ప్రకృతి మిత్ర ఆధ్వర్యంలో ప్లాస్టిక్ సంచులకు ప్రత్యామ్నాయంగా తయారుచేసిన బట్ట సంచులను ఉచితంగా పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రకృతి విలపిస్తోంది అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రెస్ క్లబ్ ప్రాంగణంలో జిఎం సంస్థ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ప్రకృతి మిత్ర సామాజిక పర్యావరణ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండేటి యోగేశ్వర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను యోగేశ్వర్ గ్రీన్ గిఫ్ట్.. నూలుతో చేసిన శాలువా, మట్టి పాత్రను అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ విభాగం ప్రధాన విభాగం హెచ్.ఓ.డి మీ హనుమాన్ గౌడ్, ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు భాస్కర్ల రాజేష్, పిసిబి మంచిర్యాల జిల్లా అధికారి వీరేశం, విశ్రాంత అటవీ అధికారి కె.మల్లయ్య, కొండు, జనార్ధన్, అల్లాడి శ్రీనివాస్‌లు సింగిల్ ఈజ్ ప్లాస్టిక్ వల్ల జరిగే నష్టాలపై మాట్లాడారు. బి రాజశేఖర్ ఎం. శరత్ చంద్ర, ఇ.వంశీ ప్రకృతిమిత్ర సభ్యులు, సింగరేణి కార్మికులు మహిళలు యువకులు పాల్గొన్నారు.పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో వివిధ ప్రకృతిమిత్ర ప్రదర్శనలను రాజేంద్రప్రసాద్, ఓవన్ బాక్స్ బహూకరించిన అయ్యప్ప ఓవన్ బాక్స్ కిరణ్, రజిత యాదగిరి, మంజుల ఏర్పాటు ఏర్పాటు చేసిన స్టాల్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి.



# పట్టా భూమిలో రోడ్డు నిర్మాణం ఆపాలి

**- ప్రభుత్వ భూమిని వదిలి బలవంతంగా పనులు చేస్తున్నారని ఆరోపణ**

**- వినతులు, కోర్టు తీర్పులను పట్టించుకోవడం లేదని మహ్మద్ మౌలానా ఆవేదన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 6 : ప్రభుత్వ భూమిని వదిలి తమ పట్టా భూమిలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారని, దీనిపై పలుమార్లు వినతులు ఇచ్చినా అధికారులు స్పందించడం లేదని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, రైతు మహ్మద్ మౌలానా ఆరోపించారు. న్యాయస్థానాల తీర్పులు, రెవెన్యూ నిబంధనలను కూడా పట్టించుకోకుండా పోలీసు బలగాలతో పనులు నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఖమ్మంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఏదులాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 64లో 6.36 ఎకరాలు, సర్వే నంబర్ 66లో 3.03 ఎకరాల భూమి తమ కుటుంబం ఏడు తరాలుగా అనుభవిస్తోందన్నారు. గతంలో రాజకీయ కక్షల నేపథ్యంలో తాను జైలులో ఉన్న సమయంలో ప్రభుత్వ డొంక భూమిని వదిలి తమ భూమిలో రోడ్డు నిర్మాణం చేపట్టారని తెలిపారు. ఈ సమస్యపై పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు న్యాయస్థానాలను కూడా ఆశ్రయించామని చెప్పారు. ఇటీవల ఆర్డీవో సమక్షంలో జరిగిన సమావేశంలో తమ పట్టా భూమిని వదిలి ప్రభుత్వ భూమిలోనే రోడ్డు నిర్మించాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా శుక్రవారం అర్ధరాత్రి భారీ పోలీసు బందోబస్తుతో అధికారులు తమ భూమిలో రోడ్డు నిర్మాణానికి ప్రయత్నించారని ఆరోపించారు. అడ్డుకున్న తమను పోలీస్ స్టేషన్‌కు తరలించారని తెలిపారు. కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారులు, పోలీసులు కుమ్మక్కై తమ భూమిలో రోడ్డు నిర్మాణం చేస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పక్కనే ప్రభుత్వ భూమి, ఎన్ఎస్పీ కాలువ స్థలం కలిపి సుమారు 70 అడుగుల వెడల్పు అందుబాటులో ఉందని, రోడ్డు నిర్మాణానికి ఎలాంటి అడ్డంకి లేదన్నారు. అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని, అవసరమైతే భూసేకరణ చట్టం ప్రకారం సర్వే నిర్వహించి తగిన పరిహారం చెల్లించిన తర్వాత మాత్రమే భూమిని తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పట్టా భూమిలో రోడ్డు నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. ఈ అంశంపై న్యాయపోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ మీడియా సమావేశంలో సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కే జానిమియా, సిద్ధినేని కర్ణకుమార్, అజ్మీర రామ్మూర్తి, ఏఐవైఎఫ్ నాయకులు మహ్మద్ గౌస్‌పాషా, స్థానికులు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ధ్యానం ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చు..

**- హార్ట్ ఫుల్ నెస్ సంస్థ కోఆర్డినేటర్ ఓడ్నాల మాధవి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, జూన్ ములుగు మున్సిపాలిటీ 9వ వార్డు కృష్ణ కాలనీలో రామచంద్ర మిషన్,హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ధ్యానోత్సవ కార్యక్రమం ప్రారంభం అయింది.ఈ కార్యక్రమానికి 9 వ వార్డు కౌన్సిలర్ గండ్రకోట వాణికుమార్ హాజరయ్యారు, ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ సంస్థ కో ఆర్డినేటర్ ఓడ్నాల మాధవి హాజరై మాట్లాడుతూ ఈ ఆధునిక జీవితంలో ఉరుకుల పరుగుల జీవన విధానంలో ఎదురయ్యే మానసిక ఒత్తిడి ఆందోళన సులువుగా అదేమించేందుకు ధ్యానం ఒక గొప్ప సువర్ణ అవకాశమని,ఈ మూడు రోజుల పాటు ధ్యానం నేర్చుకోవడం ద్వారా ప్రజలకు ఒత్తిడి లేని ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించడానికి మార్గం సుఖమవుతుందని అన్నారు. శ్రీనివాస్,పడమటి నరేష్, ప్రమీల, కృష్ణ, మహిళలు, వృద్ధులు యువకులు, పాల్గొన్నారు.



# నేటి బాలలే రేపటి నాయకులు :: అదనపు కలెక్టర్ నగేష్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మెదక్, జూన్ 06 : నేటి బాలలే రేపటి నాయకులని,మంచి లక్ష్యాలు ఏర్పర్చుకొని కృషి చేస్తే ఏ రంగంలో అయిన విజయాలు సాధించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ అన్నారు. శనివారం నాడు పాపన్నపేట మండల కేంద్రంలోని మంజీరా గార్డెన్‌లో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలపంచాయతీ కార్యక్రమానికి మెదక్ అదనపు కలెక్టర్ నగేష్,ఎస్పీ శ్రీనివాస్ రావులు ముఖ్య అతిథిలుగా హాజరై మాట్లాడారు.బాలల ఆలోచనలు,అభిప్రాయాలు సమాజ అభివృద్ధికి దోహదపడతాయని,చిన్న వయసు నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించు కోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.బాల పంచాయతీలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం,సమస్యలను విశ్లేషించే సామర్థ్యం, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.విద్యార్థులు విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు,సామాజిక స్పృహను అలవర్చుకోవాలని సూచించారు.గ్రామాలు,పాఠశాలలు,సమాజ అభివృద్ధిలో తమవంతు బాధ్యతను గుర్తించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.బాలలహక్కులపరిరక్షణ,విద్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాల్లోచురుకుగాపాల్గొనాలని సూచించారు.చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత,క్రమశిక్షణ అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నతస్థానాలనుఅధిరోహించగలరనిఅన్నారు.బాలపంచాయతీలు విద్యార్థుల్లో సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు సూచించే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. విద్యతో పాటు వ్యక్తిత్వ వికాసం కూడా ఎంతో ముఖ్యమని విద్య,క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టిసారించాలని సూచించారు. అనంతరం జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు మాట్లాడుతూ,పిల్లల ఆలోచనల్లోనే సమాజ భవిష్యత్తు దాగి ఉందన్నారు . బాలల అభిప్రాయాలకు విలువనిస్తూ వారికినిర్ణయాలు తీసుకునే అవకాశాలు కల్పించడం ద్వారా బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దవచ్చని, పాఠశాల స్థాయి నుంచే ప్రజాస్వామ్య విలువలను అలవర్చుకోవాలని విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.బాల పంచాయతీ వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో నాయకత్వ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, సామాజికస్పృహనుపెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.ప్రతి విద్యార్థి బాధ్యతాయుత పౌరుడిగా ఎదిగి సమాజ అభివృద్ధికితోడ్పడాలనిపిలుపునిచ్చారు.వివిధపాఠశాలల విద్యార్థులు బాలలహక్కులు, విద్యప్రాధాన్యత,బాల్యవివాహాల నిర్మూలన,పర్యావరణ పరిరక్షణ,గ్రామాభివృద్ధిలో యువత పాత్రవంటి అంశాలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

విద్యార్థులు తమ గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలను ప్రస్తావిస్తూ వాటి పరిష్కారానికి సూచనలు అందించారుఈకార్యక్రమంలో పాపన్నపేట మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ లింగం పేట పావని నరేందర్ గౌడ్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సిడబ్ల్యూసి ఉప్పలయ్య, డీసీపీఓ నాగరాజు,సీసీఎస్ సీఐ రాజశేఖర్ రెడ్డి,సీఐడి ఉమేన్ సేఫ్టీ వింగ్ సీఐ రాజేష్, రూరల్ సీఐ జార్జ్,యాంగిస్థాన్ ఫౌండేషన్ వృత్విక, విజన్ ఏంజిఓ రాజు,యాదగిరి, తహసీల్దార్ సతీష్,ఎంపీడీఓ విష్ణువర్ధన్,పిఎమ్ శ్రీ పాపన్న పేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, నాయకులు శ్రీకాంత్ అప్ప, మాజీ సర్పంచ్లు గురుమూర్తిగౌడ్,మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్,బీజేపీ మాజీ మండలపార్టీఅధ్యక్షులు రాములు,కిష్టయ్య,నాయకులు ముశెట్టి కిష్టయ్య,సుంకరి శివయ్య,దోసనీ సంగమేష్,కుర్తివాడ ప్రసాద్ గౌడ్, క్యాసేగల్ల ప్రవీణ్ గౌడ్,వివిధ గ్రామాల విద్యార్థులు,పోషకులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ఎంఎంఎస్‌లో రాష్ట్ర ప్రథమ స్థానం సాధించిన పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ మాస్కాపూర్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, జూన్ 6 : జాతీయ ప్రతిభా ఉపకార వేతన పరీక్ష ఫలితాల్లో పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ మాస్కాపూర్ విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. 2026 సంవత్సరానికి గాను విడుదలైన తుది ఎంపిక జాబితాలో పాఠశాల నుంచి 26 మంది విద్యార్థులు ఎంపికై తెలంగాణ రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించడం విశేషం. ఈ విజయంతో పాటు పాఠశాల మరో అరుదైన ఘనతను కూడా సొంతం చేసుకుంది. 2018 నుండి 2026 వరకు గత 8 సంవత్సరాల్లో మొత్తం 145 మంది విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ కు ఎంపిక కావడం పాఠశాల విద్యా ప్రగతికి నిదర్శనంగా నిలిచింది. ప్రతి సంవత్సరం విద్యార్థులను ప్రత్యేకంగా తీర్చిదిద్దుతూ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించడం పాఠశాల ప్రత్యేకతగా మారింది. ఈ ఘన విజయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గైడ్ టీచర్ జెడి శ్రీనివాస్ నాయకత్వం, ఉపాధ్యాయుల సమిష్టి కృషి, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల నిరంతర శ్రమ ప్రధాన కారణాలుగా నిలిచాయి. ప్రభుత్వ పాఠశా లల్లో కూడా నాణ్యమైన విద్య అందించి అత్యున్నత ఫలితాలు సాధించవచ్చని మాస్కాపూర్ పాఠశాల మరోసారి నిరూపించింది ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, రాష్ట్ర స్థాయి విజయాలు సాధించి పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ మాస్కాపూర్ సాధించిన ఈ విజయంపై విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ పాఠశాల సిబ్బందిని అభినందించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అవినీతి తప్ప అభివృద్ధి శూన్యం

**- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి**

**- 7 కోట్ల విలువైన వేరు శెనగ, కంది సబ్సిడీ విత్తనాల స్కాం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వికారాబాద్ (బొంరాస్‌పేట్), జూన్ 06 : కొడంగల్‌లో అవినీతి తప్ప అభివృద్ధి శూన్యమని బారాస మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి పాలన నుద్దేశించి నిప్పులు చెరిగారు. శనివారం బొంరాస్ పేట మండల కేంద్రంలో మండల మాజీ రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మహేందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం సొంత ఇలాకాలోనే సీఎంతో పాటు ఆయన సోదరుడు,కాంగ్రెస్ నాయకులు దోపిడీ కి, స్కాం లకు తెగ బడుతున్నారని దుయ్యబట్టారు. 622మంది రైతులకు అందాల్సిన 7 కోట్ల విలువైన వేరు శెనగ, కంది సబ్సిడీ విత్తనాల స్కాం జరిగిన సీఎం, మరియు జిల్లా కలెక్టర్ స్పందించక పోవడం సిగ్గు చేటని,ఆయన అవినీతి పాలనకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే సంచలన ఆరోపణలు చేశాడు. ఇసుక అక్రమ రవాణా కు పాల్పడితే తాట తీస్తానని తరుచూ ప్రగల్భాలు పలికే సీఎం, సొంత ఇలాకాలో కోట్ల రూపాయల ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ఎందుకు తాట తీయడం లేదో ఆంతర్యమెంటో ప్రజలకు తేల్చి చెప్పాలని సీఎం నుద్దేశించి మాజీ ఎమ్మెల్యే సూటిగా నిలదీశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన కాంగ్రెస్ సభలో, బారాస పార్టీ నుద్దేశించి సీఎం,రాబోయే ఎన్నికల్లో బారాస ఎమ్మెల్యేలను ఒక్కరినీ గెలువ నియ్యక , పార్టీని భూస్థాపితం చేస్తానని సీఎం చేసిన వ్యాఖ్యలపై మాజీ ఎమ్మెల్యే ఘాటుగా స్పందించారు. దమ్ము ధైర్యముంటే తక్షణ మే రాజీ నామ చేసి ఎన్నికల్లో తన తో పోటీ కి రావాలని, ఒక వేళ ఎన్నికల్లో తాను ఓటమి ఓటమి చెందితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాజీ ఎమ్మెల్యే పట్నం సీఎం కు సూటిగా సవాల్ విసిరారు. గత బారాస పాలనలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కు 27 వేల కోట్లు వెచ్చించి, 5 రిజర్వాయులు పూర్తి చేసి 9 మోటార్లు బిగించి కేసీఆర్ తొంబై శాతం పూర్తి చేస్తే , మోటార్లు స్టార్ట్ చేసే దమ్ము సీఎం కు లేదని ప్రాజెక్టు పై సీఎం వైఖరి నుద్దేశించి మాజీ ఎమ్మెల్యే మండి పడ్డాడు. ప్రాజెక్టు పై సీఎం కపట ప్రేమ మాను కోవాలని మాజీ ఎమ్మెల్యే హితవు పలికారు. 15 వేల ఎకరాలకు కూడా నిరందించని,8000 కోట్ల తో చేపట్టిన కొడంగల్ -నారాయణ పేట ఎత్తిపోతల పథకం,ఉత్తి పోతల పథకమే నని అది సీఎం కమీషన్ల కోసమే తల పెట్టిన ప్రాజెక్టని మాజీ ఎమ్మెల్యే తీవ్ర ఆరోపణలు చేశాడు. బారాస శ్రేణుల పై అధికారుల ఓవరాక్షన్ సహించారానిదని మాజీ ఎమ్మెల్యే మండిపడ్డాడు. కొడంగల్ నియోజకవర్గం లో కోట్ల రూపాయ లల్లో జరిగిన సబ్సిడీ విత్తనాల స్కాం మరియు ఇసుక అక్రమ రవాణా అవినీతి పై సీఎం తక్షణమే స్పందించి విచారణకు ఆదేశించని పక్షం లో మూడు రోజుల్లో బారాస ఆద్వర్యం లో జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ కార్యాలయాలు ముట్టడిస్తామని మాజీ ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ సమావేశం లో బారాస నాయకులు మరియు కార్యకర్తలు విష్ణు వర్ధన్ రెడ్డి, చాన్ పాష్,శేరి నారాయణ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఉప్పరి మహేందర్,శ్రావణ్ గౌడ్, లచ్చప్ప, ఖాజ మైనోద్దీన్, బాబర్,సురేష్, మడిగే శీను, కారేగారి శ్రీనివాస్ గౌడ్ , పకీర్ సలాం, మొమ్మ కిష్టయ్య, మాటూరి కేశవ్, పెద్ద మల్లేశం, దాసరి నర్సింలు ,నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వార్డు సభలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 06 : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శనివారం మహబూబాబాద్ పట్టణంలోని వివిధ వార్డులకు సంబంధించిన వార్డు సభలు నిర్వహించారు. పాత బజారులోని వర్తక సంఘం హాల్‌లో 1, 11, 12, 13, 14, 27, 28, 32 వార్డులకు, కొత్త బజారులోని షాదీఖానాలో 21, 22, 23, 24, 25, 26, 36 వార్డులకు సమావేశాలు నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గుగులోత్ జ్యోతి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ సభల్లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2026, ఇంకుడు గుంతల ఏర్పాటు, పారిశుధ్య నిర్వహణ, రోడ్లు, వీధి దీపాలు, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణతో పాటు పలు ప్రజా సమస్యలపై చర్చించారు. ప్రజల సూచనలు, సమస్యలను అధికారులు నమోదు చేసుకుని పరిష్కార చర్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వినోద్ కుమార్, వార్డు కౌన్సిలర్లు దూపటి స్పందన, బోడ రవి, కాట భాస్కర్, నిమ్మల మాధవి, బొల్లు రాజు, రెహానా పర్వీన్, జరీనా బేగం, పద్మం ధనలక్ష్మి, బద్దెపూరి ఐశ్వర్య, సల్వాది దిలీప్, మాలోత్ శ్రీదేవి, ముత్యం వెంకన్న,మున్సిపల్ మేనేజర్ అంకుశావళి, మెప్మా డీఎంసీ విజయ,ఏఈ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కరుణాకర్, శ్రీహరి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ క్రాంతి, వార్డు అధికారులు శ్రావణ్, రెహమాన్, అనిల్, షారోన్, వరుణ్, సౌమ్య, రమేష్, బిల్ కలెక్టర్లు నాగేశ్వర్‌రావు, శ్రీను, మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

# సమస్యలపై నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలి

**- జిల్లా ఎస్పీ నితికా పంత్**

**- పాడిబండ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక**




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఆసిఫాబాద్, జూన్ 6 : ఆసిఫాబాద్ మండలంలోని పాడిబండ గ్రామంలో నిర్వహించిన "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక గ్రామసభ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామసభలో ప్రజలను, ముఖ్యంగా మహిళలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, బాలికలు తమపై జరిగే వేధింపులు, గృహహింస, సైబర్ నేరాలు, మోసాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్ వంటి నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని అన్నారు. మహిళలు, బాలికల భద్రతకు తెలంగాణ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొంటూ, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం పోలీస్ శాఖ అమలు చేస్తున్న పలు కార్యక్రమాల గురించి వివరించారు. షీ టీమ్స్, భరోసా సెంటర్లు, ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్ సేవలు, సైబర్ భద్రత అవగాహన కార్యక్రమాలు, డయల్-100, డయల్-112, హాక్ ఐ యాప్, మహిళా హెల్ప్‌లైన్-181, చైల్డ్ హెల్ప్‌లైన్-1098 వంటి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైనట్లయితే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే సమాచారం అందించాలని కోరారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, సమాజ అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచిం చారు. గ్రామసభలో గ్రామస్తులు తమ సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డీఎస్పీ అశోక్, ఆసిఫాబాద్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ వరప్రసాద్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, డివిజనల్ లెవల్ పంచాయతీ ఆఫీసర్ ఉమర్, భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఎస్ఐ దివ్య, జిల్లా,మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, యువత గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# "తెలంగాణకు రావాల్సిన నీళ్లకు చంద్రబాబు అనుమతి ఎందుకు?"

**- సీఎం పై నిరంజన్ రెడ్డి ఫైర్**

**- "చంద్రబాబు ఎన్ఓసీ కోసం కాదు...**

**- తెలంగాణ హక్కుల కోసం పోరాడాలి"**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 6 : తెలంగాణకు హక్కుగా రావాల్సిన సాగునీటి వాటా విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణకు రావాల్సిన నీటిని జాతీయ, అంతర్జా తీయ జలవనరుల సూత్రాల ఆధారంగా సాధించాల్సింది పోయి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి ఎన్ఓసీ కోరడం రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే చర్యగా ఆయన అభివర్ణించారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణకు రావాల్సిన నీటి వాటా కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా పోరాడాలని, కానీ చంద్రబాబు అనుమతి కోసం ఎదురు చూడటం సమంజసం కాదన్నారు. "తెలంగాణకు రావాల్సిన నీళ్లకు చంద్రబాబు అనుమతి ఎందుకు? ఎన్ఓసీ ఇవ్వడానికి చంద్రబాబు ఎవరు?" అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేశారనే విమర్శలు ఎదుర్కొన్న ఒక మాజీ ఐఏఎస్ అధికారిని సాగునీటి రంగ సలహాదారుగా నియమించడంపై కూడా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం, తెలంగాణ ప్రయోజనాల పట్ల అనుమానాలు కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సింది పోయి ఇతర రాష్ట్రాల అనుమతుల కోసం ప్రయత్నించడం ప్రజల్లో సందేహాలు రేకెత్తిస్తోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీ పడకుండా తెలంగాణ హక్కులను సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నిరంజన్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేస్తూ, "మీరు తెలంగాణ ప్రజల తరఫున పోరాడే ప్రభుత్వాధినేతవా? లేక ఇతరుల అనుమతుల కోసం తిరిగే పైరవీకారుడివా?" అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించి, రాష్ట్రానికి రావాల్సిన నీటి హక్కులను సాధించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

# భైంసా అభివృద్ధికి సమష్టి కృషి అవసరం


**- ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 6 : భైంసా మున్సిపాలిటీని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం భైంసా మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మున్సిపాలిటీ అభివృద్ధి సమీక్ష సమావేశంలో ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వెంటనే పరిష్కరించేలా అధికారులు పనిచేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ప్రజా అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ రూపొందించి పట్టణ అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వరదల నివారణ చర్యలు, ఘన వ్యర్థాల నిర్వహణ, పట్టణ పరిశుభ్రత, మొక్కల నాటకం, ఎస్ఐఆర్ ప్రక్రియ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించేందుకు త్వరలోనే మరో సమావేశం నిర్వహిస్తామని కలెక్టర్ వెల్లడించారు.

## అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలి : ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



మున్సిపాలిటీ అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎటువంటి విభేదాలకు తావు లేకుండా అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. ప్రతి వార్డులో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా కౌన్సిలర్లు చొరవ చూపాలని కోరారు. సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించాలని పేర్కొన్నారు.

## సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలపై కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ జానకి షర్మిల



ప్రజలంతా సామరస్య వాతావరణంలో కలిసి మెలిసి జీవించాలని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత దూషణలు, విద్వేషపూరిత వ్యాఖ్యలు లేదా కల్లోలాలు సృష్టించే విధంగా వ్యవహరించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, మున్సిపల్ కమిషనర్ యాదయ్య, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఈవీఎంల గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 06 : కురవి రోడ్‌లో కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్‌లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్‌లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు మరియు ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం నిర్వహణకు సంబం ధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాలక్ష్యం

సంపాదకీయం

## ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట ఏదీ ?

ఆర్థిక కుంభకోణాలు, మోసాలను పసిగట్టలేక పోతున్నారు. దేశంలో ఎవరు ఎలా దోచేస్తున్నారో గుర్తించడం లేదు. అధికారంలో ఉన్నవారిది ఒక రకమైన దోపిడీ, ఆర్థి కంగా ఉన్నవారిది మరో రకమైన దోపిడీ అన్నట్లుగా కాలం నడుస్తోంది. అధికారంలో ఉండి ఆర్థిక మోసాలకు పాల్పడ్డ వారిని ఏమీ చేయడం లేదు. వారు అక్రమాలకు పాల్పడ్డట్లు రుజువులున్నా బోను ఎక్కించడం లేదు. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇష్టారాజ్యంగా చేస్తున్న పనులపై నిఘా లేకుండా పోయింది. అజమాయిషీ లేదు. విచారణలు లేవు. తెలంగాణలో కాళేశ్వరం కథ కంచికి చేరింది. లక్షకోట్లు పెట్టి ఓ ప్రాజెక్ట్ కడితే అందులో అవతవకలు, ఆర్థిక మోసాలు జరిగాయన్న వారే దానిపై విచారణ జరిపించడం లేదు. ఇ-కార్ రేసులో నేరుగా విదేశీ సంస్థకు డబ్బులు చెల్లించినా కిమ్మనడం లేదు. ఎపిలో రుషికొండపై జగన్ ప్యాలెస్‌లు కట్టు కుంటే చర్యలు లేవు. మద్యం కుంభకోణానికి పాల్పడితే దిక్కులేదు. భూకుంభకోణ్నాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే దేశంలో అనేక ఆర్థిక మోసాలు జరిగాయి. విజయ్ మాల్యా, నీరవ్ మోడీ, లలిత్ మోడీ వంటివారు దేశం బయటనే ఉన్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు. దేశంలో కొందరు బ్యాంకులకు ఎగనామం వేస్తున్నా పట్టింపు లేదు. ఇవన్నీ కూడా ఇతరకుల ఆదర్శంగా నిలుస్తున్నాయని భావించాలి. తాజాగా రాజేష్ ఎక్స్‌పోర్ట్ లిమిటెడ్ (ఆర్‌ఇఎల్) భారీ ఆర్థిక అరాచకం దేశంలోనే కాదు అంతర్జాతీయ కార్పో రేట్ రంగాన్ని షేక్ చేస్తోంది. ఇలాంటి వారు మోసం చేస్తు న్నా... గుర్తించలేక పోయారు. ఎల్‌ఐసి లాంటి సంస్థ ఇందులో పెట్టుబడులు పెట్టి ఇప్పుడు భారీగా నష్టపోయింది. ఆర్థిక మోసాలను ఎంత చాకచక్యంగా చక్కబెట్టవచ్చో 'లక్కీ భాస్కర్' మూవీలో చూపించారు. 1980లనాటి షేర్ల స్కామ్ కింగ్ పిన్ బిగ్‌బుల్ హర్షద్ మెహతా షేర్ మార్కెట్‌ను ఎలా మోసం చేశడో గుర్తుండే ఉంటుంది. వ్యవస్థలోని లొసుగులను తమకు అనుకూలంగా మార్చుకొంటున్న పలువురు భారీ అక్రమాలకు బరితెగిస్తున్నారు. వారి చేతుల్లో ఎంతోమంది అమాయకులు మోసపోతున్నారు. సహారా ఇండియా, అగ్రి గోల్డ్, లీఫిన్ ఇండియా లాంటి సంస్థలు కూడా ఎంతగా మోసం చేశాయో చూసాం. ఇటీవల నల్లగొండ, కర్నూలు జిల్లాలో మైక్రో ఫైనాన్స్ మోసం బయటపడింది. అయినా ప్రభుత్వాలు కళ్లు తెరవడం లేదు. కఠిన నిర్ణయాలు తీసు కోవడం లేదు. చిట్టీల పేరుతో గ్రామాలు మొదలు పట్టణ్నాల వరకు కోట్లల్లో మోసలు చేస్తూనే ఉన్నారు. తాజాగా బెంగళూ రుకు చెందిన ప్రముఖ బంగారం, ఆభరణాల దిగ్గజం ఆర్‌ఇ ఎల్ తన వాస్తవ ఆదాయాన్ని రూ. 15.15 లక్షల కోట్లు అధికంగా చూపించి, తన షేర్ వాల్యూను భారీగా పెంచు కొని, మదుపరులను, అలాగే ప్రభుత్వ వ్యవస్థలను మోసగించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయింది. ఈ విషయాన్ని సెక్యూర్టీస్ అండ్ ఎక్సేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా సెబి విచారిస్తే తప్ప వెలుగులోకి రాలేదు. ఆర్‌ఇఎల్ స్కాం దేశ కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద కుంభకోణంగా చెబుతున్నారు. ఇలాంటి స్కామే 2009లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సత్యం కంపెనీలో జరిగింది. రూ. 7,800 కోట్ల మేర కంపెనీ బ్యాలెన్స్‌షీట్‌లో తేడా వచ్చింది. ఎక్కువ ఆదాయం చూపించి సత్యం కంపెనీ షేర్ విలువను పెంచుకుందని ఆరోపణలొచ్చాయి. ఈ కేసులో సత్యం కంపెనీ అధినేత రామలింగరాజుకు ఏడేళ్ల జైలు శిక్ష పడింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రిసెర్చ్ సంస్థ అదానీ కంపెనీ ఆర్థిక మోసాలను ఆధారాలతో సహా 2003 జనవరిలో బయటపెట్టడం పెను సంచలనం అయింది. ఆదానీ గ్రూపు తమ షేర్ విలువను పెంచుకునేందుకు గ్రూపు ఆదాయాన్ని అధికంగా చూపించడంతోపాటు పలు ఆర్థిక అవకతవకలకు పాల్పడిందన్నది ప్రధాన అభియోగం. దాంతో అదానీ ఆర్థిక సామ్రాజ్యం రూ.లక్షల కోట్ల మేర పతనమైంది. తూతూ మంత్రంగా సెబి దర్యాప్తు సాగింది. చివరికి అదానీ గ్రూపుపై 'హిండెన్‌బర్గ్'వి ఆధారాల్లేని ఆరోపణలుగా కొట్టిపారేసింది. ఉదారవాద ఆర్థిక విధానాలే ఆర్థిక స్కాంలకు మూలం. ఓ సామాన్యుడు సెబీకి లేఖ రాయడం, అది విచరణ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్‌ఇఎల్ కంపెనీ ప్రమోటర్, ప్రస్తుత ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అయిన రాజేష్ మెహతాను సెక్యూర్టీస్ మార్కెట్ నుంచి తాత్కాలికంగా నిషేధించింది. ఆర్‌ఇఎల్ అక్రమాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలుకానీ, నిఘా విభాగాలు కానీ గుర్తించలేకపోవడం వ్యవస్థీకృతంగా ఉన్న జాడ్యంగా చూడాలి. ఒక సాధారణ ఇన్వెస్టర్ 2025లో ఇ-మెయిల్‌లో చేసిన ఫిర్యాదుతో తీగ లాగితే డొంక కదిలింది. సెబి రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టినా, కంపెనీకి సంబంధించిన ఆడిట్ రిపోర్టులను చూపించమని పలు మార్లు నోటీసు లిచ్చినా ఆర్‌ఇఎల్ యాజమాన్యం సహకరించలేదు. అందుకే సెబి ఆ సంస్థ స్కాంపై నివేదిక వెల్లడించాల్సి వచ్చింది. రార్పొరేట్ స్కాంలన్నింటిలో దండలో దారంలో కనిపించేది విదేశాల్లో ఆ సంస్థలు ఏర్పాటు చేసే అనుబంధ షెల్, సూట్‌కేస్ కంపెనీలు, వాటి ద్వారా ఈ దేశంలో అక్రమాలు. ఆర్‌ఇఎల్ కూడా అదే చేసింది. సిట్జర్లాండ్ నుంచి కథ నడిపించింది. ప్రపంచంలోనే అతిపెద్ద గోల్డ్‌రిఫయినరీ 'వాల్కంబీ'ని 2015 లో కొనుగోలు చేసింది. సంస్థ ఆదాయాన్ని రూ.వందల కోట్లను వేలు లక్షల కోట్లుగా తప్పుడు పద్ధతుల్లో చూపించిం ది. సంస్థ సి.ఎం.డి. రాజేష్ మెహతా తన వ్యక్తిగత ఖాతాలకు సంస్థ నిధులను భారీగా నిబంధనలకు విరుద్ధంగా మళ్లించా రు. సంస్థలో కీలక స్థానాల్లో ఉన్న మరి కొంత మంది సైతం ఇదే పని చేశారు. ఈ కఠోర విషయాలను సెబినే వెల్లడించిం ది. కంపెనీ కార్పొరేట్ గవర్నెన్స్ లోపభూయిష్టంగా ఉందని ఇప్పుడు గుర్తించడం ప్రభుత్వ వ్యవస్థల పనితీరులో డొల్లత నానికి నిదర్శనం. ఇలాంటివి ఇంకా ఎన్ని జరుగుతున్నాయెూ తెలియదు. బయటపడితే తప్ప తెలుసుకోలేం. ప్రజలు అనేక విధాలుగా ఇప్పుడు మోసపోతున్నారు. ఈ క్రమంలో పకడ్బందీ చర్యలతో ఆర్థిక మోసాలకు కళ్లెం వేయాలి. కేవలం సైబర్ మోసాలే కాకుండా ఇలాంటి బడా మోసాలపైనా దృష్టి సారించాలి.

# మందు బిళ్ళకు పైసల్లేవు కానీ...
# ప్రచారాలకు కోట్లా ?!

ఊహించుకోండి ఒక పేద తల్లి తన తీవ్ర జ్వరపడిన పిల్లాడిని ఒళ్ళో వేసుకుని ఏడు కిలోమీటర్లు సుదీర్ఘంగా నడిచి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తుంది. ఎంతో ఆశతో ఆసుపత్రి ద్వారం తెరిచి చూస్తుంది. కానీ అక్కడ డాక్టర్ లేదు, అవసరమైన మందులు లేవు, రోగి పడుకోవడానికి మంచాలు లేవు. అక్కడ ఉన్నది కేవలం కారుచీకటి మాత్రమే. ఆ తల్లి కళ్ళలో ఒక తీరని వేదనతో కూడిన ప్రశ్న మెదులుతుంది నా పిల్లాడు ఈ దేశ పౌరుడుకాదా? మా ప్రాణాలకు ఈ సమాజంలో విలువే లేదా? ఈ ఒక్క హృదయవిదారక దృశ్యం మన దేశ ఆరోగ్య విధానపు అసలు ముఖాన్ని, వ్యవస్థ వైఫల్యాన్ని అద్దంలో పట్టి చూపిస్తుంది. భారతదేశం తన స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో కేవలం 1.84 శాతం మాత్రమే ప్రజల ఆరోగ్యంపై వెచ్చిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సిఫార్సు ప్రకారం ఏ దేశమైనా కనీసం 5 శాతం బడ్జెట్ ఆరోగ్యం కోసం కేటాయించాలి. కానీ ప్రపంచంలోని ఇతర దేశాలను పరిశీలిస్తే అమెరికా 17 శాతం, ఇంగ్లాండ్ 9 శాతం, మన పొరుగున ఉన్న చిన్న దేశం శ్రీలంక కూడా 4 శాతం వెచ్చిస్తున్నాయి. మనం 140 కోట్ల జనాభాతో ప్రపంచంలోనే అతిపెద్ద దేశంగా ఉన్నాం అయినా మన దేశంలో ఒక పౌరుడిపై పెట్టే తలసరి ఆరోగ్య వ్యయం కేవలం 1,944 రూపాయలు మాత్రమే! అంటే, ఒక సాధారణ పౌరుని ఆరోగ్యానికి ప్రభుత్వం నెలకు కేవలం 162 రూపాయలు మాత్రమే ఖర్చు పెడుతోంది. నేటి రోజుల్లో ఈ మొత్తం ఒక రోజు మందు బిళ్ళలు కొనడానికి కూడా ఏమాత్రం సరిపోదు! ఈ గణాంకాలు కేవలం కాగితాలపై కనిపించే నంబర్లు కావు ఇవి ప్రతిరోజూ నిజంగా జీవిస్తున్న, కష్టపడుతున్న, రోగపడుతున్న సామాన్య మనిషి జీవితాల వెల. బడ్జెట్‌లో ఒక్కో రూపాయి తక్కువ కేటాయించడం అంటే ఒక్కో పేద మనిషికి సకాలంలో చికిత్స అందుకోలేకపోవడం. ఒక్కో రూపాయి తక్కువ అంటే ఒక్కో గర్భిణీ స్త్రీ ప్రసవంలో సరైన వైద్యం అందక ప్రాణం కోల్పోవడం. ఒక్కో రూపాయి తక్కువ అంటే ఒక్కో పసికందు చికిత్స లేక అర్థంతరంగా ఈ లోకాన్ని వదిలిపోవడం.

గ్రామీణ భారతంలో నేటికీ వేలాది గ్రామాలకు సరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రమే (పిహెచ్‌సి) లేదు. ఒకవేళ ఎక్కడైనా భవనం ఉన్నా ఆ భవనాలు శిథిలంగా మారి, మందులు గడువు దాటిపోయి, వైద్య పరికరాలు దశాబ్దాల నాటివై తుప్పుపట్టి ఉన్నాయి. అక్కడి సిబ్బంది సగానికి సగం విధులకు హాజరవ్వని పరిస్థితి నెలకొంది. మనదేశంలో ఒక ప్రభుత్వ వైద్యుడికి సగటున 11,000 మంది రోగులను చూడవలసి వస్తోందని ప్రభుత్వ అధికారిక లెక్కలే చెప్తున్నాయి. కానీ ఔనూ ప్రమాణం ప్రకారం ఒక వైద్యుడికి గరిష్ఠంగా 1,000 మంది రోగులు మాత్రమే ఉండాలి. మనదేశంలో రోగుల భారం ప్రమాణాల కంటే పదకొండు రెట్లు ఎక్కువగా ఉంది! రెండు తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్‌లలో కూడా పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. వందల ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యవసర విభాగాలు (ఎమర్జెన్సీ వార్డ్స్) సరిగ్గా పని చేయవు. రాత్రిపూట రోగులు ప్రాణాపాయ స్థితిలో వస్తే అర్హులైన డాక్టర్లు ఉండరు, కేవలం నర్సులు మాత్రమే అందుబాటులో ఉండి చూసుకుంటారు . క్యాన్సర్, గుండె జబ్బులు, కిడ్నీ వ్యాధుల వంటి దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స పొందడానికి పేద మనిషి తప్పనిసరై ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే, అతను జీవితాంతం కష్టపడి సంపాదించి నదంతా ఒక్క రోజులో హాస్పిటల్ బిల్లుగా మారి ఆవిరైపోతుంది. భారతదేశంలో ప్రతి సంవత్సరం దాదాపు 6 కోట్ల మంది ప్రజలు కేవలం ఆరోగ్య ఖర్చుల భారంతోనే దారిద్ర్య రేఖకు దిగువకు, తీవ్ర పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. దేశంలో 70 శాతం ఆరోగ్య వ్యయం రోగులు స్వయంగా భరిస్తున్నారు వారి సొంత జేబుల నుండి! ఇది ప్రపంచంలోనే అత్యధికంగా ఉన్న 'out-of-pocke' ఆరోగ్య వ్యయాలలో ఒకటిగా నిలుస్తోంది. అంటే ఒక సామాన్యుడు జబ్బు పడ్డాడంటే ప్రాణాలు దక్కించుకోవడానికి, మందు కొనడానికి తనకున్న కొద్దిపాటి పొలాన్ని అమ్ముకోవాలి, భార్య మెడలోని నగలు తాకట్టు పెట్టాలి, లేదా బంధువుల దగ్గర ఎక్కువ వడ్డీకి అప్పు చేయాలి. ఈ దయనీయ స్థితి వ్యక్తిగత వైఫల్యం కాదు ఇది ముమ్మాటికీ ప్రభుత్వాల పాలనా వైఫల్యం!ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఆయుష్మాన్ భారత్) లేదా రాష్ట్రాల ఆరోగ్యశ్రీ పథకాలు 5 లక్షల రూపాయల వరకు ఉచిత చికిత్స అందిస్తాయని పాలకులు గొప్పగా చెప్తున్నారు. కానీ వాస్తవంలో లక్షలాది మంది పేదలు ఆయా పథకాల ద్వారా సకాలంలో చికిత్స పొందలేకపోతున్నారు. నమోదు ప్రక్రియలో తీవ్రమైన జాప్యాలు, ఆసుపత్రుల అనర్హత, ఎంపానెల్‌మెంట్ సమస్యలు, నిధుల విడుదల ఆలస్యం ఇవన్నీ పథకాలను నిరర్థకంగా మారుస్తున్నాయి. పత్రికల్లో అందమైన ప్రకటనలు, రంగురంగుల పోస్టర్లు కనిపిస్తాయి కానీ నిజమైన ఆసుపత్రి బెడ్ దగ్గర పేద మనిషి దిక్కుతోచక ఒంటరిగా నిల్చుని ఏడుస్తున్నాడు.

ప్రభుత్వ ఆరోగ్య సేవలు కుంటువడుతూ నిర్వీర్యమైపోతుంటే, ప్రైవేటు వైద్య రంగం దేశంలో పుట్టగొడుగుల్లా విస్తరిస్తోంది. ఒక్కో ఆసుపత్రి కార్పోరేట్ సామ్రాజ్యంగా మారి సామాన్యుడిని దోచుకుంటోంది. ఒక సాధారణ అపెండిక్స్ ఆపరేషన్‌కు కూడా ఐదు పదుల వేల నుండి లక్షన్నర రూపాయల వరకు బిల్లు వేస్తున్నారు. ఒక్క రాత్రి సాధారణ రోగి ఐసియులో ఉంటే ఇరవై వేల రూపాయ లకు పైగా ఖర్చవుతుంది. ఇవి కేవలం ఆసుపత్రులు కావు మానవ బాధను, ప్రాణభయాన్ని నగదుగా మార్చే రాక్షస యంత్రాంగాలు! నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) విధించే నియంత్రణలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రైవేటు ఆసుపత్రులు అనవసరమైన ల్యాబ్ పరీక్షలు, స్కానింగ్‌లు, అనవసర శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నాయని ఎందరో నిజాయితీ గల వైద్యులే స్వయంగా అంగీకరిస్తున్నారు. గర్భిణీ స్త్రీకి అవసరం లేకపోయినా సిజేరియన్, రోగికి అవసరం లేకపోయినా ఖరీదైన ఎంఆర్ఐ అవసరం లేకపోయినా పది రోజుల పాటు అడ్మిషన్ ఇవన్నీ చేసి బిల్లులను అడ్డగోలుగా పెంచుతున్నారు. సామాన్యుడు ఈ దోపిడీని ప్రశ్నిస్తే సమాధానమిచ్చే బాధ్యతాయు తమైన వ్యవస్థ ఎక్కడా కనిపించడం లేదు.

దేశ రక్షణ రంగానికి బడ్జెట్‌లో లక్షల కోట్ల రూపాయలు సులభంగా కేటాయించవచ్చు. ప్రజాప్రతినిధుల విదేశీ పర్యటనలకు, అదనపు విలాసవంతమైన భవనాలకు, ప్రభుత్వ ప్రచారాలకు వందల కోట్లు నీళ్ళలా ఖర్చు చేయవచ్చు. కానీ ఒక పేద రోగికి ఉచితంగా మందులు ఇవ్వడానికి మాత్రం ప్రభుత్వాల దగ్గర నిధులు ఉండవు. వికలాంగుడికి పునరావాసం కల్పించడానికి బడ్జెట్ సరిపోదు. ప్రసవ సమయంలో తల్లిని, బిడ్డను కాపాడే అత్యవసర అంబులెన్స్ నడపడానికి డీజిల్ డబ్బులు లేవంటారు. ఇది ఏ రకమైన ప్రజాస్వామ్య విధానం? ఇది పౌరుల రాజ్యాంగ హక్కుల ఉల్లంఘన కాదా?మన రాజ్యాంగంలోని 21వ అధికరణం (ఆర్టికల్ 21) ప్రతి పౌరుడికీ గౌరవంగా జీవించే ప్రాథమిక హక్కును ఇచ్చింది. సుప్రీంకోర్టు సైతం తన పలు చారిత్రాత్మక తీర్పుల్లో ఆరోగ్య హక్కు అనేది జీవించే హక్కులో అంతర్భాగమని స్పష్టం చేసింది. కానీ మన దేశ విధాన నిర్ణేతలు, రాజకీయ నాయకులు ఆ తీర్పులను అర్థం చేసుకోవడానికి గానీ, అమలు చేయడానికి గానీ సిద్ధంగా లేరు. మన సమాజంలో మందు అందక, వైద్యం లేక ఒక పేదవాడు చనిపోవడం అనేది కేవలం సహజ మరణం కాదు అది ముమ్మాటికీ ప్రభుత్వాలు, వ్యవస్థ చేస్తున్న సామూహిక హత్య!ఇవన్నీ చదివి మనం నిరాశ చెందవలసిన అవసరం లేదు. ఈ దారుణమైన పరిస్థితికి ఖచ్చితమైన పరిష్కారం ఉంది అది కేవలం పాలకుల రాజకీయ సంకల్పం, చిత్తశుద్ధి మీద మాత్రమే ఆధారపడి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు తమ బడ్జెట్‌లో జిడిపిలో 5 శాతం నిధులను ఆరోగ్య రంగానికి కేటాయించాలి. గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మౌలిక వసతులతో పూర్తిగా పటిష్ఠం చేయాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో జెనెరిక్ మందుల విధానాన్ని అత్యంత కఠినంగా అమలు చేయాలి. అలాగే దోపిడీకి పాల్పడుతున్న ప్రైవేటు ఆసు పత్రులపై పటిష్ఠమైన ధరల నియంత్రణ చట్టాలను విధిస్తే దేశంలో మార్పు తప్పనిసరిగా వస్తుంది. ప్రపంచ దేశాలను చూస్తే, థాయ్ లాండ్ దేశం 2001లోనే యూనివర్సల్ హెల్త్ కవరేజ్ విధానాన్ని విజయవంతంగా అమలు చేసింది నేడు ఆ దేశపు అత్యంత పేద పౌరుడికి కూడా ఒక్క బాహ్ట్ (మన కరెన్సీలో కేవలం 2) కూడా సొంత ఖర్చు లేకుండా సంపూర్ణ ఉచిత చికిత్స లభిస్తోంది. అలాగే ఆఫ్రికా ఖండంలోని అత్యంత పేద దేశమైన రువాండాలో కమ్యూనిటీ ఆధారిత ఆరోగ్య బీమా వ్యవస్థ ద్వారా 90 శాతానికి పైగా పౌరులు నాణ్యమైన ఆరోగ్య సేవలు పొందుతున్నారు. మనం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్నామని గొప్పలు చెప్పుకుంటూ, మన సొంత ప్రజలకు కనీస వైద్యం కూడా అందించే ఈ చిన్న లక్ష్యాన్ని సాధించలేమా?ఈ వ్యాసం చదివిన తర్వాత మీకు వ్యవస్థపై తీవ్రమైన కోపం వస్తే అది ఖచ్చితంగా సరైన స్పందన. ఆ కోపాన్ని కేవలం క్షణికావేశంగా వదిలేయకండి, దానిని నిలబెట్టుకోండి. మీ నియోజకవర్గ ప్రజాప్రతినిధి మీ ఇంటికి వచ్చినప్పుడు ధైర్యంగా నిలదీసి అడగండి మా గ్రామంలో ఎందుకు సరైన ఆసుపత్రి లేదు? మాకు వైద్యం ఎందుకు అందడం లేదు?అని ప్రశ్నించండి. మీ పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించండి ఆరోగ్యం అనేది ప్రభుత్వం మనకు పెట్టే భిక్ష లేదా దయ కాదు, అది మన ప్రాథమిక హక్కు.కేవలం వీధి మూలన నిలబడి నిరసన తెలపడం లేదా సామాజిక మాధ్యమాల్లో బాధపడటం మాత్రమే కాదు ఎన్నికల్లో ఓటు వేసేటప్పుడు అభ్యర్థుల కులం, మతం చూడకుండా ఆరోగ్య రంగానికి ఎవరు ప్రాధాన్యత ఇస్తున్నారో ఆలోచించండి. బాధ్యత గల పౌరుడిగా అధికారులకు పిటిషన్లు పెట్టండి, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) ద్వారా ఆసుపత్రుల నిధులను దాఖలు చేసి ప్రశ్నించండి, సోషల్ మీడియాలో నిరంతరం మీ స్వరాన్ని వినిపిం చండి. ఒక జాతి తన ప్రజల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే ఆ దేశం కేవలం శారీరకంగా రోగపడటమే కాదు,అది మనసా వాచా కర్మణా అంతరించిపోతుంది. 140 కోట్ల మంది ప్రాణాలు, ఆరోగ్యం కార్పోరేట్ వ్యాపారంగా మారిన ఈ దేశంలో మీరు మౌనంగా ఉండ డమే ఆ దోపిడీకి మీ సమ్మతి అవుతుంది. కాబట్టి మీ గొంతు విప్పండి. ఈ పాలకులను నిలదీ స్తూ ప్రశ్న అడగడం ఎప్పటికీ ఆపవద్దు జనాభా ఎక్కువ ఆరో గ్య ఖర్చు తక్కు వ ఇది ఏ రకమైన ప్రజాస్వామ్య విధానం?



డా.సూర్యదేవర రామకృష్ణ,
9490754169

## ఆదాయం కోసం అడ్డగోలు నిర్ణయాలు

**- భూముల విలువలకు తోడు..మద్యం ధరలు - ఈ నెలలోనే మద్యం ధరలు పెంచే యోచన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 6 : రాష్ట్ర ప్రభుత్వం భూముల విలువలను పెంచేసింది. ఆదాయం సమకూర్చుకోవడం లక్ష్యంగా ఎట్టకేలకు శుక్రవారం నుంచి అమలులోకి తెచ్చింది. మరో వారం పదిరోజుల్లో మద్యం ధరలు కూడా పెరగనున్నాయి. ఒక్కో బాటిల్‌పై 80 నుంచి వందవరకు పెంచుతారన్న ప్రచారం సాగుతోంది. తెలంగాణలో మద్యం ధరలు పెరగనున్నాయి. పెరిగిన ధరలు ఈనెల 15 నుంచి అమల్లోకి రానున్నట్లు తెలుస్తోంది. లిక్కర్ తయారీ కంపెనీల ఒత్తిడి మేరకు ప్రభుత్వం మద్యం ధరలను పెంచడానికి సిద్ధమైనట్లు సమాచారం. ముడి సరుకుల ధరలు, రవాణా ఖర్చులు బాగా పెరిగిన నేపథ్యంలో మద్యం ధరలను కూడా పెంచాలని లిక్కర్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈమేరకు ప్రభుత్వం కూడా సానుకూలంగానే ఉంది. భూముల ధరలు పెంచడం, మద్యం ధరలు పెంచడం ద్వారా ఉచిత పథకాలకు ఢోకా లేకుండా చూసుకుంటున్నారు. అలాగే భూములను కూడా ఎక్కడిక్కడ తెగనమ్ముతున్నారు. ఇదిలావుంటే ఈసారి భూముల విలువలు పెరుగుతాయనే అనుమానంతో ఆస్తుల క్రయ, విక్రయదారులు గురువారం వరకు పెద్ద మొత్తంలో స్లాట్లు బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. తాజాగా, భూముల మార్కెట్ విలువలు రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి రాగానే రిజిస్ట్రేషన్లు తక్కువ సంఖ్యలో అయ్యాయి. ప్రతి జిల్లాలో సగటున 50శాతం వరకు భూ విలువలు పెరగ్గా, కమర్షియ ల్ ప్రాంతాల్లో భారీగా పెంచారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ అధికారులు పెద్దగా పెంపు లేదని చెబుతున్నా, ప్రాంతాల వారీగా పెరిగిన మార్కెట్ విలువలను చూస్తుంటే రిజిస్ట్రేషన్ల భారం అధికంగానే ఉంది. భూముల ధరలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలతో పాటు అభివృద్ధి, పారిశ్రామిక ప్రాంతాలు ఉన్న చోట మార్కెట్ విలువలను 50శాతం మేర పెంచారు. గ్రామీణ, పట్టణాల్లో క్షేత్రస్థాయి అధ్యయనం చేసి శాస్త్రీయంగా మార్కెట్ విలువలను సవరించామని అధికారులు చెబుతున్నా, ఆస్తుల క్రయ విక్రయదారులకు భారీగానే భారం మోపారని తెలుస్తోంది. ధరలు పెరుగుతాయని ముందస్తు సమాచారం తోనే పాత ధరలకే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పలువురు రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. భూముల విలువలు సవరణతో మార్కెట్ విలువ ప్రకారం అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో రిజిస్ట్రేషన్లు భారం కానున్నాయి.

వాస్తవానికి ఏటా కొంత మేరకు మార్కెట్ విలువలను సవరించాల్సిన ప్రభుత్వం ఏకంగా ఒకేసారి పెంచడంతో ఆస్తుల క్రయవిక్రయదారులపై భారం పెరిగింది. ప్రజలపై భారాన్ని పట్టించుకోకుండా ప్రభుత్వ ఖజానాను నింపేలా మాత్రమే అధికారులు కసరత్తు చేశారని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాల్సిన అధికారులు గతంలో ఉన్న మార్కెట్ విలువలను రెట్టింపు చేశారని, ఇది శాస్త్రీయంగా లేదని పలువురు పేర్కొంటున్నారు. వ్యవసాయ భూముల విలువను సైతం భారీగా పెంచడంతో ఆస్తుల కొనుగోలుదారులు ఆందోళనకు గురవుతున్నారు. కమర్షియల్ ప్రాంతాల్లో 100శాతం మేరకు మార్కెట్ విలువలను పెంచారు. కొన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో, రిజిస్ట్రేషన్లు తక్కువగా ఉన్న చోట స్వల్పంగా పెంచినా, పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరేలా మార్కెట్ విలువను పెంపుదల చేశారు. మార్కెట్ విలువలు పెరగడంతో స్టాంపు డ్యూటీ, ఇతర రిజిస్ట్రేషన్ చార్జీల భారం సామాన్య, మధ్య తరగతి ప్రజలపై అధికంగానే ఉండనుంది.

## పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖానాపూర్, జూన్ 6. తెలంగాణ ప్రభుత్వం పీఆర్సీ నివేదికను వెంటనే అమలు చేయాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ముఖ్య రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు ఈరోజు ఖానాపూర్ పట్టణంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ కార్యవర్గ సభ్యుల సమావేశంలో మాట్లాడారు ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో తాత్కారం చేస్తున్నదని ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించకుంటే జూన్ 12 పాఠశాలలు పున ప్రారంభమైన నాటికి మల్లొకసారి ధర్నా కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం జరుగుతుందని అప్పటివరకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన పి.ఆర్.సి నివేదిక అమలు అదే విధంగా ఆర్థికపరమైన బకాయింపులను వెంటనే చెల్లించాలని డిఏ బకాయిలు అదే విధంగా జిపిఎఫ్ టిఎస్జిఎల్ఐ కు సంబంధించిన ఆర్థిక అంశాలను పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మొగులూరి నవీన్ నెహ్రూ నాయక్ భూక్య రాము తదితరులు పాల్గొన్నారు

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధ మేఘాలు

**- ఇరాన్ డ్రోన్లను కూల్చిన అమెరికా సైన్యం**

**- హో ర్మూజ్ జలసంధి వద్ద మళ్లీ ఉద్రిక్తతలు**

(ప్రజాలక్ష్యం న్యూస్ బ్యూరో)

టెహ్రాన్, జూన్ 6 : పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మళ్లీ ముసురుతున్నాయి. హోర్ముజ్ జలసంధి లక్ష్యంగా ఇరాన్ ప్రయోగించిన నాలుగు డ్రోన్లను అమెరికా సైన్యం కూల్చివేసింది. దీనికి ప్రతీకారంగా, ఇరాన్ తీరప్రాంతంలోని నిఘా రాడార్ కేంద్రా లపై అమెరికా వైమానిక దాడులకు దిగింది. ఈ పరిణామం ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణను తీవ్ర సంక్షోభంలోకి నెట్టింది. హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లే అంతర్జా తీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ డ్రోన్ల వల్ల తక్షణ ముప్పు పొంచి ఉందని అమెరికా సెంట్రల్ కమాండ్ స్పష్టం చేసింది. ఆత్మరక్షణ చర్యల్లో భాగంగానే జలసంధిలోని ఒక ద్వీపంతో పాటు ఇరాన్ తీరంలోని కీలక రాడార్ సైట్‌లపై తాము దాడులు చేసినట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. మరోవైపు, ప్రపంచ ఇంధన సరఫరాకు గుండెకాయ లాంటి హోర్ముజ్ జలసంధిపై పట్టు సాధిం చేందుకు ఇరాన్ ప్రయత్నిస్తుండగా, అందుకు ప్రతిగా అమెరికా ఇరాన్ రేవులపై ఆంక్షలు, దిగ్బంధనాన్ని విధిస్తోంది. ఈ వారం లోనే కువైట్ ప్రధాన విమానాశ్రయంలోని ప్యాసింజర్ టెర్మినల్‌పై ఇరాన్ డ్రోన్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఒకరు మరణించగా, డజన్ల కొద్దీ ప్రయాణికులు గాయపడ్డారు. దీనివల్ల ఎయిర్‌ఫీల్డ్ తాత్కాలికంగా మూతపడింది. ఈ దాడితో తీవ్ర ఆగ్రహానికి గురైన అమెరికా, తాజా ఘర్షణతో ఇరాన్‌కు గట్టి హెచ్చరికలు పంపింది. రాడార్ సైట్‌లపై దాడులతో పాటు, హిందూ మహాసముద్రంలో ప్రయాణిస్తున్న ఇరాన్ లింక్డ్ చమురు ట్యాంకర్‌ను అమెరికా సైన్యం తమ ఆధీనంలోకి తీసుకుంది. ఆంక్షల పరిధిలో ఉన్న చమురును విక్రయించడం ద్వారా ఇరాన్ లాభపడకుండా అడ్డుకునేందుకు అమెరికా ఈ చర్య చేపట్టింది. అలాగే, ఇరాన్ ఇంధన రంగానికి సహాయం చేస్తున్న పలువురు వ్యక్తులు, సంస్థలు, ట్యాంకర్లపై అమెరికా కొత్తగా మరికొన్ని ఆర్థిక ఆంక్షలను విధించింది. ఇరాన్- అమెరికా ఘర్షణ కేవలం జలసంధికే పరిమితం కాలేదు. అమెరికా మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్, లెబనాన్ ప్రభుత్వాల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా ఉగ్రవాద సంస్థ తిరస్కరించింది. ఈ క్రమంలో శుక్రవారం ఇజ్రాయెల్ సైన్యం దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై బాంబుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో 9 మంది ప్రాణాలు కోల్పోయారు. దక్షిణ లెబనాన్‌లోని ఎక్కువ భాగాన్ని ఇజ్రాయెల్ ఇప్పటికే తన ఆధీనంలోకి తెచ్చుకుంది. మరోవైపు, హోర్ముజ్ జలసంధి తెరవాలన్నా, శాశ్వత కాల్పుల విరమణ కుదరాలన్నా లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు ఆగాలని ఇరాన్ పట్టుబడుతోంది.

## రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ లక్ష్యాన్ని పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 6 : జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, ఈ నెల 10వ తేదీలోగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అడిషనల్ కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వ నమోదు పురోగతిపై వివిధ శాఖలఅధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లా డారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.ప్రతి శాఖకు కేటాయించిన సభ్యత్వ లక్ష్యాలను గడువు లోగానే పూర్తి చేయడంతో పాటు, సభ్యత్వ నమోదును విస్తృత స్థాయిలో చేపట్టాలని పేర్కొన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించి, ఎక్కువ మందిని సభ్యులుగా చేర్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచేలా అధికారులు కృషి చేయాలని ఆమె కోరారు. సభ్యత్వ నమోదు డ్రైవ్‌ను మరింత వేగవంతం చేసి, లక్ష్య సాధనకు ప్రాధా న్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పెండ్యాల కేశవరెడ్డి, డీఆర్‌డీఏ అంజనేయరావు, జిల్లా సంక్షే మ అధికారి సరస్వతి, మెప్మా పీడీ స్వరూపారాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ, విద్యాశాఖ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, కలెక్టరేట్ అధికారులు కాళీచరణ్, మాధవి తదితరులు పాల్గొన్నారు.



## నిమ్స్‌లో చికిత్స పొందుతున్న దశరథ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 6 : వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామానికి చెందిన మేడముని దశరథ్ గారు గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి శనివారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా దశరథ్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న నిరంజన్ రెడ్డి, ఆయనకు ధైర్యం చెప్పారు. మెరుగైన వైద్య సేవలు అందాలని ఆకాంక్షిస్తూ, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని కుటుంబ సభ్యుల మధ్యకు చేరుకోవాలని ఆకాంక్షించారు. దశరథ్ ఆరోగ్య పరిస్థితిపై కుటుంబ సభ్యులతో మాట్లాడిన మాజీ మంత్రి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## పుచ్చిన జీలుగు విత్తనాలతో రైతులకు నష్టం

**- ఎకరాకు రూ.4,500 ఖర్చు వృథా అయిందని ఆవేదన**

**- సబ్ కలెక్టర్‌కు రైతుల వినతి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, జూన్ 6: ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని ఎర్రబంజర గ్రామ రైతులు జీలుగు విత్తనాల నాణ్యతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ శనివారం కల్లూరు సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పచ్చిరొట్ట ఎరువుల కోసం విత్తిన జీలుగు విత్తనాలు సరిగా మొలకెత్తకపోవడంతో భారీ నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల వివరాల ప్రకారం, ఎకరాకు సుమారు రూ. 4,500 ఖర్చు చేసి జీలుగు విత్తనాలు చల్లగా, అవి మొలకెత్తకపోవడం వల్ల పెట్టుబడి మొత్తం వృథా అయిందని తెలిపారు. అధికారులు సరఫరా చేసిన విత్తనాల నాణ్యత సరిగా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. జీలుగు పంట విఫలమవడంతో ఆర్థికంగా నష్టపోయామని పేర్కొన్న రైతులు, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని సబ్ కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. రైతుల ఫిర్యాదుపై స్పందించిన అధికారులు సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

## కుటుంబ కలహాల నేపథ్యంలో ఆటో డ్రైవర్ అదృశ్యం

**- పోచారం పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఘట్‌కేసర్, జూన్ 6 : కుటుంబ కలహాల నేపథ్యంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని పోచారం గ్రామానికి చెందిన ఓ ఆటో డ్రైవర్ అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, పోచారం గ్రామానికి చెందిన వరికుప్పల రమేష్ (45) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 4న కుటుంబ ఆర్థిక వ్యవహారాలపై భార్య మహేశ్వరి, రమేష్ మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన రమేష్ ఇంటి నుంచి వెళ్లిపోగా, అతని సోదరుడు శేఖర్ సముదాయించి తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు. అయితే జూన్ 5న ఉదయం భార్య విధులకు వెళ్లిన అనంతరం రమేష్ ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద ఆరా తీశా రు. సమీప ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆయన ఆచూకీ లభించ లేదు. దీంతో రమేష్ భార్య మహేశ్వరి పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రమేష్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## కాళేశ్వరం వేదికగా జర్నలిస్టుల హక్కుల సాధన

**- ఈ నెల 9న కాళేశ్వరంలో జిల్లా స్థాయి జర్నలిస్టుల మహాసభ**

**- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, జూన్ 6 : జర్నలిస్టుల వృత్తి భద్రత, సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు జిల్లాలోని పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్ తెలిపారు. టీయూడబ్ల్యూజే-ఐజేయూ)ఆధ్వర్యంలో ఈ నెల 9న కాళేశ్వరంలో జిల్లా స్థాయి జర్నలిస్టుల మహాసభ నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ నాయకులు శనివారం కాళేశ్వరంలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్, రాష్ట్ర హెల్త్ కమిటీ సభ్యుడు సామల శ్రీనివాస్‌తో కలిసి క్యాతం సతీష్మాట్లాడుతూ, మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ మహాసభకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణు మాధవ్, కంకనాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, గృహ స్థలాల కేటాయింపు, పెన్షన్, బీమా సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన సమస్యలు, మీడియా రంగంలో నెలకొన్న సవాళ్లు, డిజిటల్ మీడియా యుగంలో జర్నలిస్టుల బాధ్యతలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు వెల్లడించారు. అలాగే జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన తీర్మానాలను ఆమోదించి,



భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒకే వేదికపై చర్చించి వాటి పరిష్కారానికి సమిష్టి పోరాట కార్యాచరణ రూపొందించడంతో పాటు సంఘ బలోపేతం, సభ్యత్వ నమోదు, జర్నలిస్టుల ఐక్యత, వృత్తి గౌరవ పరిరక్షణ, యువ జర్నలిస్టులకు ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన, వృత్తి పరిరక్షణ దిశగా ఈ మహాసభ ఒక కీలక మైలురాయిగా నిలవనుందని పేర్కొంటూ, జిల్లాలోని జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు వెల్లడించి సమావేశాన్ని విజయవంతం చేయాలని క్యాతం సతీష్ కుమార్ పిలుపునిచ్చారు.

## పొలాల్లో గడ్డి, వరి కొయ్యలకు నిప్పు పెట్టవద్దు



**రైతులకు అవగాహన కల్పించిన మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 06: మహబూబాబాద్ మండల పరిధిలోని ముదుపుగల్ గ్రామంలో గ్రామ పెద్దలు, రైతులతో మహబూబాబాద్ రూరల్ సీఐ అంజలి శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ అంజలి మాట్లాడుతూ, కొంతమంది రైతులు తమ పొలాల్లో ఉన్న గడ్డి, వరి కొయ్యలు, ఇతర వ్యవసాయ అవశేషాలను తొలగించేందుకు నిప్పు పెడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం వేసవి కాలంలో పొలాల్లో ఎండిపోయిన గడ్డి, వరి కొయ్యలు ఎక్కువగా ఉండటంతో మంటలు వేగంగా వ్యాపించి సమీపంలోని ఇతర పంట పొలాలకు అంటుకునే ప్రమాదం ఉందన్నారు.దీని వల్ల మామిడి తోటలు, పామ్ ఆయిల్ తోటలు, ఇతర వ్యవసాయ పంటలు దగ్ధమై రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని పేర్కొన్నారు. అందువల్ల రైతులు తమ పొలాల్లో గడ్డి, వరి కొయ్యలు లేదా ఇతర వ్యవసాయ అవశేషాలకు నిప్పు పెట్టకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎవరైనా నిర్లక్ష్యంగా లేదా ఉద్దేశపూర్వకంగా మంటలు పెట్టి ఇతరుల ఆస్తులకు, పంటలకు నష్టం కలిగిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ అంజలి హెచ్చరించారు.

## వన్యప్రాణుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం కీలకం

**మంథని అటవీ రేంజ్ అధికారి వినయ్ నాయక్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పెద్దపల్లి, జూన్ 6 : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముత్తారం (మంథని) మండలంలోని పారుపల్లి గ్రామ పరిధిలోని పెద్ద చెరువు వద్ద శనివారం 'బర్డ్ వాక్స్ అండ్ వైల్డ్ లైఫ్ అవేర్‌నెస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంథని అటవీ రేంజ్ అధికారి వినయ్ నాయక్ మాట్లాడుతూ వన్యప్రాణులు, పక్షుల సంరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. మైదంబండ బీట్, బేగంపేట సెక్షన్ పరిధిలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు, యువతకు పక్షులు, వన్యప్రాణులు, జీవ వైవిధ్య పరిరక్షణ ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో పక్షులు, వన్యప్రాణులు ముఖ్య పాత్ర పోషిస్తాయని, జీవ వైవిధ్య పరిరక్షణ ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించవచ్చని వినయ్ నాయక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బర్డ్ వాచింగ్, ట్రెక్కింగ్‌తో పాటు పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. పారుపల్లి గ్రామ సర్పంచ్ చొప్పరి సంపత్ మాట్లాడుతూ ప్రకృతి సంపద పరిరక్షణకు గ్రామీణ ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి తిరుపతి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నహీదా పర్వీన్, రహమతుల్లా, అమీరొద్దీన్, ఫారెస్ట్ బీట్ అధికారులు మేఘరాజ్, రామ్‌సింగ్, మాధురి, రంజిత, బయాలజిస్ట్ చంద్రకాంత్, పోతారం, పారుపల్లి గ్రామాల ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

## కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

**బీజేపీ మండల అధ్యక్షుడు పాగే రంజిత్ కుమార్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాటారం, జూన్ 6 : కాటారం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న కూరగాయల మార్కెట్ పనులను వేగవంతం చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ మండల అధ్యక్షుడు పాగే రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కూరగాయల మార్కెట్ కు శంకుస్థాపన చేసి దాదాపు సంవత్సరం కావస్తున్నప్పటికీ పనులు పూర్తికాకపోవడం కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మార్కెట్ అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు రోడ్లపైనే కూరగాయలు విక్రయించాల్సి వస్తోందని, దీంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటంతో పాటు గతంలో ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని యుద్ధ ప్రాతిపదికన నిర్మాణ పనులను పూర్తి చేయాలని, వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను ఒకేచోట ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న మండలంలోనే మార్కెట్ నిర్మాణం ఆలస్యం కావడం విచారకరమని, సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అలాగే పనుల్లో జాప్యానికి కారణమైన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల శాఖ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు మంత్రి సునీల్, బొంతల రవీందర్, జిల్లా నాయకుడు డాక్టర్ రఫీ తదితరులు పాల్గొన్నారు.



## లోక్ అదాలత్‌తో వివాదాలకు శాశ్వత పరిష్కారం

**- ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కళార్చన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 6 : ప్రజలకు సత్వర, సులభ, తక్కువ ఖర్చుతో న్యాయం అందిం చడంలో జాతీయ మెగా లోక్ అదాలత్ కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కళార్చన అన్నారు. శనివారం వనపర్తి జిల్లా న్యాయస్థానంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, కోర్టు సిబ్బందితో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. జూన్ 20 వరకు నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమిష్టిగా కృషి చేయాలని ఆమె సూచించారు. రాజీ పడదగిన కేసులను గుర్తించి కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి, పరస్పర అవగాహనతో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కోర్టుల్లో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించడం ద్వారా సమయం, ధనం, శ్రమ ఆదా కావడంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని పేర్కొన్నారు. క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, కుటుంబ వివాదాలు, ఆస్తి తగాదాలు, రోడ్డు ప్రమాద పరిహార కేసులు, చెక్ బౌన్స్, బ్యాంకు రికవరీ, డ్రంక్ అండ్ డ్రైవ్, టౌన్ న్యూసెన్స్ తదితర కేసులను రాజీ మార్గంలో పరిష్కరించడం ద్వారా న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లు కేవలం కేసుల పరిష్కార వేదికలు మాత్రమే కాకుండా సమాజంలో శాంతి, సామరస్య వాతావరణాన్ని నెలకొల్పే ప్రజా న్యాయ వేదికలని ఆమె అన్నారు. రాజీ అనేది ఓటమి కాదని, పరస్పర గౌరవం, అవగాహనతో సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుగొనే గొప్ప విజయమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయమూర్తులు కవిత, కార్తీక్ రెడ్డి, శ్రీలత, అశ్విని, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, వనపర్తి సీఐ సుగంధరత్నం, ఆత్మకూరు సీఐ శివకుమార్, జిల్లాలోని ఎస్సైలు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ-1లో నిర్మాణాత్మక సమావేశం

**- కార్మిక సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కట్టుబడి ఉంది**

**- జీఎం డి.లలిత్ కుమార్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 6 : సింగరేణి ఆర్జీ-1 ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం డి.లలిత్ కుమార్ అధ్యక్షతన గుర్తింపు సంఘం ప్రతినిధులు, వివిధ విభాగాల అధికారులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ లో జరిగిన సమావేశంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు అమలయ్యాయని, మిగిలిన సమస్యలను కూడా సానుకూల వాతావరణంలో పరిష్కరిస్తామని జీఎం తెలిపారు. ఉత్పత్తి లక్ష్యాల సాధనతో పాటు కార్మిక సంక్షేమానికి



యాజమాన్యం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమావేశంలో భద్రతా పరికరాల సరఫరా, అండర్‌గ్రౌండ్ గనుల్లో లైటింగ్, జీడీకే-2, 11 ఇంక్లైన్లలో మరమ్మతులు, వాటర్ స్ప్రింక్లర్ వ్యవస్థలు, ఓసీపీ-5లో ఖాళీల భర్తీ, కొత్త యంత్రాల ఏర్పాటు, కార్మికులకు ఇన్సెంటివ్ అమలు, ఏరియా ఆసుపత్రిలో వైద్య సదుపాయాల మెరుగుదల, వర్క్స్ కమిటీల ఏర్పాటు, సీఎస్పీ-1లో టెండాల్ పోస్టుల భర్తీ, జీఎం కార్యాలయ మరమ్మతులు తదితర అంశాలపై చర్చించారు. యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్డీవో షర్మిల



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కరీంనగర్, జూన్ 6 : కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన షర్మిల శనివారం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను మర్యాదపూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా పరిపాలన, రెవెన్యూ శాఖకు సంబంధించిన పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. కాగా, షర్మిల శనివారం కరీంనగర్ ఆర్డీవోగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు జిల్లా అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.



## తబితాశ్రమంలో కోలేటి జన్మదిన వేడుకలు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూన్ 6 : రామగుండం పట్టణం రైల్వే స్టేషన్ ఏరియాలో గల తబిత ఆశ్రమంలో శుక్రవారం మాజీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ పట్టణ బిఆర్ ఎస్ అధ్యక్షులు బొద్దుపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరు కంటి చందర్ కేక్ కట్ చేసి బిఆర్ఎస్ నేతలతో కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం తబితా శ్రమ పిల్లలకు స్వీట్లు అన్న ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సారయ్య, నాయక్ బిఆర్ఎస్ నాయకులు మాడిశెట్టి రవీందర్, మద్ది అన్వేష్, బిఆర్ఎస్ అనుబంధ సంఘాల నాయకులు ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్ నాయక్ పాల్గొన్నారు.

## బ్రాంజ్ మెడల్ సాధించిన..

## మహిళా కానిస్టేబుల్ శ్రీలతకు సిపి సత్కారం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



కోల్‌సిటి (గోదావరిఖని), జూన్ 6 : 3వ ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో యోగా విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించి రామగుండం పోలీస్ కమిషనరేట్‌కు గౌరవం తీసుకువచ్చిన పెద్దపల్లి జోన్‌కు చెందిన మహిళా కానిస్టేబుల్ శ్రీలతను శనివారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా ఘనంగా సత్కరించారు. ఇటీవల హర్యానా రాష్ట్రంలోని కర్నాల్‌లో మే 23, 2026న నిర్వహించిన 3వ ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో 35 నుంచి 45 సంవత్సరాల వయో విభాగంలో జరిగిన యోగా పోటీల్లో శ్రీలత ప్రతిభ కనబర్చి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకు న్నారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆమెకు అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి శాఖకు మరింత పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, కమాన్‌పూర్ ఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## స్వదేశాగమన సందర్భంగా సన్మానం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కాగజ్‌నగర్, జూన్ 6 : కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం పద్మశాలి కుల బాంధవులు కలిసి విదేశీ (లండన్,యూకే) యాత్రను విజయవంతంగా ముగిం చుకుని మాతృభూమికి (కాగజ్ నగర్ కు)తిరిగి వచ్చిన సందర్భంగా గుల్లపల్లి ఆనంద్, లావణ్య దంపతులను వారి గృహంలో కాగజ్ నగర్ పట్టణ పద్మశాలి సేవా సంఘం నాయకులు పూల మాలలు, శాలువాతో ఘనంగా సత్కరించి, సన్మానించి శుభాకాంక్షలు తెలి పారు. ఈ కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుల్లపల్లి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వడ్నాల వెంకన్న, కోశాధికారి కొక్కుల మురళి తోపాటు మహిళా సంఘం నాయకు రాలు పొన్న స్రవంతి, మామిడాల రామకృష్ణ, నూతి సుదర్శన్, వలపదాసు రమేష్, కొంపల్లి సుదర్శన్,వంగరి మొగిలి, గడుదాసు శంకర్,దండే లక్ష్మణ్, సుంక లింగమూర్తి,మాచర్ల శ్రీనివాస్,తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా పాలన-ప్రగతి కార్యక్రమంతో గ్రామాల అభివృద్ధికి వేగం

**- గ్రామసభలో ఎంపీడీవో రవీంద్రనాథ్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, జూన్ 6 : ప్రజా పాలన-ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాల సమగ్రాభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని టేకులపల్లి ఎంపీడీవో రవీంద్రనాథ్ తెలిపారు. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని లచ్చగూడెం గ్రామపంచాయతీలో శనివారం నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి నివేదిక గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, గ్రామస్థుల సమస్యలు, సంక్షేమ పథకాల అమలుపై చర్చించారు. అనంతరం ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెరువు కుడికతీత పనులను పరిశీలిం చారు. అలాగే గ్రామ నర్సరీ నిర్వహణ, మొక్కల సంరక్షణ, పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనులు నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపీవో కాళంగి శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య, ఉపసర్పంచ్ కంగల సరోజ, గ్రామ కార్యదర్శి సునీత, ఏఈఓ రేహిన బేగం, వైద్యశాఖ సిబ్బంది మానస, జీపీఓ కన్నయ్య, విద్యాశాఖ ప్రతినిధి కుంజ రవి, విద్యుత్ శాఖ అధికారి లచ్చా, టీఏ బీముడు, ఎఫ్ఏ సత్యనారాయణ, వివో సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.







# కుల, మతాలు పార్టీలకతీతంగా నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం

## రామగుండం మేయర్ మహంకాళి స్వామి

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 6 : కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా అందరం కలిసి నగరాన్ని అభివృద్ధి చేసుకుందామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం డివిజన్లు 12,13,14,15,16,17, 18,19,20,21,22,23,44,45,46 లకు సంబంధించిన క్లస్టర్ లెవెల్ వార్డు సభ యైటింక్లయిన్ కాలనీ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.ఎల్.ఏ. ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ నేతృత్వంలో రామగుండంలో వేయి కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్న క్రమంలో అందరూ భాగస్వాములు కావాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఘన వ్యర్ధ పదార్థాల నిబంధనలు పాటిస్తూ చెత్తను విభజించి మునిసిపల్ వాహనానికి అందించాలని కోరారు.రాబోయే వర్షాకాలంలో ఎలాంటి విపత్తులు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గత రెండు నెలలుగా ఉదయమే డివిజన్ లలో పర్యటిస్తూ శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వరదలు రాకుండా కాలువల పూడిక తొలగింపు పనులు చేపడుతున్నామని అన్నారు. అలాగే అంటువ్యాధులు విజృభించకుండా దోమల నివారణా చర్యలు కూడా చేపడుతున్నామని అన్నారు. నగరంలో ప్రతి చివరి ఇంటికి కూడా నీటి కొరత లేకుండా నిరంతరాయంగా రక్షిత మంచినీటిని అందించడానికి ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ రూ.100 కోట్లు మంజూరు చేయించారని అన్నారు. ఇట్టి నిధులతో త్వరలో కొత్త పైప్ లైన్ల నిర్మాణం , ఎనిమిది కొత్త నీటి ట్యాంక్ ల నిర్మాణం చేపట్టి నగరంలో నీటి ఎద్దడి ఏర్పడకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎం.ఎల్.ఏ చొరవతో సింగరేణి సంస్థ కూడా రూ 27 కోట్లతో పనులు చేపట్టి క్వార్టర్ లలో నివసిస్తున్న కార్మిక కుటుంబాలకు కూడా రక్షిత మంచినీరు సరఫరా చేయనుందని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని యైటింక్లయిన్ కాలనీ ,గోపాల్ నగర్ తదితర ప్రాంతాలలో వరద ముప్పు రాకుండా రూ.5.00 కోట్లతో పక్కా డ్రెయిన్ నిర్మాణశీ చేపట్టడం జరుగుతున్నదని అన్నారు.భూ గర్భ జలమట్టం పెరగడానికి ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని అన్నారు.అలాగే కాలుష్యం నివారించడానికి మొక్కలు నాటి సంరక్షించాలని అన్నారు. కాగా ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొని తమ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు.రాబోయే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ట్రాఫిక్ సి ఐ రాజేశ్వర్ రావు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించాలని సూచించారు. అల్లూరు పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మాట్లాడుతూ పరిసరాలలో దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. జ్వరశీ వస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. పద్నాలుగు సంవత్సరాల బాలికలకు గర్భ సంచి క్యాన్సర్ నివారించే వ్యాక్సిన్ ఉచితంగా వేస్తున్నామని అన్నారు. అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మాట్లాడుతూ వన మహోత్సవమ్ లో భాగశీగా ఒక్కొక్కరు కనీసం ఒక్కొక్క మొక్క నాటి సంరక్షించాలని అన్నారు. రామగుండం ఎం ఆర్ ఓ రవీందర్ మాట్లాడుతూ ఓటరు జాబితా సిస్టమాటిక్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) గురించి వివరించడంతో పాటు సర్ పై పలువురి సందేహాలను నివృత్తి చేశారు. నగర పాలక సంస్థ ఎ సి పి శ్రీహరి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో నగర పాలక సంస్థ చేపట్టిన పనులతో పాటు మాన్ సూన్ కార్యాచరణ ప్రణాళిక గురించి వివరించారు.ఐ సి డి ఎస్ అధికారులు తమ శాఖ చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్యతో కార్పొరేటర్లు షేక్ బాబు మియా, చుక్కల లావణ్య, బదావత్ శంకర్ నాయక్, బుర్ర శశికళ,మందల రమ, అనుమ స్వరూప, ద్యావనపల్లి చక్రపాణి, మారెల్లి సుశీల, తాళ్ల రాజయ్య, కందుల స్వరూప, కన్నూరి భాగ్యలక్ష్మి, బెంద్రం సునీత,డేవిడ్ రాజు, కౌటం సతీష్ , టూ టౌన్ సి ఐ ప్రసాద రావు, నగర పాలక సంస్థ సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి, టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, మెప్మా టి ఎం సి మౌనిక తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లలను కాపాడుదాం - దేశాభివృద్ధికి తోడ్పడుదాం

## - షీ టీం ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు అవగాహన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూన్ 6 : మహిళలు, బాలికల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో షీ టీం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఐటీ మాస్టర్ ఇన్‌స్టిట్యూట్‌తో పాటు భూపాలపల్లి బస్టాండ్‌లో ఈ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా షీ టీం సిబ్బంది విద్యార్థినులకు సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ తమ భవిష్యత్తును సురక్షితంగా మలుచుకోవాలని తెలిపారు. మహిళలు, బాలికలు ఎలాంటి వేధింపులు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మహిళల భద్రతే షీ టీం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అలాగే టి-సేఫ్ యాప్ వినియోగం ద్వారా ప్రయాణాలను మరింత సురక్షితంగా చేసుకోవచ్చని వివరించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆడపిల్లలకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే వెంటనే షీ టీం హెల్ప్‌లైన్ నంబర్ 8712658162 ను సంప్రదించాలని, సైబర్ నేరాల బారిన పడినట్లయితే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మహిళలు మరియు బాలల రక్షణకు సంబంధించిన చట్టాలపై విద్యార్థులు, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. నిజ జీవిత సంఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ మహిళలు, బాలికలు తమ హక్కులు, భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

# రుతుపవనాల రాకముందే వరి కొనుగోళ్లు పూర్తి చేయాలి

## - తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులు, గోదాములకు తరలించాలి
## - జిల్లా అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 6 : జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసి, తూకం పూర్తయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులు, గోదాములకు తరలించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు వరి కొనుగోలు ప్రక్రియ, జూన్ 9న నిర్వహించే మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం, నీట్ పరీక్ష ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ఐడీఓసీ కార్యాలయం నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ)తో కలిసి కలెక్టర్ అంకిత్ పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించిన కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, మరో రెండు రోజుల్లో రుతుపవనాలు తెలంగాణ రాష్ట్రాన్ని తాకనున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని ఆలస్యం లేకుండా తరలించాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల నుంచి తూకం వేసిన వడ్లను వెంటనే లారీల ద్వారా మిల్లులు, గోదాములకు తరలించి రెండు మూడు రోజుల్లో కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు సకాలంలో చేరుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళలకు ప్రయాణ సమయంలో భోజనం, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు తెలిపారు. నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని, పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, డీఎం సివిల్ సప్లై అధికారి త్రినాథ్ బాబు, ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ వెంకటరమణతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన

## - ప్రభుత్వ వైద్య కళాశాలలో సీసీఎస్ పోలీసుల ప్రత్యేక కార్యక్రమం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జయశంకర్-భూపాలపల్లి, జూన్ 6 : మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు భూపాలపల్లి జిల్లా సీసీఎస్ పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు జిల్లా సీసీఎస్ సీఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్య కళాశాల, భూపాలపల్లిలో శనివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని, ఉద్యోగాలు, విద్య, వివాహాల పేరుతో మోసాలకు పాల్పడే వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ వేదికల ద్వారా వచ్చే అనుమానాస్పద ఆఫర్లు, సందేశాలను నమ్మవద్దని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేయడంతో పాటు ఆరోగ్య, కుటుంబ, సామాజిక జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. తమ స్నేహితులు కూడా ఈ వ్యసనాలకు గురికాకుండా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. మానవ అక్రమ రవాణా, మాదకద్రవ్యాల రవాణా లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు లేదా డయల్-100, 8712658111 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, సీసీఎస్ పోలీసులు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సభ్యులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులను మోసం చేస్తున్న మోడీ సర్కార్ - రైతు సంఘం నేత గుమ్మడి వెంకన్న




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూన్ 6 : కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ సర్కార్ రైతు వ్యతిరేక విధానాలను అనుసరిస్తూ మోసం చేస్తోందని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఐక్య రైతు సంఘం రాష్ట్ర కమిటీ నాయకులు గుమ్మడి వెంకన్న ఆరోపించారు. శనివారం అంతర్గాం తాసిల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అనంతరం మాట్లాడారు. ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ ఉప సంఘం 14 రకాల ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధరలు అయితే రైతులు పెట్టిన పెట్టబడులకు ఈ ధరలు ఏమాత్రం పొసగడం లేదని వెంకన్న ఆరోపించారు. విత్తనాలు రసాయన ఎరువులు పురుగుల మందులు కూలి వేతనాలు డీజిల్ విద్యుత్ సాగునీరు మొదలైన ఉత్పత్తి ధరలు ఆకాశానికి అందుతున్న వీటిని పరిగణలోకి తీసుకోకుండా ఎంఎస్‌పి ఎల్ 2+ ఎఫ్ఎల్ ప్రకారం నిర్ణయించారని అన్నారు. ఇది సాధారణంగా సి2 కంటే సుమారు 30 శాతం తక్కువ అయినా ప్రభుత్వం తనను తాను సమర్థించుకోవడం సిగ్గుచేటని వెంకన్న హెద్దేవా చేశారు. రైతులకు లాభదాయక ధరలు ఇస్తున్నట్లుగా వ్యవసాయ ఖర్చులు ధరల కమిషన్ ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోతున్నాయని దానితో ప్రభుత్వం ప్రకటించే ఎంఎస్‌పికి రైతులు పెట్టిన వాళ్లకు ఏమాత్రం పొసగడం లేదని ఆరోపించారు. పండించిన పంటను మార్కెట్కు తీసుకెళ్తే ఎమ్మెస్పీ కంటే తక్కువ ధరలకే మధ్య దళారీలకు రైతులు బలవంతన అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించిందని అన్నారు. రైతులు ప్రతి సీజన్లో ఆందోళనకు దిగితేనే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నాయని ఇది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా స్వామినాథన్ కమిటీ సిఫారసులను అనుసరించి సమగ్ర వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుల ప్రతిపాదికన కనీస మద్దతు ధరలను నిర్ణయించాలని వెంకన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు ఆదెపు శంకర్, గొల్లపల్లి చంద్రయ్య, బి.దేవన్న కోడిపుంజుల లక్ష్మి, మాజీ సర్పంచ్ మార్త రాధా, గట్టయ్య రాజమల్లు,వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు



# ఐక్య పోరాటలతోనే యాజమాన్యం మెడలు వంచుదాం

## - సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజా రెడ్డి
## - ఏఐసీడబ్ల్యుఎఫ్ వర్కింగ్ కమిటీ సమావేశాల గోడ పోస్టర్ ఆవిష్కరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

కోల్ సిటి (గోదావరిఖని), జూన్ 6 : అర్జీ వన్ ఏరియా జీడీకే 2ఇంక్ లైన్ లో పిట్ కార్యదర్శి అనబోయిన శంకర్ అధ్యక్షతన శనివారం సిఐ టియు గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరైన సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి ఎఐసిడబ్ల్యూఎఫ్ వర్కింగ్ కమిటీ సమావేశం గోడ పోస్టర్ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్ అమలు కోసం జూన్ 5న కలకత్తాలో జెసిసి సమావేశం నిర్వహించారని తెలిపారు.ఆ సమావేశంలో కార్మిక సంఘాలన్నీ లేబర్ కోడ్స్ కోల్ ఇండియాలో అమలు చేయడం మంచిది కాదని ఒకవేళ అమలు చేస్తే ఐక్య పోరాటల ద్వారా తిప్పి కొడతామని యజమాన్యానికి హెచ్చరించారు, 11వ వేతన ఒప్పందం గడువు ఈ నెలతో ముగుస్తుందని, 12వ వేతన ఒప్పందానికి కోల్ ఇండియా యజమాన్యం జేబీసీసీఐ కమిటీ వేసి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు, నిన్న జరిగిన జెసిసి సమావేశాల చర్చల నిర్ణయాలను ఆల్ ఇండియా కోల్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ సమావేశంలో చర్చిస్తామని తెలియజేశారు రెండో రోజు జూన్ 14న అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గోదావరిఖని 13,14 రెండు రోజుల సమావేశంలో భవిష్య కర్తవ్యాలు రూపొందించుకొని ఐక్య పోరాటాలకు పోవాలని, అందుకే ఈ సమావేశాలు విజయవంతం చేయాల్సింది మనమే అని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మేదరి సారయ్య, తోట నరహరి రావు, జిడికె -2ఇంక్ లైన్ పిట్ కార్యదర్శి అనబోయిన శంకర్, వంగల రాములు, పీ సమ్మయ్య, సిహెచ్ లక్ష్మణ్, బానోతు భీమా నాయక్, కృష్ణ, తాళ్ల శ్రీనివాస్, కొమురయ్య, వరప్రసాద్, సంపత్, చందు, మేదరి కుమార్, మహంకాళి తిరుపతి, గోపతి సంతు, బాపురావు, ప్రసాద్, వెంకటేష్, సతీష్, శ్రీను, సంపత్ రెడ్డి, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక కొరతను నివారించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

## - అభివృద్ధి పనులకు అడ్డంకిగా మారిన ఇసుక సమస్యను పరిష్కరించాలి
## - సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

పాల్వంచ, జూన్ 6 : జిల్లాలో నెలకొన్న ఇసుక కొరతను వెంటనే నివారించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా ప్రభుత్వాన్ని కోరారు. శనివారం పాల్వంచలోని చంద్ర రాజేశ్వరరావు భవన్‌లో నిర్వహించిన సీపీఐ మండల విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఇసుక కొరత కారణంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, అభివృద్ధి పనులు, ఇతర నిర్మాణ కార్యక్రమాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా స్థానికంగా ఇసుక అందుబాటులో ఉండేలా జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో పోడు సాగుదారులను అటవీ శాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేయరాదని, పోడు భూములను సాగు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. పోడు రైతులపై కవ్వింపు చర్యలు కొనసాగితే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. రైతులు పండించిన పంటను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనె సంచులు, కాటాలు, హమాలీలు, లారీలు అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ అధికారులను కోరారు. పార్టీ కార్యకర్తలు ప్రజల మధ్య ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారని పేర్కొంటూ, ఆయన సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పాలకుల నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాల వల్ల నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని విమర్శించారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు, సర్పంచులు, ఉపసర్పంచులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# మీసేవ దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్‌లోనే.

## - డిజిటల్ విధానాలతో పారదర్శకత, వేగవంతమైన సేవలు.
## - జీపీఓలు, ఆర్‌ఐలకు అవగాహన కల్పించిన ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు




(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 6 : మీసేవ ద్వారా అందించే వివిధ ధృవపత్రాల దరఖాస్తుల పరిశీలన పూర్తిగా ఆన్‌లైన్‌లోనే నిర్వహించబడుతుందని, దరఖాస్తుదారులు అప్లోడ్ చేసిన పత్రాల ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు తెలిపారు. శనివారం చంద్రుగొండ తహసీల్దార్ జగదీశ్వర ప్రసాద్, అన్నపురెడ్డిపల్లి తహసీల్దార్ స్వర్ణ ఆధ్వర్యంలో ఆయా మండలాల జీపీఓలు, ఆర్‌ఐలు, మీసేవ వీఎల్‌ఈలు, సెక్షన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మీసేవ దరఖాస్తుల పరిశీలన, ధృవపత్రాల జారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆదాయ, కుల, నివాస, కుటుంబ సభ్యుల ధృవపత్రాలు, ఈబీసీ, ఓబీసీ తదితర సేవలకు సంబంధించిన దరఖాస్తులను పూర్తిగా డిజిటల్ విధానంలోనే పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన ఆన్‌లైన్ పత్రాలను మాత్రమే పరిశీలించి అర్హత మేరకు ఆమోదం లేదా తిరస్కరణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. భౌతిక పత్రాలను స్వీకరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన జీపీఓ, ఎంఆర్‌ఐ వెరిఫికేషన్ మొబైల్ యాప్ వినియోగంపై అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. యాప్ ద్వారా దరఖాస్తుల పరిశీలన మరింత వేగంగా, పారదర్శకంగా నిర్వహించవచ్చని వివరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. మీసేవ కేంద్రాల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన రుసుములను మాత్రమే వసూలు చేయాలని, అదనపు చార్జీలు వసూలు చేయరాదని హెచ్చరించారు. దరఖాస్తుల నమోదు సమయంలో వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని, డేటా ఎంట్రీలో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ధృవపత్రాల జారీ అనంతరం సంబంధిత రికార్డులను సక్రమంగా నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు అధికారులు, మీసేవ కేంద్రాల నిర్వాహకులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. సాంకేతిక లేదా పరిపాలనా సమస్యలు తలెత్తినప్పుడు జీపీఓ, ఆర్‌ఐ లేదా తహసీల్దార్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల జీపీఓలు, ఆర్‌ఐలు, మీసేవ వీఎల్‌ఈలు, సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ స్ట్రోక్‌తో బెటాలియన్ కానిస్టేబుల్ మృతి

## గంగారం 15వ బెటాలియన్‌లో విషాదం



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, జూన్ 6: ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని గంగారం 15వ బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ తాటి నాగార్జున (39) బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. సమాచారం ప్రకారం, ఈ నెల 2న నాగార్జున అకస్మాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురికావడంతో బెటాలియన్ అధికారులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే ఆరోగ్య పరిస్థితి విషమించడంతో శనివారం తుదిశ్వాస విడిచారు. నాగార్జున మృతితో 15వ బెటాలియన్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన స్వగ్రామమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం భీమునిగూడెంలో కూడా విషాద వాతావరణం నెలకొంది. కుటుంబ సభ్యులు, బంధువులు ఆయన మృతిని జీర్ణించుకోలేక కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నాగార్జున మృతిపట్ల సహచర ఉద్యోగులు, అధికారులు, గ్రామస్తులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- ప్రజల ప్రాణ రక్షణకు ముందస్తు చర్యలు చేపట్టాలి**
**- 73 అడుగుల వరదలను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉండాలి**
**- అధికారులకు కలెక్టర్ అంకిత్ ఆదేశం**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 6 : గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కలెక్టరేట్ కార్యాలయంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, వివిధ శాఖల అధికారులతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. వరదల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు బోట్లు, నాటుపడవలు, లైఫ్ జాకెట్లు, తాడులు, టార్చ్‌లైట్లు, హ్యాండ్ మైకులు, రెస్క్యూ బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ముంపు పరిస్థితులు ఏర్పడిన తర్వాత కాకుండా ముందుగానే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేలా కార్యాచరణ రూపొందించాలని చెప్పారు. గోదావరి నీటిమట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలని, ముంపు గ్రామాల ప్రజల ఫోన్ నంబర్లను సేకరించి సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, వైద్య సేవలు, నిత్యావసర వస్తువుల సరఫరాకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటల ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు మండల, జిల్లా స్థాయిల్లో కూడా కంట్రోల్ రూములను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. గర్భిణీలు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. 108 అంబులెన్సులు, అత్యవసర మందులు, పాము, తేలు కాటు నివారణ ఔషధాలు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, డ్రెయిన్ల శుభ్రత, మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వాగులు, వంకలు పొంగిపొర్లే సమయంలో ప్రజలు దాటకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పశువుల రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టి పశువైద్య సేవలను అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. గోదావరి నీటిమట్టం 73 అడుగులకు చేరినా ఎదుర్కొనే విధంగా అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాలు, రెస్క్యూ బృందాలు, అవసరమైన సామగ్రిని సిద్ధంగా ఉంచామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పనిచేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# జూన్ 20న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**- పెండింగ్ కేసుల పరిష్కారానికి మంచి అవకాశం**
**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 6 : తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాల మేరకు ఈ నెల 20న శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం. రాజేందర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, మోటారు వాహన ప్రమాద నష్టపరిహార కేసులు, వివాహ సంబంధిత వివాదాలు, ఆస్తి పంపకాల వివాదాలు, అద్దె వివాదాలు, సివిల్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్, ఈ-చలాన్ కేసులు, సైబర్ క్రైమ్ కేసులు, చిన్న దొంగతనం కేసులు, టెలిఫోన్, మనోవర్తి, కొట్లాటలు, బ్యాంకు సంబంధిత కేసులు తదితర అంశాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా కేసులు పరిష్కారమైతే ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం ఉండదని, తక్కువ సమయంలో తుది పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఇందులో గెలుపోటములు ఉండవని, ఇరుపక్షాల అంగీకారంతోనే రాజీ కుదురుతుందని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పుపై అప్పీల్‌కు అవకాశం ఉండదని వివరించారు. జిల్లాలోని కక్షిదారులు, ప్రతివాదులు తమ న్యాయవాదుల ద్వారా లేదా నేరుగా సంబంధిత కోర్టులను సంప్రదించి తమ కేసులను లోక్ అదాలత్ జాబితాలో చేర్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమయం, ధనం, శ్రమను ఆదా చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. ప్రేమలత కోరారు.

# పిసిసి అధ్యక్షుడి వ్యాఖ్యలు హాస్యాస్పదం..

**- రామ మందిర నిర్మాణాన్ని అడ్డుకున్నదెవరు..?**
**-బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 06 : రామ మందిర నిర్మాణానికి మొట్టమొదటి శిలను రాజీవ్ గాంధీ వేయడం వల్లనే రామ మందిరం నిర్మాణం సాధ్యమైందని పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కరీంనగర్ లో చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని, ఇది ఒకటవ శతాబ్దంలో అతిపెద్ద జోక్ అని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ విమర్శించారు. శనివారం పెగడపెల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..రామ మందిరం నిర్మాణం తర్వాత దేశ వ్యాప్తంగా జరిగిన ప్రతి ఎన్నికల్లో హిందువులు సంఘటిత శక్తిగా ఎదగడం గమనించిన కాంగ్రెస్ పార్టీ రామ నామం జపం చేయడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. రాజీవ్ గాంధీ శిలాన్యాస్ చేస్తే ఇన్ని రోజులు రామ మందిర నిర్మాణాన్ని అడ్డుకున్నదెవరో పిసిసి అధ్యక్షుడు స్పష్టం చేయాలని అన్నారు. ఆరు గ్యారంటీలు విషయంలో ప్రజలు కాంగ్రెస్ ను విశ్వసించడం లేదన్న విషయం గ్రహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అసత్యపు ప్రచారాలతో పూట గడుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అగ్ర నాయకులు రాముడు లేడని, రామాయణం లేదని, అంత మిథ్య అని సుప్రీంకోర్టులో పదుల సంఖ్యలో కపిల్ సిబల్ లాంటి న్యాయవాదులను మార్చి, కోట్లాది హిందువుల మనోభావాలు దెబ్బతినేవిదంగా రామ మందిరం నిర్మాణానికి వ్యతిరేకంగా అఫిడవిట్లు దాఖలు చేసిన విషయం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తెలుసుకోవాలని అన్నారు. హిందువుల ఆరాధ్య దైవం అయోధ్య రాములోరి అక్షింతలను రేషన్ బియ్యం అన్న మంత్రి పొన్నం వ్యాఖ్యలు, జైశ్రీరామ్ అంటే పైనుండి డబ్బులు ఏమైనా రాలుతాయ అన్న దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలు, హిందువుల నుద్దేశించి హిందువులకు రాముడు ఏమైనా మీకు చిన్నయ్య అవుతాడా.. సీతమ్మ మీకేమైనా చిన్నమ్మ అవుతుందా అని అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలు మర్చిపోయారా అని ప్రశ్నించారు. హిందూ దేవుళ్ళు హింసావాదులని అందుకే వారి చేతుల్లో ఆయుధాలు ఉన్నాయని కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సాక్షిగా చేసిన వ్యాఖ్యలు దేశ ప్రజలు మరచిపోలేదన్న విషయాన్ని గుర్తెరగాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే ఎక్కువ మతఘర్షణలు జరిగాయని బిజెపి ప్రభుత్వ హాయంలో మత ఘర్షణలకు తావులేదని అన్నారు.రాజీవ్ గాంధీ అయోధ్యలోని రామ మందిర నిర్మాణానికి శిలాన్యాస్ చేస్తే బాబర్ సమాధిని సందర్శించిన రాహుల్ రామ మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి ట్రస్ట్ బోర్డు రాహుల్ గాంధీకి ఆహ్వానం పంపితే ఎందుకు హాజరు కాలేదో మహేష్ కుమార్ గౌడ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాజీనామా చేస్తే రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుంటాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని దేశ ప్రజలు ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోడీకి మాత్రమే ఓటు వేశారని రాహుల్ గాంధీకి ఓటు వేయలేదనే విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తెరగాలని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి, బిజెవైఎం మండల అధ్యక్షులు పల్లె మోహన్ రెడ్డి, జక్కుల హరీశ్, మండల నాయకులు కాశెట్టి రాజు, చింతకింది రఘు, రమేష్, నిఖిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

**- గుర్తింపు కార్డులతో సంక్షేమ పథకాలు మరింత చేరువవుతాయి**
**- సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

సత్తుపల్లి, జూన్ 6: మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సులభంగా అందుబాటులోకి వస్తాయని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గుర్తింపు కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మత్స్యకార సంఘ సభ్యులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మత్స్యకారుల జీవనోపాధి మెరుగు పడేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. గుర్తింపు కార్డుల ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను పొందడంలో సౌలభ్యం కలుగుతుందని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉ ందని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి మత్స్యకారుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘ నాయకులు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రధాన లక్ష్యం

**- ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నాం**
**- కారుకొండ రామవరం గ్రామ సభలో జిల్లా కలెక్టర్ అంకిత్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 6 : ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రధాన లక్ష్యమని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమం అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా అమలవుతోందని తెలిపారు. గ్రామసభలు ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాలను చేరవేసే సమర్థవంతమైన వేదికలని పేర్కొన్నారు. విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, పారిశుద్ధ్యం, వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు పంట మార్పిడి విధానాలను అనుసరించాలని, వ్యవసాయ శాఖ సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఎరువులు, పురుగుమందుల వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. గ్రామాల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణను సమర్థవంతంగా అమలు చేయాలని, తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించే అలవాటు ప్రతి కుటుంబం అలవరుచుకోవాలని కోరారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులకు ఓటు హక్కు కల్పించడం, అనర్హుల పేర్లను తొలగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరిగేలా కృషి చేయాలని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు డిజిటల్ విద్య, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, ఆధునిక మౌలిక వసతులు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్, రైతులు, గ్రామస్థులు వ్యవసాయ రహదారుల అభివృద్ధి, అదనపు విద్యుత్ లైన్ల ఏర్పాటు, అంతర్గత రహదారుల నిర్మాణం, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు వంటి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలపై స్పందించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు చేపట్టి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాలోత్ భారతి, ఎంపీడీఓ జి. సుస్మిత, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వీల్‌చైర్ల పంపిణీ, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్ల ప్రదానం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

మహబూబాబాద్ టౌన్, జూన్ 06 : మహబూబాబాద్ పట్టణంలోని ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో, సెర్ప్ సహకారంతో నిర్వహించిన వీల్‌చైర్ల పంపిణీ కార్యక్రమం,కుట్టు మిషన్లు, మగ్గం శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు లిజాటోతు హుస్సేన్ నాయక్‌లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు యువత, మహిళలకు ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు ఆర్థిక స్వావలంబనకు దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వ, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సంక్షేమ, ఉపాధి కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేసి, దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్, సెర్ప్ ప్రతినిధులు, శిక్షణ పొందిన అభ్యర్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భద్రాచలంలో పోలీసుల కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్

**- పత్రాలు లేని 37 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు స్వాధీనం**
**- మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 6 : నేరాల నియంత్రణ, ప్రజల భద్రత లక్ష్యంగా భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప కాలనీ, రెవెన్యూ కాలనీల్లో శనివారం తెల్లవారుజామున పోలీసులు విస్తృత స్థాయిలో కార్డాన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ తనిఖీల్లో సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 37 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం కాలనీవాసులతో సమావేశమైన డీఎస్పీ అరుణ్ కుమార్ పలు సూచనలు చేశారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, లింకులు, సందేశాలను నమ్మవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. నేరాల నియంత్రణలో భాగంగా ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. మహిళలు, పిల్లల భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కల్పించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఉన్న సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100కు ఫోన్ చేసి పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సుమారు 90 మందికి పైగా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్న ఈ ఆపరేషన్‌లో భద్రాచలం ఇన్‌స్పెక్టర్ నాగరాజు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సీఆర్పీఎఫ్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు, స్పెషల్ పార్టీ సిబ్బంది, నార్కోటిక్స్ స్నిఫర్ డాగ్ బృందం పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

**- జిల్లా జడ్జి ఎస్‌విపి సూర్య చంద్రకళ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ములుగు, జూన్ 6 : పర్యావరణ పరిరక్షణకు జిల్లాలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా జడ్జి ఎస్‌విపి సూర్య చంద్రకళ అన్నారు. శనివారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తగా నిర్మించిన బాల సదన్ భవనము ఆవరణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లా జడ్జి ఎస్‌విపి సూర్య చంద్రకళ ముఖ్య అతిధిగా పాల్గొని మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించుకోవడం వలన మానవ జీవన శైలికి ఎంతగానో ఉపయోగపడుతుందని, కొనియాడారు. చెట్లు నాటడం వలన కాలుష్య నివారణకు ఉపయోగ పడుతుందని,అధిక వర్షపాతం నమోదై పంటలు సమృద్ధిగా పండుతాయని, అలాగే ప్రతి ఒక్కరు ఒక్కొక్క మొక్క పెంచినట్లయితే భవిష్యత్తు తరాలకు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చిన వాళ్ళమౌతామని కొనియాడారు. ఈ కార్యక్రమం లో సీనియర్ సివిల్ జడ్జి టీ.కన్నయ్య లాల్,జూనియర్ సివిల్ జడ్జిలు జి.జ్యోష్ణ,డి.మధులిక తేజ,జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాలుగు చంద్రయ్య, ఉపాధ్యక్షులు రంగోజు బిక్షపతి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు మేకల మహేందర్,బానోత్ స్వామిదాస్, సంయుక్త కార్యదర్శి రాచర్ల రాజ్ కుమార్,క్రీడా సంస్కృతిక కార్యదర్శి కె.ప్రణయ్ ప్రసాద్,న్యాయవాదులు కె. సునిల్ కుమార్,ఎండీ.మన్సూర్ అలీ, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెద్దంపేట పాఠశాలకు పూర్వ వైభవం తెచ్చే బాధ్యత పూర్వ విద్యార్థులదే పూర్వ హెచ్ ఎం.రాజిరెడ్డి



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

రామగుండం, జూన్ 6 : పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం పెద్దంపేట ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు రెండున్నర దశబ్దాల అనంతరం ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగి ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలిసి ఆనాటి పాఠశాల గదుల జ్ఞాపకాలను నెమరు వేసుకోవాలనే తపనతో శనివారం 1999-2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంతో కలవడంతో పాఠశాల సందడిగా మారింది... వేదికపై ఒకరినొకరు పరిచయాలు పాత జ్ఞాపకాలు ఆనాటి గురువుల విద్యా బోధన జ్ఞాపకాలు అన్ని కలబోసుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనం సంతోషాల మధ్య సాగింది. సమ్మేళనానికి ఆనాటి పాఠశాల హెచ్ఎం ప్రస్తుత డిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈ.రాజిరెడ్డితో పాటు ఉపాధ్యాయులు సరిత నామాల లక్ష్మి పుష్పాక లక్ష్మి ఉ పాధ్యాయులు శ్రీనివాస్‌లను ఆహ్వానించి పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వాహకులు పూలమాలలు శాలువాలతో సన్మానించి ఆనాటి గురువుల ఆశీర్వాదాన్ని తీసుకున్నారు. అనంతరం పాఠశాల పూర్వ హెచ్ఎం రాజిరెడ్డి మాట్లాడుతూ విద్యా బోధనతో బతుకునిచ్చిన ఈ పాఠశాల అభివృద్ధి బాధ్యత పూర్వ విద్యార్థుల దేనని బతికిచ్చే బాధ్యత మీదేనని పూర్వ విద్యార్థులకు సూచించారు. మీ క్రమశిక్షణ చూసి గర్విస్తున్నామని గురువుగా మాకు ఇంతకంటే ఏది అవసరం లేదని, మీరు చేసిన సన్మానం కంటే మీ ఆప్యాయత మాకు కొండంత మానసిక బలమని అన్నారు. సమాజం కోసం సామాజిక స్పృహతో ప్రతి ఒక విద్యార్థి పనిచేస్తే అదే మాకు గొప్ప గౌరవమని అన్నారు. ఈ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ ఇంటర్వ్యూకు వెళ్తున్నానని చెప్పి వెళ్ళిన మహిళ అదృశ్యం

**- పోచారం పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



ఘట్‌కేసర్, జూన్ 6 : ఉద్యోగ ఇంటర్వ్యూకు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలంలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోచారం పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం, అన్నోజిగూడ ఆర్‌జీకే కాలనీకి చెందిన నడింపల్లి సురేష్ వర్మ తన భార్య నాగేశ్వరి (36) కనిపించడం లేదంటూ జూన్ 5న ఫిర్యాదు చేశారు. 2008లో వీరికి వివాహం కాగా, ఒక కుమారుడు ఉన్నాడు. నాగేశ్వరి గతంలో స్థానికంగా ఓ ప్రైవేట్ సంస్థలో పనిచేసి, నెల రోజుల క్రితం ఉద్యోగం మానేసి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 2న మధ్యాహ్నం ఉద్యోగ ఇంటర్వ్యూకు వెళ్తు న్నానని కుటుంబ సభ్యులకు చెప్పి బ్యాగ్ తీసుకుని ఇంటి నుంచి వెళ్లిన నాగేశ్వరి తిరిగి ఇంటికి రాలేదు. ఆమెకు ఫోన్ చేయగా మొబైల్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించారు. బంధువులు, స్నేహితులు, పరిచయస్తుల వద్ద గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించకపోవడంతో భర్త పోలీసులను ఆశ్రయించాడు. ఫిర్యాదు ఆధారంగా మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు మహిళ ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# సింగరేణిలో కేవలం 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు

**గత పదేళ్లలో ఇదే అత్యల్ప స్టాక్**
**కాంట్రాక్టు పనుల సమర్థ నిర్వహణ కోసమే**
**సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధన**
**మెడికల్ బోర్డు అక్రమాలపై ఏసీబీ విచారణ కొనసాగుతోంది**
**పలు అంశాలపై సింగరేణి యాజమాన్యం స్పందన**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 6: సింగరేణి కాలరీస్ కంపెనీలో ప్రస్తుతం 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు మాత్రమే ఉన్నాయని, గత పదేళ్లలో ఇదే అత్యల్ప నిల్వగా నమోదైందని సింగరేణి యాజమాన్యం వెల్లడించింది. అదే సమయంలో ఓవర్‌బర్డెన్ తొలగింపు పనుల్లో పారదర్శకత, సమర్థత పెంచేందుకే సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను అమలు చేస్తున్నామని, డిపెండెంట్ మరియు కారుణ్య ఉద్యోగాల నియామకాలకు సంబంధించిన మెడికల్ బోర్డు వ్యవహారంలో ఏసీబీ విచారణ కొనసాగుతోందని స్పష్టం చేసింది. 137 ఏళ్ల చరిత్ర కలిగిన సింగరేణి కాలరీస్ దక్షిణ భారతదేశంలోని పలు రాష్ట్రాలకు నిరంతరాయంగా బొగ్గు సరఫరా చేస్తోంది. సంస్థ పరిధిలోని 39 గనుల్లో ప్రతిరోజూ బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుగుతుండటంతో కొంత మేర నిల్వలు ఉండటం సహజమని యాజమాన్యం పేర్కొంది. ఈ నెల 4వ తేదీ నాటికి గనులు, కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల వద్ద మొత్తం 26.51 లక్షల టన్నుల బొగ్గు నిల్వగా ఉండగా, అవసరాలకు అనుగుణంగా వాటిని రోడ్డు, రైలు మార్గాల ద్వారా విద్యుత్ కేంద్రాలు మరియు ఇతర వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు తెలిపింది. సింగరేణిలో గతంలో బొగ్గు నిల్వలు మరింత ఎక్కువగా ఉండేవని యాజమాన్యం వివరించింది. ముఖ్యంగా 2015-16లో 70 లక్షల టన్నులు, 2016-17లో 74 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు నమోదయ్యాయని పేర్కొంది. 2014 నుంచి 2024 వరకు సగటున 50 లక్షల టన్నుల బొగ్గు నిల్వలు గనులు, సీహెచ్‌పీల వద్ద ఉండేవని వెల్లడించింది. నవంబర్ నుంచి మే నెలల మధ్య బొగ్గు ఉత్పత్తి అధికంగా ఉండటంతో నిల్వలు పెరుగుతాయని, ఉత్పత్తి తగ్గిన సమయంలో లేదా అవసరాల మేరకు వాటిని విద్యుత్ కేంద్రాలకు సరఫరా చేయడం అనేది దశాబ్దాలుగా కొనసాగుతున్న ప్రక్రియ అని తెలిపింది. వర్షాకాలంలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలగకుండా ఉండేందుకు బొగ్గు నిల్వలు అత్యవసరమని యాజమాన్యం పేర్కొంది. థర్మల్ పవర్ స్టేషన్లకు కనీసం 15 రోజుల అవసరాలకు సరిపడేలా సుమారు 30 లక్షల టన్నుల బొగ్గు నిల్వలను సిద్ధంగా ఉంచడం సాధారణ విధానమని వివరించింది. దేశంలోని అన్ని బొగ్గు కంపెనీల్లోనూ ఇలాంటి నిల్వలు ఉండటం సహజమేనని స్పష్టం చేసింది.

### సైట్ విజిట్ సర్టిఫికెట్ ఎందుకు?

సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధనకు ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులు అత్యంత కీలకమని యాజమాన్యం పేర్కొంది. ఈ పనులను కాంట్రాక్టర్ల ద్వారా నిర్వహిస్తుండగా, కొంతమంది కాంట్రాక్టర్లు స్థానిక భౌగోళిక పరిస్థితులు, గనుల స్వరూపం, సామాజిక-రాజకీయ పరిస్థితులు, మౌలిక సదుపాయాలను పూర్తిగా అంచనా వేయకుండానే టెండర్లలో పాల్గొంటున్నారని తెలిపింది. స్థానిక పరిస్థితులపై అవగాహన లేకపోవడంతో కొన్ని ప్రాజెక్టుల్లో పనులు మధ్యలో నిలిచిపోయాయని, శ్రీరాంపూర్ ఓసీ-2, ఐకే ఓసీ ప్రాజెక్టుల్లో ఓవర్ బర్డెన్ తొలగింపు పనులు సక్రమంగా కొనసాగకపోవడం వల్ల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలకు ఆటంకం ఏర్పడిందని వివరించింది. దీంతో కంపెనీకి ఉత్పత్తి నష్టం, కాంట్రాక్టర్లకు ఆర్థిక నష్టం, న్యాయపరమైన వివాదాలు తలెత్తాయని తెలిపింది. ఈ నేపథ్యంలో టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు పని ప్రదేశ పరిస్థితులు, భద్రతా ప్రమాణాలు, పనుల పరిధి, స్థానిక వాస్తవాలను పూర్తిగా అర్థం చేసుకునేలా సైట్ విజిట్ సర్టిఫికెట్ నిబంధనను అమలు చేస్తున్నట్లు పేర్కొంది. ఇది పోటీని పరిమితం చేయడానికి కాదని, ఆరోగ్యకరమైన పోటీతో పాటు పనుల సమర్థవంతమైన అమలుకు దోహదపడేందుకు తీసుకున్న చర్య అని స్పష్టం చేసింది.

### ఇప్పటికే మంచి ఫలితాలు:

సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం కేవలం సింగరేణిలోనే కాకుండా గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (జీఎండీసీ), జీఐపీసీఎల్, ఎన్ఎండీసీ, పలు సౌర విద్యుత్ ప్రాజెక్టులు, ఈపీసీ కాంట్రాక్టుల్లో కూడా అమలులో ఉందని యాజమాన్యం పేర్కొంది. సింగరేణిలో 2018, 2021, 2023 సంవత్సరాల్లో కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ల పనులకు కూడా ఈ విధానాన్ని అమలు చేసినట్లు తెలిపింది. మే 2025 నుంచి ఓవర్‌బర్డెన్ టెండర్లకు సైట్ విజిట్ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేసిన తర్వాత మంజూరైన టెండర్లు ఎలాంటి సమస్యలు లేకుండా కొనసాగుతున్నాయని, పనులు నిరాటంకంగా సాగుతున్నాయని వెల్లడించింది. సైట్ విజిట్‌కు వచ్చే కాంట్రాక్టర్లందరికీ అవసరమైన సౌకర్యాలు కల్పించి, సైట్‌ను సందర్శించిన ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ జారీ చేస్తున్నట్లు తెలిపింది.

### మెడికల్ బోర్డు వ్యవహారంలో ఏసీబీ విచారణ:

సింగరేణిలో డిపెండెంట్, కారుణ్య ఉద్యోగాల నియామకాలకు సంబంధించి మెడికల్ బోర్డు ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో యాజమాన్యం స్వయంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి లిఖితపూర్వక ఫిర్యాదు చేసినట్లు వెల్లడించింది. కొందరు దళారులు అమాయక కార్మికులను మోసం చేస్తూ భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులు అందడంతో ఈ చర్య తీసుకున్నట్లు పేర్కొంది. ఏసీబీ విచారణలో ఇప్పటికే ఇద్దరు ఉద్యోగులను అరెస్టు చేసినట్లు, వారిపై శాఖాపరమైన చర్యలు కూడా చేపట్టినట్లు తెలిపింది. ఈ వ్యవహారంపై ఏసీబీ దర్యాప్తు కొనసాగుతుండగా, మరోవైపు సింగరేణి విజిలెన్స్ విభాగం కూడా శాఖాపరమైన విచారణ నిర్వహిస్తున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది.

# ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



(ప్రజాలక్ష్యం బ్యూరో)

వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులు వేదవ్యాస్ లతో కలిసి ఆసుపత్రుల అభివృద్ధి సంఘం సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి అభివృద్ధి పనులకు గాను అవసరమైన బడ్జెట్ కేటాయింపు కొరకు ప్రతిపాదించడం జరిగిందని, ఇందులో భాగంగా ఆసుపత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది నియామకం, ఆసుపత్రి నిర్వహణ, అంబులెన్స్ ఇతర అంశాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స, వైద్య పరికరాలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు కొరకు 2 కోట్ల 88 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, ఆ దిశగా నర్సులు, ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులు, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఆసుపత్రి పరిసరాలలో ఉమ్ము వేసిన వారికి జరిమానా విధించాలని తెలిపారు. ఆసుపత్రిలో నీటి సౌకర్యం కొరకు మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లా కనెక్షన్ అందించడం జరుగుతుందని, ఆసుపత్రిలో ప్రజా ప్రయోజనకరంగా అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారలు తదితరులు పాల్గొన్నారు.

# ధరల పెరుగుదల, హామీల అమలుపై నిరసనగా జూన్ 10న కలెక్టరేట్ ముట్టడి

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




ఖమ్మం, జూన్ 6 : కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న ఖమ్మం కలెక్టరేట్‌ను ముట్టడించనున్నట్లు సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ప్రకటించారు. శనివారం ఖమ్మంలోని సిపిఐ కార్యాలయంలో ఖమ్మం, వైరా, పాలేరు నియోజకవర్గాల కార్యకర్తల సమావేశం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ పెరిగిపోతున్న ధరలతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. పదేళ్ల క్రితం రూ.72గా ఉన్న పెట్రోల్ ధర ప్రస్తుతం రూ.115కు, డీజిల్ ధర రూ.55 నుంచి రూ.108కు చేరిందని, గ్యాస్ సిలిండర్ ధరలు కూడా రెట్టింపయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2023 ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని ఆయన ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, కళ్యాణలక్ష్మి కింద తులం బంగారం, కొత్త పింఛన్లు, పింఛన్ల పెంపు వంటి హామీలు ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. పింఛన్ల కోసం లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ, నివాస స్థలాల కేటాయింపు, రైతు భరోసా అమలు విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని హేమంతరావు అన్నారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు చేసిన రైతులకు నెలలు గడిచినా చెల్లింపులు జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. భూభారతి ద్వారా కూడా భూ సమస్యలకు పూర్తి పరిష్కారం లభించడం లేదన్నారు. ధరల నియంత్రణ, ఎన్నికల హామీల అమలు, అర్హులందరికీ పింఛన్లు, రైతులకు బకాయి చెల్లింపులు తదితర డిమాండ్లతో జూన్ 10న ఉదయం 10 గంటలకు ఖమ్మం కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కే జానిమియా, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల భద్రతపై నిరంతర అప్రమత్తత అవసరం



ఈవీఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 6 : ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని, సీసీ కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నిరంతర అప్రమత్తతతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ భద్రతా సిబ్బందిని ఆదేశించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని ఈవీఎం గోడౌన్‌ను అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా ఈవీఎం గోడౌన్ సీల్స్‌ను పరిశీలించిన అనంతరం రాజకీయ పార్టీ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తొలగించి లోపల ఉన్న ఈవీఎంలు, వీవీప్యాట్ యంత్రాలను పరిశీలించారు. అనంతరం గోడౌన్‌కు తిరిగి సీల్ వేయించారు. తనిఖీ అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేసిన కలెక్టర్, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని సూచించారు. సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ఏర్పాట్లను క్రమం తప్పకుండా పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ, ఆమ్ ఆద్మీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ, బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ(ఎం), కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు ఎస్. సుబ్బారావు, వి. రామయ్య, ఎల్. సతీష్‌బాబు, వి. రాజేష్, ఎన్. వీరబాబు, ఏ. గోపాల్, పాలడుగు టి.ఆర్. కృష్ణప్రసాద్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, ఎస్‌కే జానిమియా, సిద్దినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ ట్యాంకుల నిర్మాణం కోసం మేయర్ స్థల పరిశీలన

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



రామగుండం, మే 6 : రామగుండం పట్టణ పరిధి ఆరు కార్పొరేషన్ డివిజన్లో ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించడం కోసం వాటర్ ట్యాంకుల నిర్మాణాలకు శనివారం మేయర్ మహంకాళి స్వామి కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు 26. 29 డివిజన్లోని ఎస్టీ కాలనీ హౌసింగ్ బోర్డ్ ఇందిరమ్మ కాలనీలో అనువుగా ఉన్న ప్రభుత్వ స్థలాలను మేయర్ మహంకాళి స్వామి స్థలాలను పర్యవేక్షించారు మేయర్ మహంకాళి స్వామి వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు ఈదునూరి హరిప్రసాద్ కార్పొరేటర్లు కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు ఉన్నారు.



# సాకేత్ నేత్రదానం

## ఇద్దరి జీవితాల్లో వెలుగులు

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

గోదావరిఖని టౌన్, జూన్ 6 : గోదావరిఖని అశోక్‌నగర్‌కు చెందిన జంగ సాకేత్ (17) శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సాకేత్ అకాల మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. పోస్టుమార్టం కోసం జీజీహెచ్ మార్చురీకి తరలించిన సమయంలో ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ నేత్రదానం పట్ల కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించడంతో సాకేత్ తండ్రి భిక్షపతి దుఃఖంలోనూ కుమారుడి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. అనంతరం సేకరించిన కార్నియాలను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంక్‌కు తరలించారు. సాకేత్ అకాల మరణంపై సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన కార్పొరేటర్ దూళికట్ట సతీశ్, కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి మల్లేష్, సదాశయ ఫౌండేషన్ బాధ్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు సాకేత్ కుటుంబ సభ్యులను అభినందించారు.



# ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం..

## మున్సిపాలిటీ 8వ వార్డ్ కౌన్సిలర్ నల్లెల్ల స్వాతి భరత్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 6 : ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యం అని ములుగు మున్సిపాలిటీ 8వ వార్డ్ కౌన్సిలర్ నల్లెల్ల స్వాతి భరత్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక-99 రోజుల కార్యక్రమం లో భాగంగా శనివారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో వార్డు సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కౌన్సిలర్ నల్లెల్ల స్వాతి భరత్ హాజరై మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని తడి చెత్త,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని,దోమల నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలకు అవగాహన కల్పించారు. యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి డ్రగ్స్ నిర్మూలనకు ప్రతి కుటుంబం సహకరించాలని కోరారు. వార్డులోని అంతర్గత సిసి రోడ్లు మరియు సైడ్ డ్రైనేజీలు పూర్తి చేస్తామని తెలిపారు. వన మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం వార్డ్ ప్రజలు నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ నల్లెల్ల స్వాతి భరత్ కు శాల్వాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ ఆర్ ఐ శ్రీనివాస్, ప్రవీణ్, అంగన్వాడి టీచర్లు, సూపర్వైజర్ భాస్కర్ యాదవ్, ఎలక్ట్రిషన్ శ్రీనివాస్, బాలు, ప్రజా ప్రతినిధులు,వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి-ప్రణాళిక విజయవంతగా పూర్తి చేయాలి

## అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి

## అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



జగిత్యాల, జూన్ 06 : ప్రజాపాలన-ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామంలో నిర్వహించిన గ్రామ సభ సమావేశంలో అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో జగిత్యాల డిఎస్పీ పురుషోత్తం రెడ్డి, జగిత్యాల రూరల్ తహసీల్దార్, ఎంపిడివో, సర్పంచ్ తో కలిసి పాల్గొన్న అదనపు కలెక్టర్, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే గ్రామ పరిధిలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి, అందిన వినతులు, ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే గ్రామ సభల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 9న పోలీసు వాహనాల పాత విడిభాగాల బహిరంగ వేలం

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

వనపర్తి, జూన్ 6 : జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో పోలీసు వాహనాలకు సంబంధించిన పాత టైర్లు, బ్యాటరీలు మరియు ఇతర వాహన విడిభాగాల బహిరంగ వేలం ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా పోలీసు వాహనాల అధికారి (ఎంటీవో), రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలోని జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయ మైదానంలో ఈ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా నిర్వహించే ఈ వేలంలో ఆసక్తి గల వ్యాపారులు, కొనుగోలుదారులు పాల్గొని అందుబాటులో ఉన్న పాత టైర్లు, బ్యాటరీలు, ఇతర వాహన విడిభాగాలను పరిశీలించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు. పోలీసు శాఖ వినియోగంలో లేని వస్తువులను కొనుగోలు చేసుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. వేలం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా నిర్వహించబడుతుందని, ఆసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంటీవో, ఆర్.ఐ. శ్రీనివాస్ సూచించారు. వేలానికి సంబంధించిన పూర్తి వివరాలు, షరతులు, నిబంధనలు, ఇతర సమాచారానికి జిల్లా సాయుధ దళ పోలీసు కార్యాలయాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. అలాగే 8712670604, 9949167450 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# తుక్కుగా మారుతున్న అదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీ

## నాయకుల మాటలు నీటి మూటలేనా...!?

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

హైదరాబాద్, జూన్ 6 : ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కేంద్రం మరియు మంచిర్యాల్ కేంద్రంలో మాత్రమే సిమెంట్ పరిశ్రమలు కలవు. అడవులు కలిగి అపారమైన సున్నపు నిలువలు ఉన్నప్పటికీ ప్రభుత్వాలు సిమెంటు పరిశ్రమకై ఈ జిల్లాను చిన్నచూపు చూపించినది. మహారాష్ట్ర, చత్తీస్గఢ్ సరిహద్దులతో రైల్వే కనెక్టివిటీ మరియు జాతీయ రహదారులు కలిగి సిమెంటు పరిశ్రమ అభివృద్ధికి పుష్కల మైనటువంటి నీటి వసతులు, వనరులు జిల్లా నలువైపున నీటి ప్రాజెక్టులు కలిగి ఉన్నప్పటికీ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా పైన ప్రతి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి చూపించినది. కేంద్ర ప్రభుత్వం అదిలాబాద్ జిల్లా కేంద్రానికి ఆనుకొని సిమెంట్ పరిశ్రమను సుమారు 500 మిలియన్లు (50 కోట్లతో) 1984 ఏర్పాటు చేసినది. ఈ సిమెంటు ఫ్యాక్టరీ నేడు సామాగ్రిని తుక్కు స్క్రాప్ గా మార్చడం కూల్చివేతలు మొదలవడంతో సిసిఐ అదిలాబాద్ పరిశ్రమ పునరుద్ధరణ పై ఆశలు పెట్టుకున్నా వేలాదిమంది నిరుద్యోగుల ఆశలు ఆవిరయ్యాయి. దశాబ్దాలుగా మూతపడిన ఫ్యాక్టరీని తెరిపించి ఉపాధి కల్పిస్తారని ఆశించిన యువతకు నిరాశనే మిగిలినది తాజాగా పరిశ్రమలోని భవనాల సముదాయాన్ని కూల్చివేత ప్రక్రియతో స్థానిక యువత ఉపాధి కళలు నేలమట్టమయ్యాయి. దీనితో పాలకుల నిర్లక్ష్యంతో పారిశ్రామిక కళ తప్పినది. ఈ తుక్కు కింద టెండర్లను ఢిల్లీకి చెందిన హెచ్ఆర్ అనే సంస్థ దక్కించుకొని కూల్చివేతలు మొదలుపెట్టినది. 1984 సంవత్సరంలో రోజుకు 1200 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో 700 ఎకరాల్లో మొత్తం 2340 ఎకరాల్లో నాలుగు వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు కల్పించడం ఇందులో 450 మంది సాధారణ ఉద్యోగులు, ఒప్పంద ఆధారిత కార్మికులు 2000 మందితో ఏర్పాటు చేసినారు. ఈ సిమెంటు పరిశ్రమ యూనిట్ దేశంలోని ఇతర యూనిట్లకు ఉత్పత్తిలో గట్టి పోటీని ఇచ్చినది.

1991లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం నేతృత్వంలోని ప్రభుత్వం తీసుకువచ్చిన పారిశ్రామిక సంస్కరణల మూలంగా ఆదిలాబాద్ సిమెంట్ ఫ్యాక్టరీకి వినాశకరమైన ప్రభావాన్ని చూపించినది. కేంద్రం వాటా నిర్వహణ మూలధనం నిలిచిపోయినది మరియు ఉత్పత్తి ఆయన సిమెంటులో 60% శాతం కేంద్ర ప్రభుత్వం కొనుగోలు మానివేసేయడం మూలంగా ఫలితంగా నిర్వహణ నష్టాల కారణంగా 1998 నవంబర్లో ఈ పరిశ్రమ లో పక్షికంగా మూసి వేసినారు. 2008వ సంవత్సరంలో పరిశ్రమలో అన్ని కార్యకలాపాలు పూర్తిగా ఆపివేసినది దశాబ్ద కాలముగా కాలముగా నిలిచిపోయిన ఈ ప్లాంట్ ను శాశ్వతంగా మూసివేస్తారా! అనే అనుమానానికి ఆన్నంత పని చేశారు. పునరుద్ధరణ అంశం చిరకాల కోరికగానే మిగిలిపోయినవి సిసిఐ సాధన కమిటీతో పాటు, కార్మిక సంఘాలు చేసిన




ప్రయత్నాలు వృథా అయినది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సవితి ప్రేమను సిసిఐ పై చూపెట్టినది. అత్యధికంగా సున్నపు విలువలు ఉన్నప్పటికీ మూసివేసే దిశగానే ప్రభుత్వాలు మొగ్గుచూపినాయి. 2018 వ సంవత్సరంలో అదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల సమయంలో సిమెంట్ పరిశ్రమ పురోధరణకై చర్యలు తీసుకుంటానని నాటి భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకులు అమిత్ షా హామీ ఇచ్చి జిల్లా ప్రజల కోరికను మరచి తుంగలో తొక్కినారు. మళ్లీ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా సిసిఐ పరిశ్రమ పునరుద్ధరించి తిరిగి ప్రారంభిస్తామని రెండోసారి భారతీయ జనతా పార్టీ ప్రతిజ్ఞ కూడా చేసినవి అలాగే అసెంబ్లీ స్థానం భా.జా.పా గెలుపొందినది. అలాగే ఇచ్చిన హామీని మరిచి సిసిఐ పునరుద్ధరణకు ఎలాంటి ప్రయత్నాలు కూడా చేయకుండా కూల్చివేతలను అడ్డుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదు.

సీసీఐ పరిశ్రమ అవసరాలకు భూములు ఇచ్చిన బిల్లూరి, అదిలాబాదు, లాండ సాంగ్వి, బంగారుగూడ గ్రామ రైతులు తమ నల్లరేగడి మూడు పంటలు పండించే కమతాలను పరిశ్రమ అభివృద్ధికై ఇచ్చినారు. మొత్తం 2340 ఎకరాలు కలదు ఇందులో రైతుల ఇచ్చిన భూమిని తిరిగి రైతులకి అప్పచెప్పవలెను. ఎందుకంటే సిమెంట్ పరిశ్రమకు ఇచ్చిన భూములు ఫ్యాక్టరీ మూసి వేయడంతో తిరిగి భూమిని రైతులకి అప్పగించవలెను. రైతులకు వారసత్వంగా వచ్చిన భూమి స్థిర ఆస్తిని అభివృద్ధికి తీసుకున్న ప్రభుత్వం ఆశ నెరవేర్చకపోవడంతో రైతులకి తిరిగి వ్యవసాయ అభివృద్ధికై అప్పగించవలెను ఈ అంశాన్ని రైతు సంఘం నేతలు, కార్మిక సంఘాలు, సిసిఐ పరిరక్షణ సమితి/ కమిటీతో పాటు, రాజకీయ పక్షాలు కూడా రైతులకు అండగా నిలబడుతున్నాయి అయితే ప్రభుత్వంలోని కొందరు నాయకులు ఈ ప్లాంట్ కు చెందిన భూములను అమ్మివేయడానికి ఇతర అవసరాలకు ఇచ్చే ప్రయత్నంలో ఉన్నారని అంశం వివాధంగా మారినది. అలాగే కేంద్ర ప్రభుత్వం ఇటీవల "ఉడాన్" కార్యక్రమం కింద అదిలాబాదు విమానాశ్రయం పునరుద్ధరణలో భాగంగా సిసిఐకి ఆనుకొని ఉండటం వల్ల ఈ విమానాశ్రయానికి భూములు అప్పచెప్పుతారని అంశం కూడా కలదు. అయితే కేంద్ర ప్రభుత్వం తన ఆస్తులను భూములను సులభంగా అమ్ముకోవడానికి వీలు అయినది. ప్రస్తుతం జిల్లాలో ప్రభుత్వ దారపు మిల్లు మరియు సిమెంట్ పరిశ్రమ ఈ రెండింటిని మూసివే వేయడంతో జిల్లాలో ఒక్క ప్రభుత్వ పరిశ్రమ కూడా లేకుండా పోయినది. అపారమైన నల్ల రేగడి భూములలో అధిక దిగుబడి మేలు రకమైన పత్తి ఉత్పత్తిలో రాష్ట్రంలోని ఆదిలాబాద్ మొదటి స్థానంలో కలదు. ప్రభుత్వం ప్రత్యేక కాటన్/నూలు పారిశ్రామిక వాడ ఏర్పాటు చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అదిలాబాదులో పెరుగుతాయి. మౌలికమైన వసతులు కల్పనతో పాటు జిల్లాలో 44వ జాతీయ నాగపూర్, హైదరాబాద్, బెంగళూరు రహదారి ఉండటం అలాగే రైల్వే మార్గం ఉండడం దీనికి తోడుగా ప్రభుత్వం విమానాశ్రయం కూడా పునరుద్ధరణకు అనుమతులు కేంద్రం ఇవ్వడంతో త్రిబుల్ రవాణా సౌకర్యాలు కలవు. దీంతో పాటు సీసీఐని తిరిగి ప్రభుత్వ నూతన సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించి పునరుద్ధరించాలని జిల్లా ప్రజల ఆకాంక్ష....





## "ఆర్జీయూకేటీలో రెండో రోజు యూజీ అడ్మిషన్ల కోలాహలం"

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

నిర్మల్, జూన్ 6 : బాసరలో ప్రముఖ రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) బాసర, మహబూబ్‌నగర్ క్యాంపస్‌లకు సంబంధించి 2026-27 విద్యా సంవత్సర ఆరేళ్ల సమీకృత బీటెక్ కోర్సు ప్రవేశాల ప్రక్రియ రెండో రోజు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగింది. తెలంగాణ నలుమూలల నుండి తరలివచ్చిన గ్రామీణ, పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో క్యాంపస్ సందడిగా మారింది. తొలుత సాక్ (ఎస్ఏసి) బిల్డింగ్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గౌరవ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశంలోనే ప్రతిష్టాత్మకమైన ఈ విశ్వవిద్యాలయంలో సీటు సాధించినందుకు అభినందనలు తెలుపుతూ, పదో తరగతిలో చూపిన ప్రతిభను రాబోయే ఆరేళ్లలోనూ కొనసాగించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తద్వారా తల్లిదండ్రులకు, సంస్థకు మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఓఎస్డీ ప్రొఫెసర్ ఈ. మురళీ దర్శన్ మాట్లాడుతూ, విద్యార్థులకు అత్యుత్తమ విద్యను, ఉజ్వల భవిష్యత్తును అందించడానికి విశ్వవిద్యాలయం అహర్నిశలూ కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం కల్పిస్తున్న అత్యాధునిక సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు తమ భవిష్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దుకోవాలని దిశా నిర్దేశం చేశారు. ఆ తర్వాత విద్యార్థులు, తల్లిదండ్రులు సాక్ బిల్డింగ్ నుండి ఏబీ-1లోని అడ్మిషన్ కౌన్సిలింగ్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ అధికారుల పర్యవేక్షణలో ధ్రువపత్రాల పరిశీలన అత్యంత పారదర్శకంగా జరిగి, ప్రవేశాలు విజయవంతంగా ఖరారయ్యాయి. బాసర, మహబూబ్‌నగర్ రెండు క్యాంపస్‌లకు కలిపి ఇక్కడే ఉమ్మడిగా కౌన్సిలింగ్ నిర్వహిస్తుండటం విశేషం. ఈ నెల 5, 6, 8 తేదీలలో జరిగే ఈ మొదటి విడత ప్రవేశాల ప్రక్రియలో భాగంగా నేడు రెండో రోజు కౌన్సిలింగ్ సాగిందని విశ్వవిద్యాలయ అధికారులు వెల్లడిం చారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో క్యాంపస్ అంతా విహరించారు. తరగతి గదులను, మెస్సులను, వాతావరణాన్ని చూసి ఆహ్లాదకరమైనటువంటి ల్యాండ్ స్కేప్, కాలుష్యరహితమైన వాతావరణాన్ని, ప్రశాంతమైన పరిస్థితులను, విశ్వవిద్యాలయ మౌలిక వసతులు, ఇతర సదుపాయాలను చూసి అబ్బురపడ్డారు.

### క్యాంపస్ వాతావరణంపై హర్షాతిరేకాలు

గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన విద్యార్థులకు ఇంతటి అంతర్జాతీయ స్థాయి వసతులు, ప్రశాంతమైన చదువుల వాతావరణం దక్కడం ఒక గొప్ప వరమని పలువురు తల్లిదండ్రులు భావోద్వేగానికి లోనయ్యారు. ముఖ్యంగా డిజిటల్ తరగతి గదులు, అత్యా ధునిక కంప్యూటర్ ల్యాబ్‌లు, విశాలమైన గ్రంథాలయంతో పాటు విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించేలా ఉన్న మెస్ సదుపాయాలు వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. "క్యాంపస్‌లోకి అడుగుపెట్టగానే చదువుకోవాలనే పట్టుదల మరింత పెరిగింది. నగర కాలుష్యానికి దూరంగా, ప్రకృతి ఒడిలో ఉన్నట్లున్న ఈ వాతావరణం మా చదువులకు ఎంతో అనుకూలం" అని సీటు సాధించిన ఒక విద్యార్థి ఆనందంతో పంచుకున్నారు". "మరొక విద్యార్థి ఇదివరకే మాసాబ్ ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాలలో సి.ఎస్సీ. సిటు సంపాదించినప్పటికీ ఆర్జియుకేటి క్యాంపస్ విద్యావిధానానికి ఆకర్షితుడై ఇక్కడ అడ్మిషన్ తీసుకున్నానని చెప్పాడు". మొత్తంగా, ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో రెండో రోజు అడ్మిషన్ల ప్రక్రియ విద్యార్థుల నూతన ఆశలు, ఆకాంక్షల మధ్య అత్యంత విజయవంతంగా ముగిసిం ది. రాబోయే విద్యా సంవత్సరానికి ఈ క్యాంపస్ సరికొత్త విద్యా కుసుమాలను వికసింపజే యడానికి సర్వసన్నద్ధంగా ఉందని అధికారులు ఈ సందర్భంగా ధీమా వ్యక్తం చేశారు.

## రామగుండం రహదారుల అభివృద్ధిపై... ఎమ్మెల్యే సమీక్ష

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



హైదరాబాద్, జూన్ 6 : రామగుండం నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, ఆధునీకరణ, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాల కల్పనే లక్ష్యంగా రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ప్రత్యేక చొరవతో హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని రోడ్లు, భవనాల శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బి శాఖ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఐ. మోహన్ నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో రామగుండం నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న రహదారి అభివృద్ధి పనులు, ప్రతిపాదిత కొత్త రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు, విస్తరణ పనులు నిధుల కేటాయింపులపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ప్రజలు ఎక్కువగా ప్రయాణించే రహదారులకు ప్రాధాన్యతనిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే రహదారుల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా పనులు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. రామగుండం ప్రాంత అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో రామగుండం ఆర్ అండ్ బి ఈఈ, డీఈఈ, ఏఈలతో పాటు ఇతర ఇంజనీరింగ్ అధికారులు పాల్గొని నియోజకవర్గంలోని వివిధ రహదారి ప్రాజెక్టుల పురోగతిని వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి ద్వారా

## మరింత మెరుగైన వైద్య సేవలు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

(ప్రజాలక్ష్యం బ్యూరో)



మంచిర్యాల, జూన్ 6 : వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రిల అభివృద్ధి ద్వారా మరింత మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులు వేదవ్యాస్ లతో కలిసి ఆసుపత్రుల అభివృద్ధి సంఘం సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి అభివృద్ధి పనులకు గాను అవసరమైన బడ్జెట్ కేటాయింపు కొరకు ప్రతిపాదించడం జరిగిందని, ఇందులో భాగంగా ఆసుపత్రి ఇన్ఫ్రాస్ట్రక్చర్, సిబ్బంది నియామకం, ఆసుపత్రి నిర్వహణ, అంబులెన్స్ ఇతర అంశాలకు సంబంధించి ప్రతిపా దనలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో శస్త్ర చికిత్స, వైద్య పరికరాలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు కొరకు 2 కోట్ల 88 లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరిం చాలని, ఆ దిశగా నర్సులు, ఆసుపత్రి సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బందికి శిక్షణ అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలోని వార్డులు, పరిసర ప్రాంతాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, ఆసుపత్రి పరిసరాలలో ఉమ్ము వేసిన వారికి జరిమానా విధించా లని తెలిపారు. ఆసుపత్రిలో నీటి సౌకర్యం కొరకు మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లా కనెక్షన్ అందించడం జరుగుతుందని, ఆసుపత్రిలో ప్రజా ప్రయోజనకరంగా అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారలు తదితరులు పాల్గొన్నారు.

## బీర్ల నిలయానికి పోటెత్తిన అభిమానుల ప్రవాహం



గజమాలలు, సేవా కార్యక్రమాలతో విప్ బీర్ల ఐలయ్య జన్మదిన వేడుకలు



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

యాదాద్రి భువనగిరి, జూన్ 6 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య జన్మదిన వేడుకలు శనివారం యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బీర్ల నిలయం వద్ద ఉదయం నుంచే అభిమానులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం సందర్భంగా బీర్ల అయిలయ్య యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి ఆశీస్సులు పొందారు. బీర్ల నిలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో దేవస్థానం అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అభిమానులు భారీ క్రేన్ గజమాలతో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిమానులు, నాయకులు, కార్యకర్తల రాకపోకలతో బీర్ల నిలయం జనసంద్రంగా మారింది. వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్‌రావు, జాయింట్ కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## సీఎం ఆశీస్సులు తీసుకున్న బీర్ల అయిలయ్య

### జన్మదిన వేళ రేవంత్, కోమటిరెడ్డితో భేటీ

### ఆలేరు అభివృద్ధిపై చర్చ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



యాదాద్రి భువనగిరి, జూన్ 6 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తన జన్మదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్లు-భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి, ఆలేరు నియోజకవర్గ ప్రగతి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుపై పలు అంశాలను చర్చించారు. బీర్ల అయిలయ్యకు ముఖ్యమంత్రి, మంత్రి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న బీర్ల అయిలయ్య సేవలను వారు అభినందించారు. కాగా, బీర్ల అయిలయ్య జన్మదినం సందర్భంగా ఆలేరు నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఆర్డీవోగా ఎం.రాజేశ్వరి బాధ్యతలు స్వీకరణ

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)



మహబూబాబాద్ టౌన్, జూన్ 06 : మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారిణి (ఆర్డీవో)గా ఎం. రాజేశ్వరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై మహబూబాబాద్‌కు వచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్‌ను మర్యాదపూర్వ కంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మహబూబా బాద్ ఆర్డీవోగా అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలో రెవెన్యూ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందిం చేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు.

# ప్రభుత్వ భూములను పెద్దలకు దోచిపెడుతున్న రేవంత్

మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ.. సీఎం కుటుంబ సభ్యులు, ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు భూదందాలో చురుకుగా ఉన్నారని ఆరోపించారు. అయితే ఈ ప్రభుత్వ భూములను సుప్రీంకోర్టు వరకు వెళ్లి తాము కాపాడుతామని స్పష్టం చేశారు. హైడ్రా..పేదల కాలనీల్లో దాడులు చేసి ఆ భూములను పెద్దలకు అప్పగిస్తోందని మండిపడ్డారు. శ్రీఆదిత్య కంపెనీ రివర్ బెడ్‌పైన ప్రాజెక్టు కడుతోందని.. ఆ కంపెనీ వెనుక ఓ ఎంపీ ఉన్నారన్నారు. శ్రీ ఆదిత్య కంపెనీకి బీఆర్ఎస్ హయాంలోనే పర్మిషన్ ఇచ్చారని.. దాన్ని ముట్టుకునే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డికి నీళ్లపై అవగాహన లేదని కవిత విమర్శించారు. మహారాష్ట్ర సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ఏపీ సీఎం ఇవ్వరా? అని ప్రశ్నించారు. ఏపీ సీఎంతో మాట్లాడి 200 టీఎంసీల నీళ్లు తెచ్చి ఆ తర్వాత బనకచర్ల గురించి మాట్లాడాలన్నారు. అప్పుడు కేటీఆర్ పాలన నడిచిందని.. ఇప్పుడు కూడా కేటీఆర్ పాలనే నడుస్తోందన్నారు. అప్పుడు కేటీఆర్ అంటే కేసీఆర్, తన్నీరు హరీష్ రావు, రామారావు.. ఇప్పుడు కేటీఆర్ అంటే కొండల్ రెడ్డి, తిరుపతి రెడ్డి, రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీజేపీ పరస్పర సవాళ్లతో ఒరిగేదేమీ లేదని కవిత విమర్శించారు. తెలంగాణ బరాబర్ ప్రజల జాగీరే అని.. పవన్ కల్యాణ్ జాగీర్ కాదని కవిత స్పష్టం చేశారు. ఆంధ్రా విషకోరల నుంచి తెలంగాణను కాపాడుకున్నామన్నారు. ఇక్కడకు వచ్చి రాజకీయం చేస్తామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పవన్‌కు మద్దతు ఇస్తే నాలుగు ఓట్లు వస్తాయని బీజేపీ భావిస్తోందని.. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న 8 సీట్లు పోతాయన్నారు. పవన్ కల్యాణ్ 10 ఎకరాలు శిఖం భూమిని కొనుగోలు చేశారని.. కోడికుంట సర్వే నంబర్ 706లో శిఖం భూమి ఉందన్నారు. రిజిస్ట్రేషన్ సమయంలో అనేక తప్పులు జరిగాయని.. ఆ భూమిని పవన్ తిరిగి ఇచ్చేయాలన్నారు. శిఖం భూమిలో వేసిన కంచెను పవన్ తొలగించాలని కవిత డిమాండ్ చేశారు.

# వర్షాకాలం వస్తోంది... ముందస్తు చర్యలకు సిద్ధం కండి

మొదటిపేజీ తరువాయి

ఆదేశించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించేలా అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న వరి కొనుగోళ్లను వేగవంతం చేసి, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు మార్గనిర్దేశర చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనిచేయాలని జిల్లా యంత్రాంగానికి సీఎస్ సూచించారు. వర్షాల పరిస్థితులపై నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల హెచ్చరికలు, వరి కొనుగోళ్లు, సీఎం పర్యటనల నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాల పర్యటనల ఏర్పాట్లపైనా సీఎస్ అధికారులతో చర్చించారు. సీఎం పర్యటనలు విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. భద్రతా ఏర్పాట్లు, ప్రజాసభల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, వసతి ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా డిమాండ్ ఆరంభం మాత్రమేనని సీజేపీ స్పష్టం చేసింది. సీజేపీ మద్దతుదారులను ఉద్దేశించి అభిజీత్ దీప్కే మాట్లాడుతూ, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేంత వరకూ నిరసనలు కొనసాగుతాయని ప్రకటించారు. ఇంకెంతమంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకునేంత వరకూ అధికారులు వేచిచూస్తారని నిలదీశారు. తమ డిమాండ్ల నెరవేరేంత వరకూ ఈ ఉద్యమం కొనసాగుతుందన్నారు. నిరసనలకు దిగితే జైలులో పెడతారేమోనని తన తల్లి భయపడినట్టు దీప్కే చెప్పారు. 'తమ పిల్లలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పితే ఏమవుతుందోనన్న భయం ఈ దేశంలోని ప్రతి తల్లికి ఉంది. ఈ ప్రభుత్వానికి భయపడి ఎంతకాలం బతకాలని ఆయన ప్రశ్నించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించాలని నెలరోజుల నుంచి డిమాండ్ చేస్తున్నప్పటికీ చర్చలు తీసుకోవడం లేదని, దీనికి బదులు ఇతర అంశాలపైనే వాళ్లు దృష్టి పెట్టారని అన్నారు. సీజేపీ అకౌంట్లు హ్యాక్ చేయడం, పోస్టులు డిలీట్ చేయడం చేస్తున్నారని చెప్పారు. పోస్టులను డీలీట్ చేయవచ్చు కానీ, తమను ఏమార్చలేరని అన్నారు. పేపర్ లీక్‌లు, విద్యావ్యవస్థలో తప్పిదాల కారణంగా ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల పేర్లను ఆయన చదవి వినిపించారు. విద్యార్థుల మృతికి సీజేపీ సంతాపం ప్రకటించింది. జంతర్‌మంతర్ నిరసనల్లో పాల్గొనేందుకు ఆయన అమెరికాలోని బోస్టన్ నుంచి ఢిల్లీకి వచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జీవిత చరిత్రను చేత్తో పట్టుకుని కనిపించారు. జంతర్ మంతర్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ విద్యాశాఖ మంత్రిగా ఆయన ఉండాలని కోరారు. అయితే తనకు రాజకీయాల్లో ప్రవేశించాలనే ఆలోచన లేదని వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. యువకులే ఆ బాధ్యత చేపట్టాలన్నారు. రాజకీయవేత్తలు, ప్రభుత్వ అధికారుల పిల్లలు ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే చదవాలని తాను కోరుకుంటు న్నట్టు చెప్పారు. సీజేపీ నిరసనలకు ప్రభుత్వం అనుమతించడాన్ని ఆయన స్వాగతించారు. నిరసన తెలపడం తనకు ఇష్టం లేకున్నా న్యాయం కోసమే ఆ పని చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థలో మార్పు జరగాలని అన్నారు. కాగా, తదుపరి నిరసన ప్రదర్శనను జూన్ 23న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించే ఆలోచనలో సీజేపీ ఉంది. ఈ కార్యక్రమంలో వందలాదిమంది యువత పాల్గొని కాక్రోజ్ జనతాపార్టీకి మద్దుతగా నిలిచారు.

# తొందరపడి రాజీనామాలు చేయొద్దు

**- తమిళనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్**

చెన్నై, జూన్ 6 : తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై రాజీనామా అనంతరం పార్టీ రాష్ట్ర శాఖలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరు నాగరాజన్, రాష్ట్ర కార్యదర్శి సుమతి వెంకటేష్ ఇప్పటికే రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. దీనిపై పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు నైనార్ నాగేంద్రన్ తాజాగా స్పందించారు. పార్టీ శ్రేణులు ఎవరూ రాజీనామాలు చేయవద్దని కోరారు. ఎవరి రాజీనామాలను ఆమోదించేందుకు తమకు అనుమతి లేదని శనివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆయన చెప్పారు. 'బీజేపీకి అన్నామలై శుక్రవారంనాడు రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను పార్టీ ఆమోదించింది.

# వైట్ కాలర్ జాబ్స్‌కు ప్రత్యామ్నాయం... బ్లూకలర్ జాబ్స్

మొదటిపేజీ తరువాయి

సీఎం తెలిపారు. జలవనరుల కబ్జాను అడ్డుకునేందుకే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. నేడు ఎవరైనా చెరువులు, కుంటల వంటివాటి జోలికి వెళ్లాలంటే భయపడుతున్నారని చెప్పారు. బెంగళూరులో ఓ సదస్సులో పాల్గొన్న సీఎం.. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌పై మాట్లాడారు. ధనికులు విలాస భవనాలు, ఫామ్ హౌస్‌ల కోసం చెరువులను ఆక్రమిస్తున్నారు. అంతేకాకుండా తమ భవనాల వ్యర్థాలను చెరువుల్లో కలుపుతున్నారు. ఈ కబ్జాలను అరికట్టేందుకే సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో 3 వేలమందితో హైడ్రా ఏర్పాటు చేశాం. ఇవాళ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా.. ఆ కట్టడాలను నేలమట్టం చేస్తున్నాం. డ్రగ్స్ నివారణకు ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ దేశంలోనే ఉత్తమమైనది. హైడ్రా, ఈగల్ ఫోర్స్‌లను దేశమంతా ఆసక్తిగా చూస్తోందన్నారు. తనను మభ్యపెట్టడం అంత ఈజీ కాదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పరిపాలనలో కామన్ సెన్స్ అనేదే ముఖ్యమని.. కామన్ సెన్స్‌తో సమస్యలు పరిష్కారం చేసేవే ఎక్కువ అని తెలిపారు. తాను కేసీఆర్ మీడియా పీపుల్స్‌ను కూడా మీడియా సమావేశానికి పిలుస్తానన్నారు. వాళ్ళ మైండ్ సెంట్ ఏంటో తెలుసుకుంటానని చెప్పారు. తనకు వేరే ఏ పని లేదని.. 16 నుంచి 18 గంటలు పని చేస్తానన్నారు. తాను ఫుట్‌బాల్ ఆడతానని.. అందుకే మెస్సీని తీసుకువచ్చినట్లు తెలిపారు. యువతను క్రీడల వైపు మళ్లించాలనేది తన లక్ష్యమని చెప్పారు. తాను కొద్ది మంది జర్నలిస్టులతో రాత్రి సమయంలో మాట్లాడతానని, పాలనపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటా అన్నారు. తనకు వ్యతిరేకంగా వార్తలు రాసినా చూస్తానని, దాని నుంచి కూడా కొంత సమాచారం వస్తుందన్నారు. పేదలు చెరువు పరిసరాలు ఆక్రమించుకున్నారు అంటే అర్థం చేసుకుంటానని.. కానీ పెద్ద వాళ్ళు కూడా చెరువులను అక్రమిస్తే ఎట్లా? అని ప్రశ్నించారు. హైడ్రా వచ్చాక.. ఎవరైనా ఇప్పుడు ధైర్యం చేస్తారా అడగండి. చెరువు కబ్జా చేయడానికి ఆలోచన చేస్తారేమో అని నిలదీశారు. ఓ వైపు క్యాస్టిజం వద్దంటం. మరో వైపు.. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు వేరే హాస్టల్స్ పెడుతుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పెడుతున్న. అందరూ అందులో చదువుకోవాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ అమలు చేసింది మేమే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేయలేదు. ఓబీసీ జనాభా లెక్కలు కూడా లేవు. తెలంగాణలో ఆ లెక్కలు కూడా తేల్చేశాం. వెనకబాటు తనం, ఆర్థిక పరమైన అంశమే కాదు. విద్యా, సామాజిక అంశాలు. మేము పేద విద్యార్థులు చదువుకునే పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్ కూడా ఏర్పాటు చేస్తున్నాం. మేము పిల్లని ఇంటి నుంచి స్కూల్ వరకు వాహనాలు కూడా ఏర్పాటు చేస్తాం. ఈ ఏడాది ప్రభుత్వం స్కూల్స్‌లో లక్ష మంది విద్యార్థుల సంఖ్య పెరిగింది. ట్రాన్స్పోర్టేషన్, బ్రేక్ఫాస్ట్, ఏర్పాటు చేస్తున్నాం. మా నాన్న రైతు. అందుకే మేము గోచి కడతాం పంచెలు, దోతీలు కూడా కడతాం. మా ఆహార్యం అలాగే ఉంటుంది.ఫ్రెండ్లీ మ్యాచ్ లాగే.. నా పొరుగు రాష్ట్రాలతో ఉంటా. హైడ్రా లాంటి ఆలోచన అన్ని రాష్ట్రాలకు అవసరం లేదు. మెట్రో పాలిటన్ సిటీలకు అవసరం. మహిళా రిజర్వేషన్‌కి మేం హక్కుదారులం. మహిళను రాష్ట్రపతి, ముఖ్యమంత్రులను చేసింది మేమే. సోనియా గాంధీ మహిళలకు రిజర్వేషన్ కోసం ప్రయత్నం చేశారు. మోడీ పొలిటికల్ ఫార్ములా వాడుతున్నారు. మేము నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్‌లకు వ్యతిరేకం కాదు. మోడీ చేస్తున్న ఆలోచనకి వ్యతిరేకం. తెలంగాణ, కర్ణాటకలో కూడా బీజేపీ ఎంపీలు గెలిచారు. కానీ కేంద్ర కేబినెట్‌లో ప్రధాన కేంద్ర మంత్రి పదవులు లేవు. ఢిల్లీలో దక్షణాది ఎంపీలు సెకండ్ గ్రేడ్ పీపుల్స్ లాగా చూడొద్దు అంటున్నాం.' అని సీఎం వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ పాలనలో పాలమూరుకు ద్రోహం

మొదటిపేజీ తరువాయి

బ్యారేజి కమ్ బరాజ్‌లపై ఎలా ఏరియల్ సర్వే చేశారని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు చంద్రబాబు ఎన్‌వోసీ ఇస్తే బనకచర్లపై సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తానని అంటున్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ జల హక్కులపై చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. మీరు తిరిగే రిజర్వాయర్‌లు కట్టింది కేసీఆర్ కాదా అని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు నిర్మాణానికి త్తటెడు మట్టిని కూడా రేవంత్ ప్రభుత్వం తీయలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును డిజైన్ చేసింది 45 కిలోమీటర్ల కాలువలు అని.. అందులో41 కిలోమీటర్ల కాలువలు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయని తెలిపారు. మొత్తం రూ.33,500కోట్ల పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన పనులను కాంగ్రెస్ చేసిందని చెప్పుకుంటారా అని సీఎం రేవంత్ రెడ్డిపై మండిపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి పనుల జాప్యానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వమని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.

రెండున్నరేళ్లుగా తట్టెడు మట్టి తీయలేదు

సీఎం తీరుపై మండిపడ్డ మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

రెండున్నరేళ్లయినా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో తట్టటెడు మట్టి తీయలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి విమర్శించారు. ఇప్పుడు పూర్తి చేస్తామని అంటే ఎలా నమ్ముతారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాదయాత్ర చేస్తానని అంటేనే కాంగ్రెస్ ప్రభుత్వం కదిలిందని అన్నారు. ఇప్పుడు అకస్మాత్తుగా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కాంగ్రెస్ సర్కార్‌కు ప్రేమ పుట్టిందని అన్నారు. కాంగ్రెస్ సర్కార్ రెండున్నరేళ్లపాటు పాలమూరు-రంగారెడ్డిని పడావు పెట్టిందని మండిపడ్డారు. మహబూ బ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ రెడ్డితో కలిసి లక్ష్మారెడ్డి మీడియా తో మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డికి రేవంత్ రెడ్డి సర్కార్ ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. ప్రాజెక్టులు పూర్తి చేయాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వలేనే సోయి లేదని అన్నారు. 10 శాతం ప్రాజెక్టును పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఏడాది సమయం కావాలని అంటుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ పూర్తి కాలేదని సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని తెలిపారు. రేవంత్ రెడ్డి పచ్చి అబద్దాలు చెబుతున్నాడని మండిపడ్డారు. మహబూబ్‌నగర్‌ను కాంగ్రెస్ సర్వనాశనం చేసిందని లక్ష్మారెడ్డి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలోనే మహబూబ్‌నగర్ అభివృద్ధి జరిగిందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఉత్తమ్ మాటలు అన్ని ఉత్తవే అని ఎద్దేవా చేశారు. పాలమూరు జిల్లా ప్రజలకు సీఎం రేవంత్ రెడ్డి మాటలపై నమ్మకం లేదని లక్ష్మారెడ్డి అన్నారు. పాలమూరు జిల్లా అభివృద్ధి కోసం బీఆర్ఎస్ పోరాడుతూనే ఉంటుందని స్పష్టంచేశారు

# అష్టదరిద్రులు అడ్డంపడ్డా అభివృద్ధి ఆగదు

మొదటిపేజీ తరువాయి

కావు ఇవి. వరి రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తున్నాం అని గుర్తు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని ధ్వజమెత్తారు. కాళ్లలో కట్టెలు పెట్టినా.. మూసీలో పడి దొర్లినా వాళ్లను పట్టించుకోమని విమర్శించారు. అసూయ పడేవాళ్లు, అజీర్ణం చేసుకునేవాళ్లు ఎప్పుడూ ఉంటారని ఎద్దేవా చేశారు. రూ.2,284 కోట్లతో 239 ఎకరాల్లో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్నారు. చుక్కనీరు ఎత్తిపోయకుండా లక్షల మెట్రిక్ టన్నుల పంట పండలేదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ నీళ్లున్నా కాళేశ్వరం నీళ్లు అనేవారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కడితే కూలేశ్వరం అయిందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరాన్ని రూ.లక్ష కోట్లు వెచ్చిస్తే గోదావరి పాలయ్యాయని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో విధ్వంసం చేస్తే.. మేం వికాసం వైపు నడిపిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలు అసూయ, పగ తమపై చూపండని.. కానీ ప్రజలపై కాదని చెప్పారు. సమస్యలు వస్తే పారిపోమని.. నిలబడి కొట్లాడి పరిష్కరించుకుంటామని అన్నారు. ఫామ్‌హౌస్ కేడీతోనైనా, ఢిల్లీలో మోదీతోనైనా కొట్లాడేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. చేతకాకపోతే దిగిపొమ్మంటున్నారని.. తాము అల్లాటప్పాగా రాలేదని చెప్పారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సంగతి చెబుతామని హెచ్చరించారు. మర్యాద తప్పితే.. పొలిమేరలు కూడా దాటనివ్వమని వార్నింగ్ ఇచ్చారు. మోదీని చూపి భయపెట్టాలనుకుంటే.. ఇక్కడెవరూ భయపడేవారు లేరని చెప్పుకొచ్చారు ఈనెల 15 తర్వాత వడ్లు కొనకపోతే కేంద్రం సంగతి చూస్తామని హెచ్చరించారు. మాకు మాటలే కాదని.. చేతలు కూడా తెలుసునని అన్నారు. కేంద్రం నుంచి నిధులు ఎలా తెచ్చుకోవాలో తమకు తెలుసునని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరం వేగంగా విస్తరిస్తోందని వ్యాఖ్యానించారు. భూముల ధరలు బాగా పెరిగాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడంతో వ్యవసాయం కుంటుపడిందని చెప్పుకొచ్చారు. హైదరాబాద్‌లో 1.34 కోట్ల మంది నివసిస్తున్నారని తెలిపారు. ఒకప్పుడు హైదరాబాద్ చుట్టూ కూరగాయలు పండేవని వెల్లడించారు. గడ్డిఅన్నారం నుంచి ఫ్రూట్ మార్కెట్‌ని ఇక్కడికి తరలించారని ప్రస్తావించారు. రేకుల షెడ్లు వేస్తే.. అవి గాలి దుమారానికి ఎగిరిపోయాయని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ నిర్మిస్తామని హామీ ఇచ్చామని చెప్పారు. పండ్ల మార్కెట్ కోసం మనం చేసిన ప్రయత్నాన్ని అడ్డుకోవాలని చూశారని ధ్వజమెత్తారు. అందరి అవసరాలు తీర్చేలా మార్కెట్ నిర్మాణం చేయబోతున్నామని స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌తో ఏటా రూ.8 వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. మన ప్రాంతంలో రైతులు అన్ని రకాల పండ్లు పండించాలని ఆకాంక్షించారు. ఫార్మా సిటీ వద్దని ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేయబోతున్నామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ స్థాయి కంపెనీలను ఇక్కడికి తీసుకురాబోతున్నామని వివరించారు. కాలుష్యం లేని పరిశ్రమలే ఈ ప్రాంతానికి వస్తాయని వెల్లడించారు. ఫ్యూచర్ సిటీ, మార్కెట్, ఆర్ఆర్ఆర్ వద్దంటూ అడ్డం పడుతున్నారని చెప్పుకొచ్చారు. వరంగల్ ఎయిర్‌పోర్టు వద్దని అడ్డుకుంటోందని ఆగ్రహించారు. గతంలో కావాలని మనం పోరాడితే.. ఇప్పుడు అష్టదరిద్రులు అడ్డం పడుతున్నారని దుయ్యబట్టారు. అభివృద్ధి చేద్దామంటే అడ్డుపడుతున్నారు.. ధర్నాలు చేస్తున్నారని ఫైర్ అయ్యారు. 2034 వరకు ప్రజాపాలన ఉంటుందని స్పష్టం చేశారు. ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్.. తమ నినాదమని ఉద్ఘాటించారు. అభివృద్ధి పనులు చేసుకుంటూ ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. ఎంతమంది అడ్డం పడినా అభివృద్ధి పనులు ఆగవని తేల్చిచెప్పారు. సదుపాయాలు ఉంటేనే అంతర్జాతీయ స్థాయి నగరం అవుతుందని తెలిపారు. 'కారు' పూర్తిగా చెడిపోయి కార్ఖానాలో ఉంది. ఎన్ని మరమ్మతులు చేసినా.. చెడిపోయిన ఆ కారు ఇక పనికిరాదు. కేసీఆర్ కుర్చీ వేసుకొని కూర్చొని.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మిస్తానని చెప్పారు. కానీ.. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. మేం అభివృద్ధి చేస్తుంటే.. అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోంది. కాలుష్యం వెదజల్లే ఫార్మాసిటీ వద్దని.. ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తున్నాం. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 500 కంపెనీలు తీసుకురావాలని యత్నిస్తున్నాం. బీఆర్ఎస్ నేతలు దశాబ్దంలోనే శతాబ్దానికి సరిపడా విధ్వంసం చేశారు. తెలంగాణలో పండిన ధాన్యాన్ని కొనలేని మోదీ గద్దె దిగాలి. రాహుల్ గాంధీని ప్రధాని చేసి.. మొత్తం ధాన్యాన్ని కేంద్రంతో కొనిపిస్తా. పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా తెస్తా. మెట్రో విస్తరణకు, ఆర్ఆర్ఆర్‌కు వెంటనే నిధులు తీసుకొస్తా అని సీఎం అన్నారు.

# అన్నామలైకి భారీ ఫాలోయింగ్

మొదటిపేజీ తరువాయి

రాజకీయాల్లోకి రావడం చాలా పెద్ద విషయమని అన్నారు. నేతల దగ్గరకు ప్రజలకు తీసుకువెళ్లడం కాకుండా.. రాజకీయాలనే ప్రజల వద్దకు తీసుకువెళ్లడమే తన ఆలోచన అని పేర్కొన్నారు. సంప్రదాయ, వంశపారంపర్య రాజకీయాలను అంతం చేయడానికి తనతో కలసిరావాలని యువతను కోరారు. వియ్ ది పీపుల్‌ను ప్రారంభించిన ఒక్క రోజులోనే కొత్తగా 14 లక్షల మంది వాలంటీర్లుగా తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగడమే తన లక్ష్యమని అన్నామలై ఇప్పటికే స్పష్టం చేశారు. సామాన్యుల ప్రయోజనాలే కేంద్రంగా రాజకీయాలు ఉండాలని చెప్పారు. అసలైన మార్పునకు దారితీసే రాజకీయాల అవసరం ఉందని అన్నారు. భవిష్యత్తు తరాలకు గట్టి పునాదులు వేసేందుకు తాను ప్రయత్నిస్తున్నానని చెప్పారు. వ్యక్తి పూజకు, కుటుంబరాజకీయాలకు తావులేదని చెప్పారు. తన ఉద్యమానికి వాలంటీర్లే జీవనాడి అని అన్నారు. కొత్త తరం నాయకులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు, క్షేత్రస్థాయిలో అసలైన మార్పు కోసం వాలంటీర్లు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం.. ఇలా తమకు నచ్చిన రంగాన్ని వాలంటీర్లు ఎంచుకుని చేతనైన మేరకు తాముంటున్న చోట మేలి మార్పులు తీసుకురావాలని కోరారు. రాబోయే రోజులు మరింత మెరుగ్గా ఉండేలా తాను చేస్తున్న ప్రయత్నాలను చేయూతను ఇవ్వాలని పిలుపునిచ్చారు.

# సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం

మొదటిపేజీ తరువాయి

ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. పెనాంగ్‌కు ఉన్న సెమీ కండక్టర్ అసెంబ్లీ, టెస్టింగ్, ప్యాకేజింగ్ అనుభవం తెలంగాణకు ఉపయోగపడుతుందని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. తెలంగాణ-మలేషియా మధ్య సాంకేతిక, పెట్టుబడి సహకారాన్ని బలోపేతం చేయాలని ఇరుపక్షాలు అంగీకరించాయి. మలేషియా ప్రతినిధి వైబీ జగదీప్ సింగ్ దియో తెలంగాణతో కలిసి పనిచేయడానికి ఆసక్తి వ్యక్తం చేశారు.

# గండిపేట భూకబ్జా కేసు

మొదటిపేజీ తరువాయి

తమిళనాడులోని కాంచీపురంలో అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రోడ్డు మార్గం ద్వారా హైదరాబాద్‌కు తీసుకువచ్చి నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో భాగంగా స్టేట్‌మెంట్ నమోదు చేసిన అధికారులు, ఆ తర్వాత న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. బొల్లా బ్రహ్మనాయుడిని నార్సింగి పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తున్నారనే సమాచారం అందడంతో వైసీపీ కార్యకర్తలు, ఆయన అనుచరులు భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. భద్రతా కారణాల దృష్ట్యా పోలీస్ స్టేషన్‌లోకి ఎవరినీ అనుమతించ లేదు. దీంతో కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నార్సింగి పోలీస్ స్టేషన్ నుంచి బొల్లా బ్రహ్మనాయుడిని కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉప్పరపల్లి కోర్టుకు తరలించారు. ఈ కేసుకు సంబంధించిన వాదనలు విన్న కోర్టు ఆయనకు 14 రోజుల రిమాండ్ విధించింది. అనంతరం చంచల్‌గూడా జైలుకు పంపించారు. గండిపేట భూకబ్జా కేసులో ఇప్పటికే ఐదుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు అరెస్టుతో మొత్తం అరెస్టుల సంఖ్య ఆరుకు చేరాయి. ఈ కేసులో మరికొంతమందిని కూడా విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. భూకబ్జాకు సంబంధించిన పలు కోణాల్లో సైబరాబాద్ పోలీసులు విచారణ చేపట్టారు. భూముల ఆక్రమణ, పత్రాల వ్యవహారం, సంబంధిత వ్యక్తుల పాత్ర వంటి అంశాలపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా మరిన్ని చర్యలు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. గండిపేట భూకబ్జా కేసులో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి అరెస్ట్, అనంతరం కోర్టు రిమాండ్ విధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# సత్వరంగా మహిళా సమాఖ్య భవన నిర్మాణాలు

మొదటిపేజీ తరువాయి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భం గా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. మహిళా భవనాల నిర్మాణ పురోగతిని రోజూ పరిశీలిస్తామని తెలిపారు. ఈ నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం సహించ బోమని హెచ్చరించారు. ఎంపీడీవోలు ఈ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత, పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షించాలని దిశానిర్దేశర చేశారు. ఉపాధి హామీ పనుల అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణాభివృద్ధి పనుల్లో లక్ష్యాల సాధించాలని అధికారులకు.. మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు.

# కరీంనగర్‌లో కూలిన లిఫ్ట్

మొదటిపేజీ తరువాయి


ఎమ్మెల్యే కవ్వంపల్లితో పాటు లిఫ్ట్‌లో మరో ఆరుగురు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఎమ్మెల్యే కవ్వంపల్లి లిఫ్ట్ ప్రమాదానికి గురయ్యారని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు ఆందోళన చెందారు.

# ఆనంద్‌నగర్ కాలనీలో లిఫ్ట్ ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

కాలనీలోని భావన అపార్ట్‌మెంట్స్ లో లిఫ్ట్‌లో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో రాధ (58) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ప్రమాదం అపార్ట్‌మెంట్ 5వ అంతస్తులో జరిగింది. లిఫ్ట్ పూర్తిగా ఆ అంతస్తుకు చేరుకోక ముందే బాధితురాలు తలుపు తెరిచింది. దీంతో ఆమె ఒక్కసారిగా లిఫ్ట్ గుంతలో పడిపోవడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెతో పాటు ఉన్న 13 నెలల మనవడు జియోల్ గాయపడటంతో వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటన అనంతరం అపార్ట్‌మెంట్ నివాసితులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

# వీర యోధుడు చత్రపతి శివాజీ యువతకు ఆదర్శం






**- రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
**- కొత్తపేటలో చత్రపతి శివాజీ విగ్రహావిష్కణ**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

జగిత్యాల, జూన్ 06 : చత్రపతి శివాజీ వీర యోధుడని నేటితరం యువత శివాజీని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గం ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని మంత్రి అడ్లూరి శనివారం ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ గ్రామంలో చత్రపతి విగ్రహ నిర్మాణం చేపట్టడం అభినందనీయమని, విగ్రహ నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ధర్మపురి నియోజకవర్గం లోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి కృషి చేస్తున్నట్టు మంత్రి వివరించారు. మేడారం రిజర్వాయర్ నుండి కొత్తపేట వరకు 11 గ్రామాలకు ఉపయోగపడే సాగునీటి పనులు త్వరలోనే పూర్తి చేయిస్తానని, ముంజంపల్లి మారేడుపల్లి గ్రామాలకు సాగునీటిని అందించే 11ఎల్ కాలువ పనులు సైతం పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. పత్తిపాక రిజర్వాయర్, అక్కపల్లి ఎత్తిపోతల పథకంతో పాటు రోళ్ళ వాగు ప్రాజెక్టు పూర్తి చేసి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సాగునీటిని అందించాలని ఇటీవల నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలిసి విన్నవించినట్లు మంత్రి వెల్లడించారు. కొత్తపేట గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జీరెడ్డి మహేందర్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్ యాదవ్, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్ యాదవ్, ఎండపల్లి ఫ్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, నాయకులు మద్దుల గోపాల్ రెడ్డి, తాటిపర్తి శైలేందర్ రెడ్డి, కందికట్ల రాజేశం, రావు సుగ్రీవ రావు, ఎలుక రాజు యాదవ్, ఉప సర్పంచ్ క్రాంతి కుమార్, బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు, ఏఎంసి డైరెక్టర్ పోలోజు శ్రీనివాస్, జంగ మహేందర్ యాదవ్, బెడ్డల ప్రవీణ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, గాజుల విజయ్, బిజెపి నాయకులు కొమ్ము రాంబాబు యాదవ్, మామిడిపెల్లి ప్రసాద్, గోపినవేని గంగాచలం యాదవ్, తిరుమల ప్రమోద్ గౌడ్, మంచికట్ల రవి, దుర్గం రమేష్, బుద్దే బాపు, కుశనపల్లి నరేష్, దర్శనాల మహేందర్, మామిడిపల్లి రమేష్, దాసరి మల్లేశం, గ్రామ శివాజీ విగ్రహ నిర్మాణ సమితి అధ్యక్షుడు రావు హనుమంతరావు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**- కేటీకే-ఓసీ-2 గనిలో ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం**
**- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏరియా జిఎం ఏనుగు రాజేశ్వర్ రెడ్డి**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)




జయశంకర్-భూపాలపల్లి, జూన్ 6: ప్రమాదాల నివారణతో పాటు సురక్షితమైన పని వాతావరణం కల్పించడమే లక్ష్యంగా కేటీకే-ఓసీ-2 గనిలో శనివారం ప్రత్యేక భద్రతా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు భద్రతా నియమాలు, ప్రమాదాల నివారణ చర్యలు, విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి భద్రతను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. "జీరో హార్మ్" లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని, ప్రమాదాలను పూర్తిగా నివారించేందుకు భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ అప్రమత్తతతో విధులు నిర్వహించాలని కోరారు. భద్రత అనేది కేవలం యాజమాన్యం బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఉద్యోగి బాధ్యత అని అధికారులు పేర్కొన్నారు. సురక్షితమైన పనితీరు ద్వారానే ప్రమాదరహిత వాతావరణాన్ని సృష్టించవచ్చని, భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా సంస్థ అభివృద్ధికి కూడా తోడ్పాటు అందించవచ్చని వివరించారు. కేటీకే-ఓసీ-2 ప్రాజెక్టు అధికారి శ్యాంసుందర్, ఏరియా రక్షణాధికారి మాటూరి రవీందర్, ఆఫీషియేటింగ్ ఏరియా ఇంజనీర్ వాల్మీకి కృష్ణయ్య, గని మేనేజర్ బోయిన రామాకాంత్, సంక్షేమ అధికారి ఎస్. సాధన్, రక్షణాధికారి శివకుమార్, కార్మిక సంఘాల ప్రతినిధులు కరీముల్లా, మండల శ్రీనివాస్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం...

**రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ములుగు, జూన్ 6 : ప్రజలకు మౌలిక వసతుల కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శనివారం ములుగు మున్సిపల్ పట్టణ పరిధిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సీఆర్ఆర్ 2025-26 నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ములుగు పట్టణ పరిధిలో జాతీయ రహదారి-163 నుండి ఎరుకలవాడ వరకు రూ.6 కోట్ల 50 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ,డివైడర్,సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు,జాతీయ రహదారి-163 నుండి ఎస్సీ కాలనీ వరకు రూ.5 కోట్ల 75 లక్షల వ్యయంతో రోడ్డు విస్తరణ, డివైడర్,సెంట్రల్ లైటింగ్ నిర్మాణ పనులకు,ములుగు పట్టణ తూర్పు ప్రాంతంలో రూ.5 కోట్ల 95 లక్షల వ్యయంతో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నగరాభివృద్ధి నిధుల ద్వారా రూ.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న కల్వర్టుల నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీగా ఏర్పడినప్పటి నుంచి పట్టణాన్ని మరింత సుందరంగా,ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ములుగు పట్టణాన్ని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టిన మున్సిపల్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పర్యాటకులను ఆకట్టుకునే విధంగా రామప్ప,జంగాలపల్లి, మేడారం ప్రాంతాల్లో అభివృద్ధి చేసిన జంక్షన్ల తరహాలో గట్టమ్మ జంక్షన్‌తో పాటు ములుగు బస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి పరిసరాలు,ఎంఆర్ఓ కార్యాలయం,కలెక్టరేట్ ఎదురుభాగం వంటి కీలక ప్రాంతాల్లో జంక్షన్ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధికి అనుగుణంగా భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రింగ్ రోడ్ నిర్మాణ ప్రతిపాదనపై పరిశీలన జరుగుతోందని,కలెక్టరేట్, యూనివర్సిటీ,దేవగిరిపట్నం ప్రాంతాలను అనుసంధానించే రింగ్ రోడ్ మార్గాలపై పంచాయతీరాజ్,మున్సిపల్ శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి అనుకూలమైన మార్గాన్ని ఎంపిక చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి,మున్సిపాలిటీ చైర్మన్ చింతనిప్పుల చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ సంపత్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్,కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, కో-ఆప్షన్ సభ్యులు,సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల భద్రత కోసమే షీ టీం

**మంచిర్యాల డిసిపి ఎగ్గడి భాస్కర్...**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

లక్షెటిపేట, జూన్ 06 : మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ షీ టీం లను ఎర్పాటు చేయడం జరిగిందని మంచిర్యాల డిసిపి భాస్కర్ అన్నారు. లక్షెటిపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభ(వార్డు సభ) లో అయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డిసిపి మాట్లాడుతూ మహిళలను ఆకతాయిలు వేధించిన వెంటనే 100 కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఫోన్ చేసిన క్షణాల్లో పోలీసులు అక్కడ చేరుకుంటారని ఫోన్ చేసిన వారి వివరాలు బయటకు రాకుండా గోప్యంగా ఉంచుతారన్నారు. ఇటీవల గంజాయితో యువత చెడిపోతుందని మన ప్రాంతంలో ఇప్పటికే గంజాయి సేకరించిన విక్రయించిన వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని, గ్రామాల్లో ఎవరి పైన గంజాయి తాగినట్లు విక్రయించినట్లు అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని గంజాయి మత్తులో యువత చెడిపోవడం కాకుండా వారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, వాళ్ళ జీవితాలను బాగు చేసే వాళ్ళం కావాలంటే తప్పకుండా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కాకుండా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అనుకోని ప్రమాదాలు జరిగినప్పుడు చాలా ఇబ్బందులు పడతామని వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా పాటించాలన్నారు. గ్రామ సభకు హాజరైన డీసీపీ గారిని మున్సిపల్ చైర్ పర్సన్ దొంత అంజలి నర్సయ్య, కమిషనర్ విజయ్ కుమార్ తో పాటు వార్డు కౌన్సిలర్లు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ దిలీప్ కుమార్, లక్షట్టిపేట ఎస్సై గోపతి సురేష్,షీటీం ఎస్సై హైమ, ఏవో శ్రీకాంత్ ,తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



**- లేదంటే ఉద్యమాలు తప్పవు : ఎఐటీయూసీ హెచ్చరిక**
**- ఈ నెల 7, 8 తేదీల్లో కొత్తగూడెంలో సెంట్రల్ కౌన్సిల్ సమావేశాలు**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 6 : సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాలు తప్పవని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) హెచ్చరించింది. ఈ నెల 7, 8 తేదీల్లో కొత్తగూడెంలోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో నిర్వహించనున్న ఏఐటీయూసీ సెంట్రల్ కౌన్సిల్ సమావేశాల్లో కార్మిక సమస్యల పరిష్కారంపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు కొత్తగూడెం ఎమ్మెల్యే, ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. సింగరేణి పరిధిలోని ఆరు జిల్లాల నుంచి 151 మంది ప్రతినిధులు, నాయకులు పాల్గొని సంస్థ భవిష్యత్ కార్యాచరణ, కార్మికుల సమస్యలు, యాజమాన్యం మరియు ప్రభుత్వాల విధానాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. సింగరేణి మనుగడ, అభివృద్ధి కోసం కొత్త గనుల ప్రాజెక్టుల ఏర్పాటు, బొగ్గు ఉత్పత్తి పెంపు, ప్రైవేటీకరణ ప్రయత్నాలను ప్రతిఘటించే కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి రెండు నెలలకు ఒకసారి డైరెక్టర్ స్థాయి, ప్రతి మూడు నెలలకు ఒకసారి సీఎండీ స్థాయి సమావేశాలను గుర్తింపు సంఘంతో నిర్వహించేలా యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించనున్నట్లు వెల్లడించారు. పెండింగ్‌లో ఉన్న 11వ క్యాడర్ స్కీమ్ అమలు, వారసత్వ ఉద్యోగాల పునరుద్ధరణ, ప్రతి నెలా మెడికల్ బోర్డు సమావేశాల నిర్వహణ, మారుపేర్ల సమస్య పరిష్కారం, పర్క్స్‌పై ఆదాయపు పన్ను భారం తొలగింపు, ప్రతి కార్మికుడికి 200 గజాల ఇంటి స్థలం, రూ.30 లక్షల వడ్డీలేని గృహ రుణం మంజూరు వంటి డిమాండ్లు సమావేశంలో ప్రధానంగా చర్చకు రానున్నాయని తెలిపారు. అదేవిధంగా సింగరేణి వ్యాప్తంగా గనులు, విభాగాల్లో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, జెన్‌కో నుంచి రావాల్సిన రూ.53 వేల కోట్ల బకాయిలను తక్షణమే వసూలు చేయాలని సమావేశం డిమాండ్ చేయనుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలు, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలపై భవిష్యత్ పోరాటాలు, ఉద్యమాల రూపకల్పనపై సుదీర్ఘంగా చర్చలు జరగనున్నట్లు వెల్లడించారు.

కొమరయ్య విగ్రహావిష్కరణకు తరలిరావాలి:

ఈ నెల 8వ తేదీ సాయంత్రం 4 గంటలకు సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట పునఃప్రారంభించనున్న మనుబోతుల కొమరయ్య కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు మిరియాల రంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు, కార్మికులు, అభిమానులు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇతర రాష్ట్రాల నుంచి విత్తనాలు కొనొద్దు

**- లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి**
**- జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు.**
**- టేకులపల్లిలో విత్తన దుకాణాల ఆకస్మిక తనిఖీలు**



(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, జూన్ 6 : రైతులు ఇతర రాష్ట్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయకుండా, ప్రభుత్వం అనుమతి పొందిన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ అధికారి వి. బాబూరావు సూచించారు. భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో నిల్వ ఉంచిన విత్తన ప్యాకెట్లను స్కాన్ చేసి అవి ప్రభుత్వం ధృవీకరించిన కంపెనీలకు చెందినవేనా అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన, ధృవీకరించిన కంపెనీల విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి సాగు చేపట్టాలని సూచించారు. నాణ్యమైన విత్తనాల వినియోగంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. తనిఖీల సందర్భంగా విత్తన డీలర్ల రిజిస్టర్లు, లైసెన్సులు, నిల్వ వివరాలను పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి, రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని ఆదేశించారు. నకిలీ లేదా నాసిరకం విత్తనాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని, ఏవైనా అనుమానాలు ఉంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

# ఎరువుల అధిక వినియోగంతో భూసారం దెబ్బతింటుంది



**- ప్రకృతి వ్యవసాయం, పంట మార్పిడితో సుస్థిర ఆదాయం సాధ్యం**
**- భద్రాద్రి జిల్లా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ భరత్.**
**- బోడులో ఖేతీ బచావో అభియాన్ కార్యక్రమం**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

టేకులపల్లి, జూన్ 6 : మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగించడం వల్ల భూసారం తగ్గిపోతుందని, రైతులు విచక్షణతో ఎరువులను ఉపయోగించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ టి. భరత్ సూచించారు. భారత ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన 30 రోజుల "ఖేతీ బచావో అభియాన్" కార్యక్రమంలో భాగంగా శనివారం టేకులపల్లి మండలం బోడు గ్రామపంచాయతీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులు తమ భూముల మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకుని, వాటి ఫలితాల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగం చేపట్టాలని సూచించారు. భూసారాన్ని కాపాడుకోవడం ద్వారా పంటల దిగుబడులు పెరగడంతో పాటు సాగు ఖర్చులు కూడా తగ్గుతాయని వివరించారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వరి రకాలను ఎంచుకుని సాగు చేయాలని, ముఖ్యంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన రకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందుబాటులో ఉన్న డబ్ల్యుజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం-1638 వరి విత్తనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త శివ మాట్లాడుతూ రైతులు ఇంటి వద్దే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయలు సాగు చేయాలని కోరారు. ఒకే రకమైన పంటలను నిరంతరం సాగు చేయడం వల్ల గిట్టుబాటు తగ్గుతోందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్, మునగ, తీగజాతి కూరగాయలు వంటి ఉద్యాన పంటలతో పంట మార్పిడి చేపట్టడం ద్వారా సుస్థిర ఆదాయం పొందడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని వివరించారు. టేకులపల్లి మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ రైతులందరూ ఫార్మర్స్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని, పచ్చిరొట్ట పైర్ల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మనోహర్‌తో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



# సాంస్కృతిక, క్రీడా రంగాల్లోనూ విద్యార్థులు రాణించాలి

**- జిల్లాస్థాయి సూపర్ డాన్స్ సీజన్-3 పోటీల్లో యెర్రా కామేష్.**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

భద్రాద్రి-కొత్తగూడెం, జూన్ 6 : ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు కేవలం చదువులకే పరిమితం కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లోనూ రాణించాలని జై భీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, న్యాయవాది యెర్రా కామేష్ అన్నారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో రైసింగ్ స్టార్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సూపర్ డాన్స్ సీజన్-3 పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులను ఉదయం నుంచి రాత్రి వరకు పుస్తకాలకే పరిమితం చేయడం వల్ల వారిలోని సృజనాత్మకత, కళా ప్రతిభ వెలుగులోకి రావడం లేదన్నారు. ప్రతి చిన్నారిలోనూ ఏదో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, తల్లిదండ్రులు ఆ ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న చిన్నారులు ఎలాంటి బెరుకు లేకుండా అద్భుతంగా నృత్య ప్రదర్శనలు ఇవ్వడం అభినందనీ యమన్నారు. కొత్తగూడెం ప్రాంత కళాకారులు జిల్లా స్థాయికే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయిల్లోనూ ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. డాన్స్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన డాన్స్ మాస్టర్లు కనకం ప్రవీణ్ కుమార్, సందెబోయిన సంపత్ కుమార్‌లను ప్రత్యేకంగా అభినందించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా హైదరాబాద్‌కు చెందిన దీపక్, రచ్చ మధు, భద్రాచలానికి చెందిన శ్యామ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో యామిని ఆసుపత్రి వైద్యులు యామిని కుమారి, నరసింహ సంజీవ్‌రావు, మాజీ కౌన్సిలర్ రుక్మేందర్ బండారి, కొప్పుల యశ్వంత్, సహాస్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.



# నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**- మహిళా సమాఖ్యల ఆర్టీసీ బస్సుల కార్యక్రమం - విద్యార్థుల యూనిఫాంలపై ప్రత్యేక దృష్టి. - ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్**

(ప్రజాలక్ష్యం ప్రతినిధి)

ఖమ్మం, జూన్ 6 : నీట్ పరీక్షను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అధికారులను ఆదేశించారు. అలాగే మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమం విజయవంతం చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభానికి ముందే విద్యార్థుల యూనిఫాంలను సిద్ధం చేయాలని సూచించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు నీట్ పరీక్ష నిర్వహణ, ప్రభుత్వ పాఠశాలల యూనిఫాంల తయారీ, వరి కొనుగోళ్లు, జూన్ 9న జరిగే మహిళా సమాఖ్యల ఆర్టీసీ బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాసరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష కేంద్రాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, బెంచీలు, కుర్చీలు, మూత్రశాలలు తదితర మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష ప్రశ్నపత్రాలను పోలీస్ ఎస్కార్ట్‌తో ప్రభుత్వ వాహనాల్లో మాత్రమే నిర్దేశిత మార్గాల ద్వారా తరలించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని, విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాతే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని ఆదేశించారు. జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మహిళా సమాఖ్యల ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి జిల్లాలోని మహిళా సంఘాల సభ్యులు సకాలంలో చేరుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రయాణ సమయంలో భోజనం, తాగునీరు తదితర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి చైతన్య జైని, పాల్గొన్నారు.

Printed, Published and Owned by **KORUKANTI MANIDEEP PATEL,** Printed at SRI BALAJI PRINTING PRESS, H.No. 4-4-/85, Thilak Road, Karimnagar, Telangana - 505001 and Published at H.No.2-6-242, Ist Floor, Bus stand to Wesly Church Road, Mukarampura, Karimnagar, Karimnagar (Dist.), Telangana-505001, Editor: **GOLI SAMMI REDDY.** RNI.No.TELTEL/2010/35941. Cell: 9394322782, email: prajalakshyam@gmail.com